1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 1
పుటలు : 52

రు. 20 లు

తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి


నుడి నాడు నెనరు

మార్చి 2020

ఉగాది శుభాకాంక్షలు



గుంటూరులో ఆదిధ్వని మహాప్రదర్శన



తెలుగునేలకి
వియత్నాంకి మధ్య
ఎంతో దూరం...కానీ
అక్కడ తొలిరాజ్యం మనదే.
ఆనవాళ్లతో సహా
మీ ముందుకు తెచ్చింది
'జగమునేలిన తెలుగు'
ధారావాహిక

- తెలుగురాష్ట్రాలు : పుండు ఒకచోటా మందు మరొకచోటా?!
- భాషావాణిజ్యమైనా పాలకుల్ని మేల్కొల్పలేదా?!
- తెలుగు గ్రంథ పరిష్కరణలో కంప్యూటర్ సాంకేతికత
- పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద

ప్రజల చైతన్యంతోనే సమస్యకు పరిష్కారం

తెనాలిలో ది. 20-2-2020 న వివిఎస్ఆర్, ఎన్‌విఆర్ కళాశాలలో

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం













సృజనాత్మక ఆలోచనలు మాతృభాషతోనే సాధ్యమని, ద.కొరియా, చైనా వంటి దేశాలు ప్రపంచంలో అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబడ్డానికి వారు తమ మాతృభాషలతో ఎగడమే కారణమని హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యుడు గారపాటి ఉమామహేశ్వరరావు అన్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య, వివిఎస్ఆర్ & ఎన్‌విఆర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం జరిగిన తెలుగుభాష శిక్షణా శిబిరం జరిగింది. మాతృభాష మనుగడనిస్తుందని, భాషతోనే స్వయం సమృద్ధిని సాధించగలమని ఆయన అన్నారు. 'మనతోపాటే కలిసి పుట్టిన మాతృభాషను మన నుంచి వేరు చేయాలని చూడడం దుర్మార్గం. ఆంగ్లం నేర్చుకుంటేనే జీవితమనేది అపోహ. దానిని నమ్మవద్దు. ఎక్కడ పుడితే అక్కడి భాష నేర్చుకోవడం మనిషి స్వభావం. తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడం సరికాదు. తెలుగులోనే అన్ని అంశాలను బోధించాలి' అన్నారాయన. తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతియ అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు మాట్లాడుతూ తెలుగు ప్రజల రాష్ట్రంలో తెలుగులో పాలన జరగాలనే ఇంగిత జ్ఞానాన్ని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కోల్పోయాయి. దీన్ని ఎదుర్కోవాలన్నారు. అమ్మనుడికి ప్రత్యేకించి వ్యాకరణం నేర్చుకోవాల్సిన అవసరం ఉండదని, అదే పరాయి భాషా మాధ్యమంలో నేర్చుకోవాల్సి వస్తే ఆ భాషను నేర్చుకోవడానికే ఎంతో సమయం పోతుందని అన్నారు. డా॥ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ ప్రపంచమంతా తెలుగుభాషను కొనియాడుతుంటే తెలుగు ప్రభుత్వాలు పరాయిభాషల వైపు చూడడం తగదన్నారు. మాతృభాషలో సాధికారత ఉన్నవారికి పరాయిభాష నేర్చుకోవడం ఏమీ కష్టం కాదన్నారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీ నన్నపనేని సుధాకర్ 'ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో తెలుగుభాష పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అమ్మభాషకోసం మనం పోరాటాలు చేయాల్సిందే అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥ నిరంజనరావు అధ్యక్షత వహించారు. కళాశాల తెలుగు శాఖాధిపతి డా॥పద్మావతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి డా॥ వెన్నిసెట్టి సింగారావు, తెనాలి ప్రాంత శాఖ అధ్యక్షుడు డా॥ సామల లక్ష్మణబాబు, కాకతీయ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు శ్రీ దావులూరి లక్ష్మీకాంతరావు తదితరులు సభలోపాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగరంలో పలుచోట్ల మహాత్మాగాంధి, డా॥ బి.ఆర్.అంబేద్కర్, డా.అబ్దుల్‌కలాం, యునెస్కో సందేశాలతో కూడిన పెద్ద హోర్డింగ్‌లను పెట్టి, వాటిని ప్రదర్శిస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త యక్కల శ్రీమన్నారాయణగారికి అభినందనలు తెలుపుతున్నాం.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



మార్చి 2020

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

కార్టూన్లు	రేఖాచిత్రాలు	కంప్యూటరీకరణ
సరసి	**పావులూరి చిదంబరేశ్వరరావు**	**లంకె జనార్దన్**

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

	వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా :	రూ.5000	రూ.7500	--
5 సం॥ :	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥ :	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥ :	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' **ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది**

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.**

తెలుగుభాషోద్యమ పతాకాన్ని అన్ని సందర్భాల్లో, అన్నిచోట్లా ఎగురవేయండి



తెలుగు భాషోద్యమ పతాకం

2 పతాకాలు రు. 100/-
25 పతాకాలు రు. 1000/-

రవాణా ఖర్చును భరించి, కొరియర్‌లోగాని, పోస్టు పార్సిల్‌లో గాని పంపిస్తాము.
కావలసినవారు : సొమ్మును ఎం.ఒ. లేదా డి.డి.ని 'అమ్మనుడి' పేర పంపాలి.

వివరాలకు : **డా॥ సామల లక్ష్మణబాబు,**
ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

గమనిక

ఈ పతాకాన్ని తెలుగు భాషోద్యమ సమాఖ్య రూపొందించి 15 ఏళ్లకుపైగా భాషోద్యమ సందర్భాల్లో వినియోగిస్తున్నది. అయితే దీనిని, సమాఖ్య మాత్రమే కాదు; తెలుగు భాషోద్యమ కారులందరూ - వారే సంస్థకు చెందినప్పటికీ దేశమంతటా ఎక్కడైనా ఉపయోగించవచ్చునని ప్రకటిస్తున్నది. తెలుగు భాషోద్యమ సంకేతంగా ఈ పతాకాన్ని ఉపయోగించండి.

కొత్త జాతీయ విద్యావిధానం చేయనున్న మేలు

త్వరలో తెలుగులో ఎంబీబీఎస్ చేయవచ్చు

భారత విద్యావ్యవస్థను మెరుగుపరచాలని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విద్యా విధానంలో కళాశాల, డిగ్రీ స్థాయి కోర్సులు తెలుగులో అందుబాటులోకి రానున్నాయి.

రాబోయే కొద్ది నెలలలో కేంద్ర ప్రభుత్వం కొత్త జాతీయ విద్యా విధానాన్ని ఈ దిశలో సిద్ధం చేయనుంది.

పాఠశాల స్థాయి, ఇంటర్ స్థాయి నుండి ఉన్నత విద్యాస్థాయికి చేరుతున్న విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది, ఇందుకు కారణం ఇంటర్ లేదా ప్లస్ స్థాయి వరకూ మాతృభాషా మాధ్యమంలో ఉన్న చదువులు, డిగ్రీ స్థాయి నుండి దాదాపుగా ఆంగ్లానికి మారిపోతున్నాయి. అందువలన ఎందరో విద్యార్థులు డిగ్రీలో చేరకపోవటమో, చేరినా మధ్యలోనే చదువును ఆపివేయడం లాంటివి చేస్తున్నారు. ఆల్ ఇండియా సర్వే ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ అనే సంస్థ గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో(వయస్సులవారీగా మొత్తం జనాభాలో విద్యార్థుల నిష్పత్తి) ని లెక్కిస్తుంది. వారి అంచనా ప్రకారం 18 నుండి 23 ఏళ్ళ మధ్య ఉన్న యువత ఉన్నత చదువులను అభ్యసించాలి, అయితే నూటికి కేవలం 26.3 శాతం మంది మాత్రమే ఆ వయస్సు గల వారు చదువుతున్నారని ఈ లెక్కలో తేలింది. మాతృభాషా మాధ్యమ ఉన్నతవిద్య ప్రవేశ పెడితే ఈ నిష్పత్తి మెరుగు చెందుతుందని కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖ ఆశిస్తోందట. ఈ గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో 9-10 తరగతులకు 80 శాతంగా, 11-12 తరగతులు లేదా ఇంటర్మీడియట్ కు 56.2 శాతంగా ఉంది. ఈ నిష్పత్తి ఇంత ఘోరంగా తగ్గడానికి కారణం మాతృభాషా మాధ్యమ చదువుల లేమి అని మంత్రిత్వశాఖ నిర్ధారిస్తూ, ఈ డిగ్రీ స్థాయి నిష్పత్తిని 2023 నాటికి కనీసం 40 శాతానికి పెంచాలన్నది వారి లక్ష్యమని అన్నారు.

మాతృభాషా మాధ్యమ డిగ్రీ స్థాయి కోర్సులపై కేంద్రప్రభుత్వం వత్తిడి తెస్తే డిగ్రీ పాఠ్యప్రణాళికలు కాస్త మెరుగై, ఇప్పటికే తెలుగు మాధ్యమంలో లేని కోర్సుల పాఠ్యపుస్తకాలు తెలుగులో తయారవుతాయి. ఇది తెలుగువారికి ఉపాధిని కలిగిస్తుంది.

మిన్నసోటా(అమెరికా రాష్ట్రం)లో తెలుగు భాషా వారసత్వ మాసంగా 'మార్చి' నెల

తెలుగు అసోసియేషన్ ఆఫ్ మిన్నసోటా (TEAM) వారు మిన్నసోటా ప్రభుత్వం ద్వారా మార్చ్ నెలను "తెలుగు భాషా,



వారసత్వ నెల"గా ప్రకటింప చేశారు. ఈ విషయాన్ని తెలిపే ప్రొక్లమేషన్ ప్రకటన పత్రాన్ని మిన్నసోటా రాష్ట్ర గవర్నరు టిమ్ వాల్జ్ విడుదల చేశారు. ఈ ప్రకటన తెలుగు సంఘాలలో నూతన ఉత్తేజాన్ని నింపి భావితరాలకు తెలుగు భాషా, సంస్కృతి, వారసత్వాలను కాపాడేందుకు ప్రేరేపిస్తుంది.

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF **"AMMANUDI",** MONTHLY MAGAZINE, **Tenali** as required under Rule 3 of the Registration of News Papers (Central) Rules 1956.

FORM IV (See Rule 3)

1. Place of Publcation	:	Angalakuduru
2. Periodicity	:	Monthly
3. Printer's Name	:	SAMALA LAKSHMANA BABU
4. Whether Citizen of India	:	Yes
5. Address	:	D.No.8-386, Angalakuduru Post, Tenali Mandal - 522 211 Guntur Dist., A.P.
6. Publishers Name	:	SAMALA LAKSHMANA BABU
Address	:	As above
7. Editor's Name	:	SAMALA RAMESH BABU
Address	:	As above
8. Names & Addresses of individuals who own the News Paper	:	SAMALA LAKSHMANA BABU As above

I, Samala Lakshmana Babu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

sd/- S. Lakshmana Babu
Publisher

Tenali
29-2-2020

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం
21 ఫిబ్రవరి 2020
యునెస్కో ముఖ్య నిర్దేశకురాలు
శ్రీమతి ఆద్రే అజూలే సందేశం

ఒక్టావియో పాజ్ తన సాహిత్య నోబెల్ బహుమతి స్వీకరణ మహోత్సవం సందర్భంగా అసమానతలను దాటి మనుషులను ఏకం చేసే భాషకున్న శక్తిని గురించి ఇలా అన్నారు : 'మనం దేశాలు అని పిలుచుకునే ఆ భూభాగాలకు రాజకీయంగా, చారిత్రకంగా రూపొన్నిచ్చిన ఘనత భాషలదే' అని. ఈ 22వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, భాషలకు అంకితం చేసుకున్న రోజు, అన్ని భేషజాలను దాటి మనుషులను ఏకం చేసే మాతృభాషలకున్న సత్తాను యునెస్కో నొక్కి చెప్పాలనుకుంటోంది. తమ భాషీయులను దగ్గరకు చేర్చి, కలిసి పంచుకొని బ్రతికే అవకాశాలను అందిస్తూ, మాతృభాషలు సామాజిక కలుపుగోలుతనాన్ని, సృజనను, కల్పనను పెంపొదిస్తాయి. అంతటితో ఆగక మాతృభాషలు సామాజిక వైవిధ్యానికి ఊపిరి పోసి, ప్రపంచ శాంతికి వనరులుగా పని చేస్తాయి. ఇంకా, మాతృభాషలు అందరికీ నాణ్యమైన విద్యను అందించే మన యునెస్కో ప్రయత్నానికి వెన్నుదన్నుగా ఉంటాయి. నిజానికి మాతృభాష కాని భాషలో విద్యాభ్యాసం ఆ వ్యక్తి చదువుకు అడ్డంకిగా మారి, అసమానతలను పెంచుతుందని యునెస్కో చేసిన అనేక అధ్యయనాలు నిరూపించాయి. అయినప్పటికీ, అంచనాల ప్రకారం 40% ప్రపంచ జనాభా తమ మాతృభాష కాని భాషలో చదువుకుంటోంది. మాతృభాషా మాధ్యమంలో ఉన్న ద్విభాషా లేక బహుభాషా విద్యావిధానం ఆ విద్యార్థి నేర్చుకునే క్రమాన్ని మరింత ఆసక్తిదాయకంగా చేయడమే కాకుండా, ఆ విద్యార్థి చుట్టూ ఉన్న ప్రజలతో అవగాహనను, సంభాషణలను పెంచుతుంది.

2020 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కోసం యునెస్కో ఎంచుకున్న అంశం – ఎల్లలు లేని భాషలు. ఈ అంశాన్ని ఎంచుకుని యునెస్కో అందరి దృష్టిని అన్ని భాషలకు ఉన్న అంతర్సంప్రదాయ సంవాదాల ద్వారా శాంతిని స్థాపించగల సత్తా వైపుకు ఆకర్షించాలనుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా, సరిహద్దులకు(ఎల్లలు) అతీతంగా భాషలు తమ భాషీయులను దగ్గర చేస్తాయి. ఒకే మాతృభాష కలిగిన వేరు వేరు ప్రాంతాల వారు సరిహద్దులు దాటి ఏకమవడం వలన సరిహద్దులు అడ్డంకులుగా కాక, మనుషులను కలిపే వారధులుగా మారిపోతున్నాయి.

12 నుండి 15 లక్షల మంది మాట్లాడే స్వాహిలి భాష ప్రపంచంలో సరిహద్దులకు అతీతంగా మాట్లాడే భాషలలో ఒకటి. స్వాహిలి భాష ఆఫ్రికా దక్షిణ ప్రాంత భాషల నుండి, అరబ్బు దేశాల భాషల నుండి, ఐరోపా, భారత భాషల నుండి ప్రభావితమై, ఆయా భాషల పదాలను, స్వభావాన్ని తనలో ఇముడ్చుకుంది. స్వాహిలి తాంజానియా దేశంలో అధికార మరియు జాతీయ భాష, కెన్యా ఇంకా కాంగో దేశాలలో జాతీయ భాష. స్వాహిలి భాష బురుండి, ఉత్తర మొజాంబిక్, యుగాండా, రువాండా, దక్షిణ సోమాలియా ప్రాంతాలలో విరివిగా మాట్లాడబడే భాష. ఆ ప్రాంతాలలో ఇదే ముఖ్యమైన భాష. కొంత తక్కువ స్థాయిలో మలావి, దక్షిణ సూడాన్, జాంబియా దేశాలలో వినిపిస్తుంది కూడా.

సరిహద్దులకు అతీతమైన భాషలు ఆ ప్రాంతాల సాంస్కృతిక వైవిధ్యానికి అద్దం పడతాయి. లాటిన్ అమెరికాకున్న సంపదల్లో ఈ ఎల్లలు లేని భాషలు ముఖ్యమైనవి. ఉదాహరణకు, ప్రాచీన ఇంకా సామ్రాజ్య భాష క్వెచువా ఒక దేశీయ భాషా కుటుంబంగా వికసించింది. నేడు అర్జెంటీనా, బొలీవియా, చిలీ, కొలంబియా, ఈక్వేడర్, పెరూ దేశాలలో కోటి మంది ప్రజలకు మాతృభాష ఈ భాషా కుటుంబానికి చెందినదే. వారి సంస్కృతి– సాంప్రదాయాలలో కనిపించే భిన్నత్వంలో ఏకత్వానికి ఈ భాషలు మాత్రమే కారణం.

వాస్సిలిస్ అలెక్సాకిస్ తన పుస్తకం లా లాంగ్ మటెర్నెల్ లో ఒక విషయాన్ని అంటాడు కదా, "అన్ని భాషలు మనకు నేర్పించేది ఒకటే. మన మూలాలు దాదాపుగా అంతటా ఉన్నాయి అని" మాతృభాషలు సాంస్కృతిక–సామాజిక–రాజకీయ వైవిధ్యానికీ! ప్రపంచ శాంతికీ కావాల్సిన వనరులు కనుక మనం వాటిని కాపాడాలి. ముఖ్యంగా దేశీయ భాషలను. ఈ సందర్భంలోనే, యునెస్కో 2019 సంవత్సరాన్ని దేశీయభాషల సంవత్సరంగా ప్రకటించి ఆచరించింది. మన ప్రపంచంలోని వైవిధ్యతను కాపాడటం చాలా అవసరం. ప్రపంచ సముదాయ దృష్టిని దేశీయ భాషల వైపుకు తీసుకువెళ్ళే అవకాశం ఈ దేశీయభాషల సంవత్సర ఆచరణ ద్వారా కలిగింది.

ఈ సంవత్సరం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ఆచరణ ఒక కొత్త అధ్యాయానికి నాంది కాబోతోంది.

యునెస్కో ప్యారిస్ నగరం(యునెస్కో ప్రధాన కేంద్రం)లో పలు రౌండ్–టేబుల్ సమావేశాలు నిర్వహించి సరిహద్దులకు అతీతంగా మాట్లాడే భాషల ద్వారా, మాతృభాషల ద్వారా సుస్థిర అభివృద్ధిని ఎలా సాధించ గలమోనన్న విషయమై చర్చలు చేయనున్నాము.

యునెస్కో ప్రపంచవ్యాపితంగా ఉన్న ప్రతి ఒక్కరినీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని మానవభాషల సంపదని కొనియాడుతూ సంబరాలు జరుపుకోవాలని కోరుకుంటోంది.

– ఆద్రే అజూలే.

సంపుటి : 6 సంచిక : 1
అమ్మనుడి
మార్చి 2020

సంపాదకీయం

ప్రజల చైతన్యంతోనే సమస్యకు పరిష్కారం

"ప్రజల అజ్ఞానం వల్లనే ప్రభుత్వం శక్తిమంతమవుతుంది. ప్రభుత్వానికి ఇది తెలుసు. అందువల్లనే నిజంగా జ్ఞానాన్ని ప్రసరింప చేయటాన్ని ప్రభుత్వం వ్యతిరేకిస్తుంది" – అని రష్యన్ తాత్వికుడు, గొప్ప రచయిత టాల్‌స్టాయ్ వందేళ్ల క్రితం అన్నాడు. ఇదే సందేశాన్ని ఆయన సమకాలికుడైన మన రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పాడు. ఇదే అభిప్రాయాన్ని మహాత్మాగాంధీ, ఇంకా చాలామంది ఉద్యమకారులూ, సిద్ధాంత వేత్తలూ పలు రీతుల్లో ప్రజల్ని హెచ్చరిస్తూ చెప్పారు.

పాలకుల్లో ప్రజల మేలుకే అంకితమైనవారు అరుదుగా ఉంటారు. కాని, తమ రాజకీయ అవసరాలకు, పదవిని కాపాడుకోవటానికి పెడధోరణులను చేపట్టటంతో వారు దారి తప్పుతారు, ప్రజలను తమ అవసరాలకు వాడుకోవడానికి, భిన్నాభిప్రాయాలను అణచివేయడానికి పూనుకొంటారు. ఈ క్రమంలో వారికి ప్రజలే శత్రువులుగా కన్పడతారు. అణచివేతకు పూనుకొంటారు. సంఘర్షణ అనివార్యం అవుతుంది.

రాజుల ప్రభుత్వాలు పోయి, ఇప్పుడు ప్రజాస్వామ్యం అనో, మరొక పేరుతోనో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. వీటి నేతలు విభిన్న రాజకీయ సిద్ధాంతాల పేరిట, ప్రభుత్వాలను నడుపుతున్నారు. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఆ వ్యవస్థల పాలనలో మనం ఉన్నాం.

రెండువేల ఏళ్లక్రిందట అర్థశాస్త్రవేత్త చాణుక్యుడు ఒక వాస్తవాన్ని బొమ్మకట్టి చూపించాడు. ఎన్ని శాస్త్రాలున్నా, అన్నిటికంటె శక్తివంతమైనది అర్థశాస్త్రం (రాజకీయ శాస్త్రం) అని. ఎందుకంటే – నిర్ణయాధికారం ప్రభుత్వం చేతిలోనే ఉంటుంది గనుక!

ఇప్పుడు మన దేశంలో అమల్లో ఉన్న రాజకీయ వ్యవస్థలో ఎన్ని పాలన, శాసన, న్యాయ నియంత్రణలున్నా, వాటినన్నిటినీ కాదని, కేవలం రాజకీయ వ్యూహాలతో జాతి భవిష్యత్తుకు వ్యతిరేకంగా తమ సొంత ఎజెండాతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రులను రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలూ ఎదుర్కొన వలసిన అవసరం మన ముందుంది. మాతృభాషను కాపాడుకోవడం అంటే ఉనికిని కాపాడు కోవడం మాత్రమే కాదు. అన్ని సహజ హక్కులను కాపాడుకోవడం కోసం, తమ సామాజిక, ఆర్థిక ఉన్నతిని సాధించడం కోసం మన మాతృభాషను కాపాడుకోవాలి. తన మాతృభాషతో అన్ని విధాలైన అసమానతల్నీ అధిగమించి, అన్ని రంగాల్లో ఉన్నత స్థానాన్నందుకొనే అవకాశాలను అందిపుచ్చుకోవడం.

ఐక్యరాజ్య సమితి (యునెస్కో), భారత రాజ్యాంగం, విద్యా హక్కు చట్టం– ఇవన్నీ ఇస్తున్న హక్కులను, అవకాశాలను త్రోసిపుచ్చి, తమ కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వాలను ప్రశ్నించడం, ఉద్యమించడం, నియంత్రించడం ప్రజలందరి కర్తవ్యం. ఈ దిశగా ప్రజల్ని మరింతగా చైతన్యవంతులను చెయ్యడం కోసం భాషోద్యమకారులూ విజ్ఞులైన ప్రజలూ ముందుకు రావాలి.

1. విద్యారంగాన్ని దుర్వినియోగం చేసి, తద్వారా జాతి జనులను ఎన్ని విధాల దెబ్బతీయగలరో అంతగానూ గత ప్రభుత్వాలు చేశాయి. తమ వైఫల్యాన్నుంచి తప్పించుకోవటానికి ఇంగ్లీష్ మీడియం మోజును ప్రజల్లో పెంచాయి. ఇప్పటి ప్రభుత్వం ఈ పరిస్థితిని రాజకీయంగా ఉపయోగించుకొని, పాఠశాల

విద్యలో మొత్తంగా తెలుగు మాధ్యమాన్ని తొలగించి, పూర్తిగా ఇంగ్లీషు మాధ్యమంలోకి నెట్టివేస్తూ నిర్ణయం తీసుకొంది. రాష్ట్ర హైకోర్టు తీర్పు నేడో రేపో రావలసివున్నా, ప్రభుత్వం తన నిర్ణయంతో ముందుకు సాగిపోతూనే ఉంది. తెలంగాణలో ఇలా నిషేధం లేకపోయినా, ఆంగ్ల మాధ్యమానికి తలుపులు బార్లా తెరిచివేశారని మనకు తెలిసిందే.

ఈ పరిస్థితిపై అన్ని వివరాలతో, కర్తవ్యాన్ని నిర్దేశించగల అనేక వ్యాసాలను 'అమ్మనుడి' లో ప్రచురిస్తూనే ఉన్నాం. శాస్త్రీయమైన విద్యావిధానంతో పాఠశాల విద్యను తెలుగు మాధ్యమంతో సంస్కరించవలసిన అవసరాన్ని, తీరును ఆ వ్యాసాలు వివరిస్తాయి. ప్రభుత్వం చేపట్టిన విధానం ఎంత పక్కదారి పట్టిస్తుందో, జాతి జనులను ముఖ్యంగా బలహీన వర్గాలకు ఎంత అపకారాన్ని చేస్తుందో, వారి భవిష్యత్తును ఎంతగా చేటు కలిగిస్తుందో ఆ వ్యాసాలు వివరిస్తాయి.

2. ఇక – పరిపాలనలో తెలుగును ఆనవాలు లేకుండా చేస్తున్న పరిస్థితి గతంలో కంటె ఇప్పుడు భయానకంగా మారింది. పాలకనేతల్లో సంకల్ప బలం శూన్యం కావడమే ఇందుకు కారణం తప్ప, అధికారగణాన్ని తప్పుపట్టి ఉపయోగం లేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే – ముఖ్యమంత్రి ఈ విషయంలో అసలు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

ఈ రెండు అంశాలపైనా బలమైన ఉద్యమాన్ని నిర్మాణం చేయాల్సిన బాధ్యత రెండు రాష్ట్రాల్లోని ప్రతిపక్షాలపై ఉంది. వామ పక్షాలకు ఈ స్పృహ ఉన్నప్పటికీ, వారంతా దీన్నొక బాధ్యతగా తీసుకుని ఒక రాజకీయ ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు ఎందుకు సంకల్పించడం లేదో అర్థం కావడం లేదు. వారు కూడా భావ దారిద్ర్యంతో బాధ పడుతున్నారో, లేక ఇది రాజకీయాంశంగా ప్రయోజనదాయకం కాదని భావిస్తున్నారో?

రాజకీయ అంశంగా తమకు ఇది పనికిరాదని తక్కిన పార్టీలు – ముఖ్యంగా జాతీయ పార్టీలైన భాజపా కాంగ్రెసులు కూడా భావిస్తున్నాయా?

తెలుగుకోసమే ఏర్పడిన పార్టీగా చెప్పుకొంటున్న 'తెలుగుదేశం' పార్టీకి – రెండు రాష్ట్రాల్లో నేటి తెలుగు పతన స్థితికి ఎంతో బాధ్యత ఉంది. చంద్రబాబు హయాంలో ఈ విషయంలో జరిగిన హాని క్షమార్హం కానిది. ఈ అంశంపై ఒక ఆరోపణ పత్రాన్నే (ఛార్జి షీటునే) ప్రకటించవచ్చు. తెదేపా కాంగ్రెస్ పార్టీల పట్టనితనం వల్ల ఏర్పడిన పరిస్థితిని రాజకీయంగా ఉపయోగించుకొన్న కొత్త ముఖ్యమంత్రిగారు జాతిహితాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక శాస్త్రీయమైన భాషా విధానంతో కూడిన విద్యా సంస్కరణలను తెచ్చే బదులు, ప్రజలను పక్కదారి పట్టించే చర్యలకు పూనుకొని జాతి మొత్తాన్నీ మూలాలమీదే దెబ్బకొడుతున్న చర్యలను చేపట్టారు.

ఈ పరిస్థితి నుండి బయట పడడానికి ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలుగా ఉన్న పార్టీలు ఎలా స్పందిస్తాయి? తెలుగువాళ్లు తిరగబడరని, వాళ్లకు భాషాభిమానం లేదనీ అందరూ చేస్తున్న విమర్శకు అర్థం లేదు. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. తెలుగులో చదువుల వల్ల ప్రజల భవిష్యత్తు ఎంత సుందరంగా, ఫలవంతంగా మారుతుందో త్వరలోనే నిరూపితం అవుతుంది. ప్రజలు చైతన్యవంతులై తిరగబడే రోజులు వస్తున్నాయి. సాంకేతికాభివృద్ధితో మాతృభాషలన్నిటికీ మహర్దశ సమీప భవిష్యత్తులోనే రానుంది.

ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లి ధైర్యంగా గొంతు విప్పండి అని రచయితలకు, కళాకారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. భాషోద్యమకారులూ, కళాకారులూ, రచయితలూ అసలు విషయాలను ప్రచారం చేసి, ప్రజల్లో ఆత్మగౌరవ భావనను రగిలించాలి. వివేకాన్ని పెంపొందించాలి. ప్రజలు చైతన్యవంతులు కావడమే ఈ సమస్యకు పరిష్కారం.

తేదీ : 28-2-2020

సామల రమేష్ బాబు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

తెలుగు రాష్ట్రాలలో ఆంగ్ల మాధ్యమం
పుండు ఒకచోటా మందు మరొక చోటా?!

తెలుగు రాష్ట్రాలలో కేజీ టూ పీజీ ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టడానికి రాష్ట్రప్రభుత్వాలు చూపిస్తున్న ప్రధాన కారణం బడుగు వర్గాలవారు ఆంగ్లమాధ్యమ విద్యను కోరు కుంటున్నారనీ, ఐతే వారికి ప్రైవేటు – కార్పోరేటు స్కూళ్లల్లో చేరి ఇంగ్లీషు మాధ్యమ విద్యను నేర్చుకునే వనరులు లేవు కాబట్టి ప్రభుత్వ బడుల్లోనే ఆంగ్లమాధ్యమ విద్యను అందించాలని నిర్ణయించాం అంటున్నాయి. ఆంగ్ల మాధ్య మాన్ని ప్రవేశపెట్టే ముందు అందరి అభిప్రాయమూ తీసుకున్నామనీ ఆ పైనే ఈ నిర్ణయమనీ తేల్చి చెబుతున్నాయి. ఐతే ఈ మధ్య తెలం గాణ సామాజిక అభివృద్ధి నివేదిక–2017, భాగం–3 ఒకటి అంత ర్జాలంలో దొరుకుతోంది. అది చదివి దాన్ని విశ్లేషించితే రాష్ట్రంలో కేజీ టూ పీజీ ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడానికి ఈ రాష్ట్రప్రభుత్వం చూపే కారణాలు ఎంతవరకూ సమంజసమో తెలుస్తుంది.

తెలంగాణాలో, పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వ బడుల్లో చదివేవారి శాతం 42.54 కాగా, ప్రైవేటు- కార్పోరేటు స్కూళ్లల్లో 54.44 శాతంమంది చదువుతుండగా, మిగిలిన 2.2% మంది మాత్రం ప్రభుత్వం నుంచి విరాళాలు పొందుతున్న ప్రైవేటు బడుల్లో చదువుతున్నారు. వీరిలో, గ్రామీణ ప్రాంతాలలో 53.9% శాతం మంది ఇంకా ప్రభుత్వ బడుల్లోనే చదువుతున్నారు. కానీ పట్టణాల్లో మాత్రమే 78% వరకూ ప్రైవేటు కార్పోరేటు బడుల్లో చదువుతున్నారు (చూ. జే. జయరంజన్, ఏస్పెక్ట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ. తెలంగాణా ప్రభుత్వ గణాంకాలు, 2014).

ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, షెడ్యూలు తెగలవారిలో 65%, షెడ్యూలు కులాలవారిలో 50.5% మందీ, ఇతర వెనుకబడిన కులాలవారిలో 37.9% మందీ మిగిలిన కులాల వారిలో 25% మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. అంటే ప్రైవేటు–కార్పోరేటు స్కూళ్లల్లో చదివేవారిలో షెడ్యూలు తెగలకు చెందినవారిని మినహాయించి చూస్తే మిగిలిన అన్ని కులాలకు చెందినవారిలో 50% వరకూ ఉన్నట్లు తెలుస్తోంది.

సామాజిక వర్గం	విద్యాసంస్థల యాజమాన్యం				
	ప్రభుత్వం %	ప్రభుత్వ విరాళాలు పొందిన ప్రైవేటు బడులు %	ప్రభుత్వ విరాళాలు పొందని ప్రైవేటు–కార్పోరేట్ బడులు %	యాజమాన్య వివరాలు తెలియని బడులు %	మొత్తం %
షె.తె.	65.1	2.7	32.2	0	100
షె.కు.	50.5	4.2	45.3	0	100
ఇ.వె.వ.	37.9	3.3	58.8	0	100
ఇ.వ.	25.0	2.0	72.6	0.4	100
మొత్తం	39.1	3.2	57.2	0.1	100

వీళ్లు ప్రైవేటు స్కూళ్లలో చేరడానికి చూపించిన కారణాలను పరిశీలించగా, 34% మంది **ప్రైవేటు బడుల్లో మంచి బడి-వాతావరణం ఉంటుందని** చెప్పడం విశేషం. ఇంకొక 25% మంది ప్రభుత్వ బడుల్లో చదువు సరిగా సాగదని చెప్పడం ఇంకా విశేషమే. మిగిలినవారిలో 9% మందికి ప్రభుత్వ బడుల్లో ప్రవేశం దొరకక ప్రైవేటు స్కూల్లో చదువుతున్నామని చెప్పగా, 6% మంది ప్రభుత్వ పాఠాశాలలు తమకు దగ్గరలో లేనందువలన ప్రైవేటు స్కూల్లో చేరామని చెప్పారు. అయితే 25% మాత్రం తమకు ఆంగ్ల మాధ్యమం కారణంగా ప్రైవేటు స్కూల్లో చేరటం జరిగిందని చెప్పారు. అంటే, ఆంగ్లమాధ్యమం కావాలని కోరి చదువుతున్నవారు 25% మాత్రమే. ఇంకోరకంగా చెప్పాలంటే **ప్రైవేటు బడుల్లో మంచి బడి వాతావరణం ఉంటుందని (34%), ప్రభుత్వ బడుల్లో చదువు సరిగా**

సాగదని(25%), ప్రభుత్వ బడుల్లో ప్రవేశం దొరకక ప్రైవేటు స్కూల్లో చదివేవారు (9%), ప్రభుత్వ బడులు దగ్గరలో లేనందువలన ప్రైవేటు స్కూల్లో చేరినవారు(6%), ప్రత్యేక కారణమేమీ లేనివారిని(1%) అందరినీ కలుపుకుంటే మొత్తం 75% మంది మాతృభాషా మాధ్యమంలోనే చదువుకోవాలనుకున్నవారే.

సామాజిక వర్గం	ప్రభుత్వబడి దగ్గరలో లేదు	ప్రభుత్వబడిలో ప్రవేశందొరకలేదు	ప్రైవేటుబడిలో చదువుబాగా సాగుతుంది	ప్రభుత్వబడి చదువులో నాణ్యత లేదు	ఆంగ్లమాధ్యమం కావటం వలన	ఏమీ చెప్పలేం	మొత్తం %
షె.తె.	0.7	14.0	41.2	32.0	4.7	7.4	100
షె.కు.	10.2	10.0	33.4	16.5	29.8	0.2	100
ఇ.వె.వ.	6.3	8.7	32.4	24.4	27.4	0.8	100
ఇ.వ.	3.7	9.1	37.0	31.6	18.4	0.3	100
మొత్తం	5.1	9.2	33.9	25.3	24.7	0.9	100

షె.తె.=షెడ్యూలు తెగలవారు; షె.కు= షెడ్యూలు కులాలవారు; ఇ.వె.వ = ఇతర వెనుకబడిన వర్గాలు; ఇ.వ. = ఇతర వర్గాలు;

ప్రైవేట్ విద్యా సంస్థలో చేరడటానికి కారణాలు

తెలంగాణాలో మొత్తం 41,337 స్కూళ్లు ఉండగా వాటిలో 70 శాతం ప్రభుత్వ యాజమాన్యంలోనివే. ఇక ప్రభుత్వ సహాయం పొందుతున్న లేక పొందని ప్రైవేటు–కార్పోరేటు స్కూళ్లూ కేంద్ర ప్రభుత్వ రంగంలో ఉన్నవి మొత్తం 30 శాతం మాత్రమే. ఐతే, మొత్తం బడికి వెళ్లే పిల్లల్లో 52 శాతంమంది ప్రైవేటు బడుల్లోనూ 45 శాతంమంది ప్రభుత్వ బడుల్లోను చదువుతున్నారు. ఇంకోరకంగా చెప్పుకోవాలంటే 30 శాతం స్కూళ్లల్లో 52 శాతంమంది విద్యార్థులు చదువుతుంటే 70 శాతం ప్రభుత్వ బడుల్లో 45 శాతం మందే చదువుతున్నారు. ఇది ఒకరకంగా మన ప్రభుత్వ బడుల యాజమాన్యంలోని నిర్వహణా వైఫల్యం కారణంగానే కనబడుతోంది. దీని పర్యవసానం ఏమంటే ప్రైవేటు స్కూళ్లు కిక్కిరిసిపోయి ఉండటమూ ప్రభుత్వ బడులు సగం ఖాళీగానూ ఉంటున్నాయన్నమాట. ప్రభుత్వంలోని అధికారగణం దీనికి ఎలాంటి బాధ్యత వహిస్తారు? ఈ అంకెలు, ప్రభుత్వ బడులు ప్రభుత్వపరంగా నిరాదరణకు ఎలా గురయ్యాయో తెలుస్తోంది.

అసలు విషయం ఏమిటంటే ఎక్కువమంది ప్రజలు తమ పిల్లల్ని ప్రైవేటు – కార్పోరేటు విద్యాసంస్థల్లో చేరుద్దామని అనుకోటం లేదు. కాకపోతే ప్రభుత్వ బడులు చదువుకు అనువుగా లేవనీ, ప్రభుత్వ బడులు అందుబాటులో లేవనీ, ప్రభుత్వ బడులలో విద్య గుణాత్మకంగా లేదనీ, ప్రైవేటు యాజమాన్య స్కూళ్లలో చదువు బాగా సాగుతుందనీ ప్రజలు ఎన్నో కారణాలు చూపిస్తున్నారు. ఐతే ప్రభుత్వం మాత్రం వీటిని ఏమీ పట్టించుకోకుండా ప్రజలు ఆంగ్ల మాధ్యమం అంటే మోజుతో ప్రైవేటు–కార్పోరేటు స్కూళ్ల వైపు వలస పోతున్నారనీ దాన్ని సరిదిద్దడానికే అన్నట్లు ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమాన్ని తొలగించి ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టినట్లు కనబడుతోంది.

ఆంగ్ల మాధ్యమాన్ని ఏరికోరి చదువుకుంటున్నవారు 25% మాత్రమే. అంటే ఆంగ్లమాధ్యమాన్ని కోరుతున్నవారు అధికసంఖ్యలో లేరన్నమాట. పరిస్థితుల ప్రాబల్యంవల్ల మాత్రమే ఎక్కువమందికి ప్రైవేటు–కార్పోరేటు స్కూళ్ల వైపు వలస పోక తప్పటంలేదని తెలుస్తోంది.

ఈ పరిస్థితిని చక్కదిద్దటానికి మొట్టమొదటగా చేయవలసిన పని ప్రభుత్వ బడుల యాజమాన్యాన్ని కట్టుదిట్టం చేయాలి. దానికోసం తల్లిదండ్రులనూ, స్థానికపాలనాసిబ్బందినీ ఉపాధ్యాయులనూ ఆ ప్రాంతంలోని ఉన్నత విద్యాసంస్థలకు చెందినవారినీ సభ్యులుగా పాఠశాల నియంత్రణ మండలి ఒకటి ఏర్పాటు చేయాలి.

మాతృభాషా మాధ్యమాన్ని ప్రైవేటు–కార్పోరేటు స్కూళ్లలో తప్పనిసరి చేయాలి. అందుకు అవసరమైన చట్టం ఒకటి రూపుదిద్దుకోవాలి.

కేజీటూ పీజీ నిర్బంధ ఆంగ్లమాధ్యమ విధానంతో మన సమాజపు ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉంది. రెండు దశాబ్దాలలో లక్షలాదిమంది ఉపాధి ఉద్యోగాలు కోల్పోతారు. మన యువతరం, మన జనాభా పెట్టుబడిగా మనం ప్రపంచ మార్కెట్లను నియంత్రించగల స్థాయిలో ఉన్నాం. మనకు ప్రతి యేటా కావలసిన ఉద్యోగాలు కోట్లల్లో అయితే విదేశాలనుండి వచ్చే ఉద్యోగాలు వేలల్లో మాత్రమే అని మన నాయకులూ మన అధికార గణం తెలుసుకోవాలి. ఈ కోణంనుంచే మన విద్యా ప్రణాళికలూ భాష ప్రణాళికలూ రూపొందాలి.

మాతృభాషకాని భాషలో విద్యాభ్యాసం విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది – 'యునెస్కో'

వెన్నెలకంటి రామారావు
9550367536

'భాషా'వాణిజ్యమైనా పాలకుల్ని మేల్కొల్పగలదా?!

'ఎవరికి తెలియదో అతనికి తెలుసు. ఎవరికి తెలుసో అతనికి తెలియదు. బాగా తెలిసినవారు తెలుసుకోలేదు. బాగా తెలియని వారు తెలుసుకుంటున్నారు...' (కేనోపనిషత్తు)

ఎవరికి భాష తెలియదో వారికి ఆ భాషా వ్యవహారాల నుంచి ఏం సాధించవచ్చో తెలుసు. అదే సమయంలో ఎవరికి భాష తెలుసో వారికి ఆ భాషల నుంచి ఏం సాధించవచ్చో తెలియదు...బాగా తెలిసినవారుగా పేరున్న అగ్రవర్ణాలవారు మాతృభాషా ప్రయోజనాల గురించి తెలుసుకోలేని స్థితికి వెళ్లారు...బాగా తెలుసుకోలేనివారుగా అపవాదు మోస్తున్న బడుగు ప్రజలు ప్రస్తుతం నైపుణ్యంగల మాతృభాషా వ్యవహర్తలుగా, సాహిత్య సాంస్కృతిక వారసులుగా మారుతున్నారు. భాషా విధానం విషయంలో కేంద్ర రాష్ట్ర పాలకుల వైఖరి పరస్పర విరుద్ధంగా ఉండగా, క్షేత్రస్థాయి వాస్తవ విషయాలకు విరుద్ధంగా విశ్వాసాలు, ఉద్వేగాలపై ఆధారపడి ప్రజాభిప్రాయం రూపొందుతున్న నేటి పోస్ట్ ట్రూత్ (సత్యానంతర) యుగంలో శాస్త్రీయమైన మాతృభాషా విధానం ఒక పరిహాసంగా మారింది.

అభివృద్ధి అంటే డబ్బు, సంపద సమీకరణ మాత్రమేనన్న అవగాహన ప్రజల్లో ప్రబలిన చారిత్రక సందర్భంలో ఈ దేశ అగ్ర వర్ణాలు సమకాలీన కార్పొరేట్ శక్తుల వాణిజ్య అవసరాలకు తగ్గట్టుగా ఇంగ్లీషు మాధ్యమాన్ని, విద్యను సంపద సమీకరణ సాధనంగా చేపట్టారు. డబ్బు సంపాదనలో ఆ కుల సమూహాలు విజయవంత మైనప్పటికీ, సామాజిక సంస్కారంలో వలస స్వభావాన్ని, ఫ్యాషన్ పేరుతో అరాచకత్వాన్ని పుణికిపుచ్చుకున్నాయి. వాళ్ళు సంపదపరంగా విజయవంతమైనప్పటికీ, బుద్ధి వికాసపరంగా పరాజితులయ్యారు. అదే సమయంలో గత సమాజాల్లో అదనపు ఆర్థిక అణచి వేతలో భాగంగా బడుగు, దళిత సమూహాలకు విద్య అందుబాటులో లేకపోవడం ఎలా కొనసాగిందో, ఈనాడు నాణ్యమైన ఇంగ్లీషు విద్య అలానే వారికి అందుబాటులోకి రాకపోవడం వాస్తవం. దాంతో సంపద రీత్యా వారు కొంత వెనకంజ వేసినప్పటికీ, గత్యంతరం లేక స్థానిక, మాతృభాషల్లో ప్రావీణ్యం సంపాదించడంతో సమకాలీన సాహిత్య, సాంస్కృతిక వారధులుగా నిలిచారు. అగ్రవర్ణాల బాటలోనే ఆంగ్ల భాషా ఆరాధకులుగా మారిన బడుగు బలహీన వర్గాల వారు కొంత సంపన్నులైనప్పటికీ, మేధో వైకల్యానికి గురయ్యారు. వర్గ, వివిధ రకాల అస్తిత్వ అసమానతలతో కూడిన సమాజంలో భాష కూడా ఒక అసమానతల సాధనంగా మారింది. కుల వ్యవస్థ దొంతరలలో నలిగిపోతున్న జనం... అగ్రవర్ణాల (వర్గాల) పిల్లల వలె తమ పిల్లలూ 'వృద్ధి' లోకి వచ్చేందుకు ఆశపడి, నాసిరకం ప్రమాణాలతో నడిచే ఇంగ్లీషు మాధ్యమ పాఠశాలల్లో అనివార్యంగా చదివిస్తున్నారు. లక్షల రూపాయల ఖర్చుతో ఉన్నత ప్రమాణాలున్న స్కూళ్ళల్లో చదివే అగ్రవర్ణాల పిల్లలు, స్తోమత కరువై నాసిరకం ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదువుకున్న వెనుకబడిన వర్ణాల (వర్గాల) పిల్లలకున్న కారణాలు భిన్నమైనవే అయినప్పటికీ భాషా విధానంలోని లోపాలు వారి వ్యక్తిత్వ, మేధో వికాసాలకు విఘాతం కలిగిస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ ఈ దేశ పాలకులు సత్యానంతర ఓటు బ్యాంకు రాజకీయాల నేపథ్యంలో అశాస్త్రీయ భాషా విధానాలను రూపొందిస్తున్నారు లేకపోతే అమలుకు నోచుకోని మాతృభాషా చట్టాలతో, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రయోజనాలకు, స్వీయ ప్రలోభాలకు తలవొగ్గి భావి తరాలను బలిచేస్తున్నారు.

భాషోద్యమకారుల, భాషా శాస్త్రవేత్తల హెచ్చరికలను పెడ చెవిన పెట్టి, రెండు తెలుగు రాష్ట్రాల పాలకులు ప్రాథమిక విద్య నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యా ముసాయిదా విధానం ప్రకారం ఎనిమిదో తరగతి వరకు మాతృభాషా మాధ్యమంలో చదువులు చెప్పాలి. ఆ తర్వాత 12 వ తరగతి వరకూ మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయవచ్చు. అయితే విజ్ఞాన శాస్త్రాల విషయంలో సాంకేతిక పదాలను సమాంతరంగా ఆంగ్లభాషలో 9వ తరగతి నుంచి పరిచయం చేయాల్సి ఉంటుంది. భాషా విధానం అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర విధానాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఫెడరల్ విధానాలను నీరుగార్చి, కేంద్రీకృత ఆర్థిక, రాజకీయ, భాషా విధానాల వైపు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేయడం, దేశం ఎదుర్కొంటున్న సామాజి కార్థిక – పర్యావరణ సంక్షోభానికి పరిష్కారంగా పాలకులు ముందుకు తెస్తున్నారు. జీఎస్టీ, సీఏఏ తదితర రాజకీయార్థిక చట్ట సవరణల్లో ఆ పరిస్థితి కనపడుతోంది. ఈ నేపథ్యంలో భాషా విధానం కూడా కేంద్ర, రాష్ట్ర రాజకీయాల రంగును పులుముకోబోతోంది.


ప్రపంచం గ్లోబల్ డిజిటల్ విలేజ్‌గా మారిన సందర్భంలో (ప్రపంచీకరణ) ఇంగ్లీషుభాష నేర్చుకోవడంపట్ల అంతర్జాతీయ స్థాయిలో అనివార్యంగా ఆసక్తి పెరిగింది లేదా ప్రలోభపెట్టిందనడాన్ని కాదనలేము. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు అనుబంధంగా ఉండాల్సిన

భాషా వాణిజ్యం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో దాన్ని అందుకునేందుకు తెలుగు భాష తెలిసిన తర్వాతి తరాలను తయారు చేసుకోవాలనే ఎరుక రాష్ట్ర పాలకుల్లో కొరవడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పొలిమేర దేశాల్లోని స్థానిక మాతృభాషల డిమాండ్ నేడు లక్షల డాలర్ల నిధిగా మారింది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని మాతృభాషలను ఇతోధిక అభివృద్ధికై పాలకులపై ప్రజలు తగు ఒత్తిడి తీసుకురావలసి ఉంది.

ద్రవ్య తదితర సేవల రంగాలు జాతులు, ప్రాంతాలు తదితర భౌగోళిక సరిహద్దులను చెరిపేస్తూ బ్రహ్మాండమైన స్థాయిలో అవతరించడంతో వివిధ భాషా జాతీయుల మధ్య ఆదాన ప్రదానాల అవసరం మరింతగా పెరిగింది. అంత ర్జాతీయ సమాజానికి ఒక అనుసంధాన భాష అవసరమైన సందర్భంలో ఆవశ్యకత అనివార్యత నుంచి ఇంగ్లీషు భాషకు ప్రాధాన్యత పెరిగింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రమైన అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల భాషలు పొలిమేర దేశాలైన ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల భాషల అభివృద్ధి కుంటుపడింది. ప్రపంచీకరణ నేపథ్యంలో స్థానిక వృత్తులు ధ్వంసమై సాఫ్ట్ వేర్, వైద్య రంగాలు వేగంగా వృద్ధి చెందడం, అందుకు అనువైన కార్పొరేట్ సంస్థల్లోను, విదేశాల్లోనూ ఉపాధి కొరకు వలసలు వెళ్ళేందుకు అనువైన భాషా వ్యవహార నైపుణ్యాలున్న తరం తయారు కావలసిన అవసరం ఏర్ప డింది. ఈ నేపథ్యంలో ఆంగ్లభాష ఉపాధిభాషగా మారి దేశంలోనూ, రాష్ట్రంలోను ఆంగ్ల మాధ్యమం స్కూళ్ళు (కార్పొరేట్, నాన్ కార్పొరేట్) వేలంవెర్రిగా సరైన ప్రమాణాలు లేకుండా, నాసిరకం నైపుణ్యాలు గల సిబ్బందితో వెలిసాయి. తెలుగు భాషాజాతి సాధించిన స్థానిక విజ్ఞానం పునాదిగా సాగే చేతి వృత్తులు, ఉపాధి మార్గాలు ఆవిర వడంతో తెలుగు వ్యవహారిక భాష (సహజభాష) స్థాయికే పరిమి తమై, వివిధ సామాజిక, విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధి క్రమంలో రూపొందవలసిన కృత్రిమ భాషాప్రవాహం ఎండిపోయింది. సొంత వైజ్ఞానిక, పారిశ్రామిక అభివృద్ధి పథం కుప్పకూలిపోయి సామ్రాజ్య వాద అభివృద్ధి నమోదుపైనే ఆధారపడడంతో భాషాభివృద్ధిలో కీలక భూమిక పోషించే కృత్రిమ భాష (విజ్ఞాన శాస్త్రాల పరిభాషలు) అంతరించిన పర్యవసానంగా తెలుగు సహజ భాషాభివృద్ధిక్రమం దారి తప్పింది.

అయితే 2008 నుంచి కొనసాగుతున్న ప్రపంచ సామాజికార్థిక – పర్యావరణ సంక్షోభం కారణంగా వస్తూత్పత్తి రంగం మరింతగా కుదేలై, ద్రవ్య, సాఫ్ట్‌వేర్ సేవల రంగం మరింతగా విజృంభించింది. ఏకధ్రువ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కేంద్రం బద్దలై, బహుళ కేంద్రక ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. దాంతో అమెరికా, చైనా, ఈయూ, రష్యా తదితర అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాద దేశాల మధ్య ఆధిపత్య పోటీ కొనసాగుతోంది. దాంతో అభివృద్ధి చెందిన పెట్టుబడి దారీ దేశాలలో కంటే వ్యవసాయ ప్రధాన దేశాల్లో ఆర్థిక సంక్షోభ ప్రభావం కొంత తక్కువగా ఉన్న కారణంగా గ్లోబల్ కార్పొరేట్ శక్తుల కన్ను వాటిపై పడింది. వెనకబడిన, వర్ధమాన దేశాల్లోని మధ్య తరగతి, కులీన వర్గాల కొనుగోలు శక్తి పునాదిగా ఆ మార్కెట్లను కొల్లగొట్టేందుకు అవి ప్రణాళికలు రచించాయి. అందులో భాగంగా స్థానికీకరణను శక్తిమంతమైన మార్కెటింగ్ సాధనంగా ఆ సంస్థలు ఎంచుకున్నాయి. మరీ ముఖ్యంగా స్థానిక భాషల్లోనే మార్కెటింగ్ కార్యకలాపాలు నిర్వహించడం వల్ల మార్కెట్‌లో ఆధిపత్యం సాధిం చాలనే కార్యాచరణను చేపట్టాయి. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన అనువాదం, స్థానికీకరణ వంటి సేవలకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ పెరిగింది. కేంద్రంలోని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని భాషల నుంచి పొలిమేర వ్యవసాయ ప్రధాన దేశాల్లోని స్థానిక భాషల్లోకి అనువాదం, స్థానికీకరణ ప్రక్రియలు చేపట్టవలసిన డిమాండ్ వేగంగా పెరుగుతోంది. గత ఏడాది సీఎన్‌ఏ రిసెర్చ్ గ్లోబల్ మార్కెట్ సంస్థ అధ్యయనం ప్రకారం 'భాషాసేవలు, సాంకేతికశాస్త్ర' (language service and technology https://www.statista.com/statistics/257656/size-of-the-global-language-servicesmarket) పారిశ్రామిక రంగం 2019లో 49.60 బిలియన్ డాలర్లకు (35,63,22,43,20,000 Indian Rupee) చేరుకుందనీ, 2021 నాటికి అది 56.18 బిలియన్ డాలర్ల (ఐదు లక్షలా 61వేల కోట్ల రూపాయలు) స్థాయికి పోతుందని అంచనా. ట్రాన్స్ పర్‌ఫెక్ట్, లయన్ బ్రిడ్జ్, లాంగ్వేజ్ లైన్ సొల్యూషన్స్, ఎస్ డీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్ హెల్డింగ్స్, ట్రాన్స్‌లేట్ ప్లస్, కీవర్డ్స్ స్టూడియోస్, అప్పెన్, హెగార్త్ వరల్డ్ వైడ్, వుయ్ లోకలైజ్ అనే పది అత్యున్నత సంస్థలు ఇప్పుడు అనువాద రంగంలో గ్లోబల్ ఆధిపత్యం వహిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా భాషా సేవలు అందించే సంస్థలు 589 ఉన్నాయని ఆ అధ్యయనం తెలిపింది . ఈ మధ్యకాలంలో గ్లోబలైజేషన్, ఇ–కామర్స్, ఆన్లైన్ కంటెంట్ విపరీతంగా పెరగడం వల్ల అనువాద మార్కెట్ బాగా పుంజుకుంది. డిమాండ్‌కు, అవసరాలకు తగిన భాషా సేవలు అందించడం వరకే మార్కెట్ ఇంతవరకు పరిమితమైంది. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, యంత్ర అభ్యసనం వంటి సాంకేతిక పరిజ్ఞానం దూసుకొస్తుండడంతో, నేర్పించడం, అనువదించడం, స్థానికీకరణ (లోకలైజేషన్) ప్రక్రియలు కొత్త పుంతలు తొక్కుతు న్నాయి. గ్లోబల్ భాషల నుంచి స్థానిక భాషల్లోకి అనువదించాల్సిన అవసరం విపరీతంగా పెరగడంతో దాని పరిమాణం, అందులోని విషయాన్ని తయారుచేసే తీరు, వినియోగించే పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. గ్లోబల్ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల పరిధి మేరకే స్థానిక భాషల వినియోగం ఉంటుందన్నది విదితమే.

అయితే స్థానిక భాషలను వినియోగం పునాదిగా పెరుగుతున్న గ్లోబల్ డిమాండ్‌ను వినియోగించుకొని మాతృభాషల అభివృద్ధికి బాటలు వేయవలసిన తరుణమిది. స్థానిక భాషలు గ్లోబల్ డిమాండ్ కారణంగా ఉపాధి భాషలుగా



మారుతున్నాయి. ప్రస్తుతం తెలుగు భాష కూడా ఒక కోణంలో ఉపాధి భాషగా మారుతున్న పరిస్థితిని పాలకులు సమర్థంగా వినియోగించుకోవాలి. సమకాలీన గ్లోబల్ వాణిజ్య ధోరణిని అర్థం చేసుకోకుండా తెలుగు రాష్ట్రాల పాలకులు, కేవలం దళిత, బహుజన ప్రజానీకం ఓటు బ్యాంకును సుస్థిరం చేసు కోవాలన్న లక్ష్యంతో అరకొర ప్రమాణాలతో తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నారు. **విచిత్రమేమంటే అమెరికాకు చెందిన ఒక భాషా వాణిజ్య సంస్థ 'లయన్ బ్రిడ్జ్' చెన్నై కేంద్రంగా ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదం చేయడం, స్థానికీకరించడం వంటి వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించడం సిగ్గుచేటు. లక్షల కోట్ల రూపాయల్లో ఉండ బోయే భాషా వాణిజ్య కార్యకలాపాలపై ఆధిపత్యం వహించేందుకు అవే విదేశీ కార్పొరేట్ సంస్థలు దేశంలోకి, రాష్ట్రంలోకి దూసుకు రాబోతున్నాయి. దేశంలో అమలవుతున్న భాషా విధానాల వల్ల కొత్త తరం పిల్లలు మాతృభాషా నిరక్షరాస్యులుగా మారిన నేపథ్యంలో లక్షల కోట్ల మార్కెట్లో మనవాళ్ళ స్థానమేమిటో ఊహించుకోవచ్చు. ఇలాంటి సందర్భంలో తెలుగును నిర్లక్ష్యం చేస్తూ బడుగు, బలహీన వర్గాల ప్రజల ప్రయోజనాలను ఆశించి 'ఇంగ్లీషు మీడియం' లోనే పాఠశాల విద్య'** అని తెలుగు పాలకులు బాకాలూదుతున్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యావిధానం సైతం వీరి బుర్రలకు ఎక్కలేదు. ఇప్పటికే కొత్త తరాలకు తెలుగు భాష అంతగా రాకపోవడంతో అనువాద సామర్థ్యాలున్న వ్యక్తులు రెండు రాష్ట్రాల్లో తగినంతగా లేరు. భాషా వాణిజ్యం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో దాన్ని అందుకునేందుకు తెలుగు భాష తెలిసిన తర్వాతి తరాలను తయారు చేసుకోవాలనే ఎరుక రాష్ట్ర పాలకుల్లో కొరవడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పొలిమేర దేశాల్లోని స్థానిక మాతృభాషల డిమాండ్ నేడు లక్షల డాలర్ల నిధిగా మారింది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని మాతృభాషలను ఇతోధిక అభివృద్ధికై పాలకులపై ప్రజలు తగు ఒత్తిడి తీసుకురావలసి ఉంది.

రచయిత సామాజిక, రాజకీయ,
ఆర్థికాంశాల విశ్లేషకుడు

భాష లేకపోతే భావంలేదు;నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది

ఆచార్య పులికొండ సుబ్బాచారి
9440493604

తెలుగు గ్రంథపరిష్కరణలో కంప్యూటర్ సాంకేతికత

ఏ కోణంలో ఆలోచించినా తెలుగు భాషకి సంబంధించి కంప్యూటర్ వినియోగం ఇటీవలే అని చెప్పాలి. ఇప్పుడు కూడా నూటికి తొంబైమంది కంప్యూటర్ ని టైపు యంత్రానికి ప్రత్యామ్నాయంగానే వినియోగిస్తున్నారు. కాని గడచిన మూడు దశాబ్దాలతో పోలిస్తే ఎంతో పరిణామం జరిగింది. విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ కూడా లేనప్పుడు డాస్ మాత్రమే వినియోగిస్తున్నప్పుడు అంటే గ్రాఫిక్ యూజర్ ఇంటర్ ఫేస్ అనేది కూడా లేనప్పుడు కూడా డాస్ మీద ఒకటి రెండు ఫాంటులను మాత్రమే వినియోగించే దశలో కూడా వర్డ్‌స్టార్ వంటి సాఫ్ట్‌వేర్ పైన తెలుగును టైపింగ్ కి వినియోగించేవారు. ఇది 1980 దశకం నాటి మాట. కనీసం ఒక పది సంవత్సరాల క్రితం కూడా కంప్యూటర్ పని అందుబాటులో ఉన్నప్పుడు కూడా తెలుగు సిద్ధాంత గ్రంథాలను చేతి రాతతో కాని లేదా మాన్యువల్ టైపింగ్ చేయించి కాని సమర్పించే దశ ఉంది. ఇక ఇప్పటికి నూటికి నూరు శాతం అభ్యర్థులు విశ్వవిద్యాలయాలలో వారి సిద్ధాంత గ్రంథాలను కంప్యూటర్ ద్వారానే డిటిపి చేయించి సమర్పిస్తున్నారు. మరొక కోణంలో చెబితే గ్రంథ ప్రచురణ అనేది లెటర్ ప్రెస్‌ని దాటి ఆఫ్‌సెట్ ప్రెస్ యుగంలోనికి వచ్చింది కూడా 1970-80 దశాబ్దాల మధ్యనే అని చెప్పాలి. ఇకపోతే ఈనాడు లెటర్ ప్రెస్‌లు అనేవి లేనేలేవు. గ్రంథాల ముద్రణ అంతా డిటిపి అంటే కంప్యూటర్ సహాయం ద్వారానే జరుగుతూ ఉంది.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే. నేటికీ తెలుగు వినియోగం ఏమేరకు కంప్యూటర్ లో ఉంది అని వెదికితే కేవలం ప్రచురణ రంగం కోసమే తెలుగు వినియోగం తొంబై శాతం ఉంది అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇక్కడ ప్రచురణ రంగం అంటే కేవలం పుస్తకాల ప్రచురణకు మాత్రమే కాదు. కాని పత్రికల ప్రచురణ కూడా ఈ రంగంలోనికే చేరుతుంది.

తెల్లవారి ఉదయం అయ్యేసరికే కనీసం అన్నీ కలిపితే 50 లక్షల ప్రతుల వరకు తెలుగు దినపత్రికలు అచ్చు అవుతూ ఉన్నట్లు సమాచారం ఉంది. ఇవికాక వార పత్రికలు మాస పత్రికలు కూడా ఉన్నా వాటి పరిమాణం దినపత్రికలతో పోలిస్తే ఒక పదిశాతం అని చెప్పవచ్చు. తర్వాత ఈ దిన పత్రికలు ప్రతిదీ ఇంటర్‌నెట్‌లో టెక్స్‌ట్ రూపంలోను పిడిఎఫ్ రూపంలోనూ (portable document formate అంటే చిత్రం రూపంలో ఉంటుంది. టెక్స్‌ట్‌ని కాపీ చేయలేము.

కంప్యూటర్ వినియోగం ఈ రంగంలో ఇలా చాలా విస్తృత రూపంలో ఉంది. అంటే తెలుగు భాషకు కంప్యూటర్ ని వినియోగించడం అనేది తొంబై శాతం ఇలా గ్రంథ ప్రచురణ పత్రికా ప్రచురణకే పరిమితం అయిందని చెప్పాలి. గ్రంథ ప్రచురణ రంగంలో ఆధునికత ఇలా ఉండగా గ్రంథ పరిష్కరణ అనేది నేటి గ్రంథాలకు సంబంధించి ఉండదు. అది ప్రాచీన భాషకు ప్రాచీన గ్రంథాలకే పరిమితం అవుతుంది. ఇక మిగతా పదిశాతం కంప్యూటర్ వినియోగం అనేది చాలా పరిణతమైన సాంకేతికత కలిగిన పనులకు వినియోగిస్తున్నారు. ఆ సాంకేతిక అంశాలు ఎలా ఉన్నాయో చూద్దాం.

ఇంటర్ నెట్ లో తెలుగుకే కాదు ఇతర భారతీయ భాషలు అన్నింటి వినియోగంలో ఫాంటులు వినియోగం చాలా చిక్కు సమస్యగా ఉండేది. ఇంగ్లీషు ఫాంటులు ఏదేశంలోనైనా ఎక్కడైనా వారికి దొరుకుతాయి. ఒక చోటినుండి పంపిన సమాచారం అదే ఫాంటు వేరే చోట లేకపోతే అవతలి వారికి అది కనిపించదు. కాని తెలుగు ఫాంటులు అలా కాదు ఇక్కడ ఉన్న ఫాంటులు అంటే ఇక్కడ ఒక కంప్యూటర్ వాడే ఫాంటు వేరే చోట ఉండదు. నెట్ లో అందరికీ అందుబాటులో ఉండే ఫాంటులు రావడానికి చాలా కాలం పట్టింది. మొదటిలో డైనమిక్ ఫాంటులు ఉండేవి. లేదా ఫైలుతోపాటు ఫాంటును కూడా పంపవలసి వచ్చేది. కాని నేడు యూనికోడ్ ఫాంటులు వచ్చిన తర్వాత తెలుగు ఫాంటులు కనీసం రెండు మూడు అయినా మనం కొనే కంప్యూటర్లు అన్నీ అందిస్తున్నాయి. విండోస్, లైనక్స్, ఐమ్యాక్ కాని లేదా ఏండ్రాయిడ్, ఐఫోన్ అయినా సరే ప్రపంచ వ్యాప్తంగా కొనే ఏ కంప్యూటర్ అయినా లేదా స్మార్ట్ ఫోన్ అయినా సరే కనీసం రెండు తెలుగు ఫాంటులు లేదా 20 భారతీయ భాషలకు రెండు ఫాంటులను ఇవి అన్నీ అందిస్తున్నాయి. కాబట్టి తెలుగులో సమాచార వినియోగం లేఖల రూపంలో చిరుసందేశాల (sms) రూపంలో పంపడం నేడు పూర్తిగా సాధ్యం అవుతూ ఉంది.

ఈ రకంగా ప్రాథమికంగా కంప్యూటర్ లో తెలుగు వినియోగం సమాచార మార్పిడికి వాడుకుంటున్నారు. అదెలా అంటే ఈమెయిల్ పంపడానికి నేడు దేశంలోపల మన దేశంనుండి వెలుపలకు చాలా బాగా విస్తృతంగా వినియోగిస్తున్నారు.

విద్యావంతులైన వారు నగరాలలోనే కాదు గ్రామాలలో నివసించేవారు కూడా వారి పిల్లలు దేశంలోని వేరు వేరు ప్రాంతాలలో ఉన్నవారు విదేశాలలో ఉన్నవారు కూడా పాతకాలంలో లాగా ఉత్తరాలు రాయడానికి బదులు నేడు ఈ మెయిల్ ద్వారా సమాచారాన్ని చాలా విస్తృతంగా బట్వాడా చేస్తున్నారు. చదువు రాని వారు కాని లేదా కంప్యూటర్ అక్షరాస్యత (digital or computer literacy) లేని వారు కూడా వారికి దగ్గరలో ఉన్న ఇంటర్ నెట్ దుకాణాలకు పోయి వారి పిల్లలకు ఈమెయిల్ ఉత్తరాలు పంపగలుగుతున్నారు. ఇది సాంకేతిక వినియోగంలో చాలా ప్రాథమికమైంది. ఇక ఉన్నత స్థాయిలో ఎలా ఉందో చూద్దాం.

కంప్యూటర్ లో చేసిన తెలుగు పాఠ్యాన్ని వేరే భాషకు చెందిన లిపిలో చదవడం నేడు సాధ్యం. సిడ్కా వారు దీన్ని కనీసం రెండున్నర దశాబ్దాల క్రితమేఅందుబాటులోనికి తెచ్చారు. అంటే ఇక్కడ భాషకు లిప్యంతరీకరణ మాత్రమే జరుగుతుంది.

అంటే తెలుగు అక్షరాలనే వేరే భాషల అక్షరాలలోనికి మార్చుకోవచ్చు. రోమన్ అక్షరాలోనికి కూడా మార్చుకోవచ్చు. ఇది కేవలం లిప్యంతరీకరణ మాత్రమే అంటే transliteration. ఇక దీని తర్వాత తెలుగు భాషలోని సమాచారాన్ని వేరే భాషలోనికి కంప్యూటర్ యంత్రం ద్వారా అనువాదం చేయడం అనేది చాలా పెద్ద సాంకేతిక పరిణామంగా చెప్పాలి. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని CALTS (Centre for Applied Linguistics and Translation Studies) అనే సంస్థ, కంప్యూటర్ సైన్స్ విభాగం వారు ఈ పనికి తొలిగా నడుం కట్టారు. ఒక దశాబ్ద కాలంలో తెలుగునుండి హిందీకి హిందీనుండి తెలుగుకు అనువాదం చేయించే పరికరాన్ని వారు తయారు చేశారు. ఇది ఆధునిక తెలుగు భాషని 90శాతం కచ్చితత్వంతో అనువదించేలాగ తయారు చేశారు. యంత్రం అనువాదం చేసిన తర్వాత ఒక వ్యక్తి దాన్ని ఎడిట్ చేసుకొని పూర్తి కచ్చితంగా మార్చుకోవలసి ఉంటుంది.

దీని తర్వాత ఇదే కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగు నుండి కన్నడకు కన్నడనుండి తెలుగుకు అనువాద యంత్రాన్ని తయారు చేశారు. దీనికి సంబంధించే తెలుగులో నిఘంటు నిర్మాణానికి సంబంధించి ఉపయోగమయ్యే పరికరాలను, పదవిశ్లేషిణి పరికరాన్ని కూడా తయారు చేశారు. కానీ ఈ సాఫ్ట్‌వేర్ యంత్రాలు ఇంకా పబ్లిక్ వినియోగానికి అంటే ప్రజలందరి వినియోగానికి ఉచితంగా కాని అమ్మకానికి కాని అందుబాటులోనికి రాలేదు.

భారతీయ భాషలకు సంబంధించి కంప్యూటర్ వినియోగంలో వచ్చే చాలా వరకు పెద్ద సమస్య కంప్యూటర్‌లో వినియోగించే సాఫ్ట్‌వేర్ పరికరాలు అన్నీ ఇంగ్లీషుకోసం తయారుచేసినవి కావడమే. ఆపరేటింగ్ సిస్టమ్ కాని లోపల ఉండే ఇతర పరికరాలు కానీ తెలుగుకోసం కాని ఇతర భారతీయ భాషల కోసం కాని చేసినవి కాదు. సిడాక్ వారు లీప్ ఆఫీస్ అనే పరికరం ఒకటి తయారు చేశారు. ఇది కేవలం భారతీయ భాషల కోసం తయారు చేసినది. ఇది ఒకటి తప్ప మరొకటి కనిపించదు. కానీ ఇది కూడా విండోస్ ప్లాట్‌పారం మీద పనిచేసేలాగా వారి అనుమతి తీసుకొని దాని సాంకేతికతకు అనుకూలంగా చేశారు. ఇది కాక సిడాక్ వారే విండోస్ ఆపరేటింగ్ సిస్టం లాగే BOSS అంటే దీని వివరణ ఏమంటే భారతీయ ఆపరేటింగ్ సిస్టమ్ సొల్యూషన్స్ అని. ఇది ఒక ఆపరేటింగ్ సిస్టమ్. కాని ఇది లినక్స్ మాదిరిగా ఓపెన్ సోర్స్ సిస్టమ్. కాగా భారతీయ భాషలకోసం ప్రత్యేకంగా చేసిన విండోస్ వంటి ప్లాట్ ఫామ్ మంచిది ఇంకా తయారు కావలసే ఉంది. పైన చెప్పిన లీప్‌ఆఫీస్ కూడా విండోస్ మీదనే పనిచేస్తుంది.

ఇలా ఇంగ్లీషు భాషకోసం చేసిన సాఫ్ట్‌వేర్ పరికరాలపైనే తెలుగులో పనిచేసేలాగా చేయడంలోనే సమస్యలు అన్నీ వస్తున్నాయి. విండోస్ లో పనిచేసేలాగా భారతీయ భాషలకు ప్రత్యేకమైన ఆఫీస్ సాఫ్ట్‌వేర్ ఇంకా ప్రత్యేకంగా తయారు చేయవలసే ఉంది. మనం తెలుగు కోసం ఫాంటులు చేసుకునేటప్పుడు కూడా ఇలా ప్రత్యేకంగా విండోస్ కోసం దానిలో పనిచేసే MS Office ని దృష్టిలో పెట్టుకొని తయారు చేసుకొన వలసి ఉంది. ఇటీవలి కాలంలో వచ్చిన unicode ఫాంటులు ఈ సమస్యను తీరుస్తున్నాయి. ఇవి విండోస్, మ్యాక్, లినక్స్ అన్నింటిలోను పనిచేస్తున్నాయి. అయినా ఇవి విండోస్‌లో అంత బాగా మ్యాక్ లో చేయడం లేదు. అక్కడ పనిచేసినా డిస్‌ప్లే లో కొన్ని సార్లు సమస్యలు వస్తున్నాయి. ఇన్ని సమస్యల పరిమితుల మధ్యన ఇంగ్లీషు పరికరాలలో తెలుగు పనిచేస్తూ ఉంది.

ఇక మన గ్రంథ పరిష్కరణ విషయంలో మనకు బాగా ఉపకరించే పరికరాలు ఇంగ్లీషుకు ఎలా ఉన్నాయి. అవి తెలుగులో లేదా ఇతర భారతీయ భాషలలో పనిచేయడానికి అవి ఏస్థితిలో ఉన్నాయి. ఇక పైన ఏ స్థితిలో అవి పనిచేస్తే మనకు గ్రంథ పరిష్కరణ అనేది సాధ్యం అవుతుంది అని ఆలోచించాలి.

గ్రంథ పరిష్కరణ అంటే ఇక్కడ నేటి రూపంలో ఉన్న అచ్చుకాని కావ్యం అనే కేవల అర్థంలో తీసుకోవడం లేదు. గ్రంథి అంటే ముడి అని అర్థము. గ్రంథనము అంటే తొలి అర్థము ముడివేయబడినది అని అర్థం. తాటాకులను కలిపి ముడి వేసింది కాబట్టే పుస్తకము అంటే గ్రంథము అనే అర్థం సిద్ధించింది. మనకు సాధారణంగా గ్రంథపరిష్కారము అంటే ప్రాచీన కావ్యాలను కాని శాస్త్రాలను కాని తాటాకులలోను చేతిరాత ప్రతులలోను ఉన్న వాటిని అన్నికోణాలలో పరిశీలించి అవసరమైన మార్పులు చేసి అచ్చుకు సిద్ధం చేసి అచ్చువేయడం అనే భావంలో స్థిరపడింది. కాని గ్రంథ పరిష్కారము అనే కార్యక్రమంలో ఇంకా ఇతరమైన పనులుకూడా ఇమిడి ఉండడాన్ని చెప్పవచ్చు.

ఒకటి తాళపత్రాలలో ఆనాటి కాలంలో అలవాటులో ఉన్న తెలుగు లిపిని చదివి అర్థం చేసుకొని వాటిని తిరిగి కాగితాల మీద రాసి పద్యాలను బారుగా ఒకే గీతలో ఉన్న వాటిని లేదా వివిధమైన చిహ్నాలతో ఉన్నవాటిని కాని ప్రాచీన లేఖన సంప్రదాయాలలో ఉన్న వాటిని కాని నేటి లిపి సంప్రదాయంలోనికి మార్చి పద్యాలను పాద విభజన అనేది ఆధునిక రూపంలో చేసి గ్రంథం ఎక్కడైనా పోయినా దానిని వేరు వేరు ప్రతులలో వెదికి పూర్తి చేసి ఆధునిక రూపంలో అచ్చుకు తయారు చేయడం మొత్తం ప్రక్రియ గ్రంథ పరిష్కరణ కార్యం అవుతుంది.

ఇవి కాక కొన్ని కావ్యాలు కాని శతకాలు కాని మనకు రాగిరేకుల మీద లభిస్తాయి. వీటిలో కూడా కొంత ప్రాచీన కాలం నాటి లేఖన సంప్రదాయలు ఉండవచ్చు. లేదా మధ్యయుగాలనాటి లేఖన సంప్రదాయాలు ఉండవచ్చు. ఇంకా తాటాకులు తయారు చేయడానికి రాగిరేకుల మీద చెక్కడానికి తేడా ఉంటుంది. ఆ లిపి సంప్రదాయాలను కూడా తెలుసుకొని ఆధునిక రూపంలో గ్రంథాన్ని తయారు చేయాలి.

ఇవి కాక రాళ్ల మీద, స్తంభాల మీద, ఆలయాల గోడలమీద రాజులు, దండనాయకులు, ఇతర మంత్రులు కూడా దానాలు ఇచ్చిన సందర్భాలలో శాసనాలు వేయించారు. ఈ శాసనాలు కూడా ప్రాచీన కాలం నాటివి అంటే ప్రాఙ్నన్నయ యుగానివి మధ్యయుగానివి ఆనంతర ప్రబంధ యుగానివి ఉండవచ్చు. వాటిని వాటిలోని లేఖన

సంప్రదాయాలను తెలుసుకొని అర్థం చేసుకొని వాటిని నేటి తెలుగులోనికి తర్జుమా చేసి వాటిలో ఉన్న విషయాలను స్పష్టంగా నేటి పాఠకులకు అందించడం ఇదికూడా గ్రంథ పరిష్కరణ కార్యక్రమమే. కాకుంటే వీటిని శాసన లేఖనం అని ఎపిగ్రఫీ అని అనవచ్చు. కాని ప్రాథమికంగా పైన చేసే పని ఇదీ ఒకటే.

ఇవి కాక ప్రాచీన కాలంలోనే కాగితం వినియోగంలోనికి వచ్చింది. మొగలుల కాలంలోనో అక్బరు కాలంలోనో మన దేశంలోనే కాగితం వినియోగంలోనికి వచ్చినట్లు తెలుస్తూ ఉంది. తెలుగులో కూడా కనీసం మూడు వందల సంవత్సరాల నాటి హస్త లిఖిత ప్రతులు కనిపిస్తున్నాయి. కాని వాటిలోని గొలుసుకట్టు రాత లేదా ఇతరమైన విధానాలలో రాసిన తెలుగును అర్థం చేసుకొని వాటిని కూడా నేటి అవసరాలకు అనుగుణంగా నేటి అర్థాలకు అర్థవిపరిణామాలతో వివరిస్తూ గ్రంథాన్ని అచ్చుకు సిద్ధం చేయడం కూడా గ్రంథ పరిష్కరణ కార్యక్రమాలలోనే వస్తుంది.

ఇక ఇలాంటి పైన చెప్పిన అన్ని రకాల గ్రంథ పరిష్కరణ పనులకు మన కంప్యూటర్ ఎలా సహాయ పడుతుంది అనే విషయాన్ని ఇక్కడ పరిశీలన చేద్దాం.

కంప్యూటర్ లో OCR అనే సాఫ్ట్‌వేర్ పరికరం ఉంది. అంటే ఆప్టికల్ కారెక్టర్ రికగ్నిషన్ అని దీనికి వివరణ వాక్యం.

ఈ పరికరం స్కానర్లలో స్థాపితం చేస్తారు. అచ్చయిన ఒక ఇంగ్లీషు కాగితాన్ని స్కానర్ పైన ఉంచి స్కాన్ చేస్తే అది చిత్రంలాగే స్కాన్ చేసి తిరిగి అచ్చువేసే దశ తొలిదశలో ఉండేది. చిత్రాలను కాపీ చేసి తిరిగి కాగితం పైన ముద్రించడం కూడా తొలి దశలోనే జరిగేది. తర్వాత తయారు చేసిన పరికరం కాగితంలో అచ్చయిన అక్షరాలను గుర్తించి అర్థం చేసుకొని ఆ అక్షరాలను టెక్స్ట్ ను గుర్తించి కాగితం మొత్తంలో ఉన్న సమాచారాన్ని పూర్తిగా టెక్స్ట్ గా మారుస్తుంది. అంటే టైపు చేయకుండానే ఆ ఫైల్ ని మనం దిగుమతి చేసుకొని దాన్ని వేరు వేరు ఫాంటులలోనికి మార్చుకొని ఇంకా అందంగా ముద్రించుకోవచ్చు.

ఇంగ్లీషు భాషకు సంబంధించి ఇలా అచ్చయి ఉన్న ప్రాచీన అచ్చుప్రతులను ఈ ఓసీఆర్ ద్వారా పాఠ్యం లోనికి మార్చగలగడం కొన్ని సంవత్సరాల క్రితమే చేయగలిగారు. ఇది ప్రాథమిక దశ. ఇలా కాక అచ్చుప్రతులతోపాటు చేతి రాతలో రాసిన ఇంగ్లీషు లేఖనాలను కూడా అర్థం చేసుకొని ఆ అక్షరాలను కూడా స్కాన్ చేసి తిరిగి టెక్స్ట్ లోనికి మార్చగలిగే ఓసీఆర్ ని కూడా వారు తయారు చేయగలిగారు. చేతితో రాసిన అక్షరాలను యంత్రం కనిపెట్టి వాటిని టెక్స్ట్ గా మార్చే యంత్రపరికరాలను కూడా వారు ఇంగ్లీషుకు చేయగలిగారు. ఇవి స్కానర్లలోనే కాక కంప్యూటర్లలోను ఐప్యాడ్ వంటి వాటిలోను కూడా నిక్షిప్తం చేయగలిగారు. ఇప్పుడు మనం ఐప్యాడ్ లో దాని పెన్సిల్ తో ఇంగ్లీషు రాస్తే అది టెక్స్ట్ లోనికి మార్చి టైపు చేసినట్లు మనకు అందిస్తుంది. ఇప్పుడు ఇంగ్లీషుకు సంబంధించి విండోస్ లో కూడా పెన్నుతో రాసి దాన్ని టెక్స్ట్ లోనికి మార్చగలిగే యంత్ర పరికరాలు ఉన్నాయి.

ఓసీఆర్ టెక్నాలజీ ఇక్కడే ఆగలేదు. వారు అత్యంత ప్రాచీనమైన చేతిరాతను కూడా యంత్ర పరికరం తయారు చేయగలిగారు. షేక్స్పియరు కాలంనాటి చేతి రాతను కూడా చదివి నేటి అక్షరాల రూపంలో టైపు చేసి అందించగలిగే ఓసిఆర్ యంత్రాన్ని వారు తయారు చేయగలిగారు. దాని వివరాలను ఇక్కడ ఉన్న లింకులో చూచి తెలుసుకోవచ్చు. (https://collation.folger.edu/2018/09/computer-aided-transcription) ఇలా చేయడం వెనుక ఎంతో కృషి ఉంటుంది. ప్రతి అక్షరాన్ని అర్థంచేసుకోవాలి. దాన్ని చిత్రాన్ని తీసి కంప్యూటర్‌కి అందించి దానికి సరైన ఇంగ్లీషు అక్షరాన్ని ఎసైన్ చేస్తూ ప్రోగ్రాం రాయవలసి ఉంటుంది. ఇది సుదీర్ఘమైన ప్రయాణం. ఎన్నో సార్లు మార్పులు పరిణామాలు తీసుకువచ్చిన తర్వాతనే ఇలా నూటికి నూరు శాతం కచ్చితత్వంతో ఓసీఆర్ యంత్రాన్ని వారు తయారు చేయగలిగారు. నేడు వారు ప్రాచీన హస్త ప్రతులను కంప్యూటర్ ద్వారా చదవగలుగుతున్నారు. గ్రంథపరిష్కరణ చేయ గలుగుతున్నారు.

ఇదే పద్ధతిలో మనం తెలుగులో గ్రంథపరిష్కరణ కోసం కంప్యూటర్‌ని వినియోగించుకోవడానికి ఏ ఏ స్థాయిలలో పనిచేయాలో తెలుసుకోవలసి ఉంటుంది.

ప్రస్తుతానికి తెలుగుకు కాని హిందీకి కాని ఇతర భారతీయ భాషలలో ఆధునికమైన అచ్చు అయిన తెలుగును ఓసీఆర్ 80 కచ్చితత్వంతో చదవగలుగుతూ ఉంది. ఆధునికంగా అచ్చువేసిన కాగితాన్ని ఇది చదివి టెక్స్ట్ ఫైల్ గా మార్చగలదు. కాని ఇంకా పిడిఎఫ్ ఫైల్ ని ఎం.స్ ఆఫీస్ కాని ఇతర పరికరాలు కాని చదివి తెలుగు పాఠ్యంగా టైపు చేయలేకపోతున్నాయి.

ఇంగ్లీషులో ఉన్న పిడిఎఫ్ ఫైల్ ని తేలికగా ఎం.ఎస్.ఆఫీసు టెక్స్ట్ గా మార్చగలదు. తెలుగుకు నేటికీ ఇది సాధ్యం కావడంలేదు. అక్కడ ఎం.ఎస్ ఆఫీసులో కనీసం ఇరవై వేల మంది దీనికోసం పనిచేస్తున్నారు. ఇక తెలుగులో ఇలాంటియంత్రాన్ని తయారు చేయడానికి పనిచేసేవారి సంఖ్య ఎంతో తెలియరావడం లేదు. వారు వేళ్ళపైన లెక్కించడం కన్నా ఎక్కువలేరు. గూగుల్ వారు కూడా తెలుగుకు ఓసీఆర్ చేసే పనిలో ఉన్నారని తెలుస్తూ ఉంది. కాని అది ఏస్థాయిలో ఉందో తెలియదు.

గ్రంథపరిష్కరణ కోసం కంప్యూటర్ యంత్రాన్ని వినియోగించుకోవడానికి ఏఏ దశలలో పనిచేయవలసి ఉందో ఇక్కడ మనం పరిశీలన చేద్దాం.

ప్రాథమిక దశలో ఓసీ ఆర్ మనకు తెలుగులో అచ్చు యంత్రం వచ్చిన తొలినాళ్ళలో తెలుగు పుస్తకాలు అచ్చయినప్పుడు తెలుగు అక్షరాలు ఎలా ఉన్నాయో గుర్తుపట్టేలా చేసి వాటిని టైపు చేసేలాగా సైబర్ పాఠ్యంలాగా యూనికోడ్ లోనికి మార్చగలిగేలా యంత్రాన్ని తయారు చేయాలి. దీనివల్ల ప్రయోజనం ఏమంటే కనీసం బ్రౌను కాలంలో అచ్చయిన తొలినాటి కావ్యాలను తిరిగి టైపు చేయకుండా ఉన్నవాటిని ఉన్నట్లే టెక్స్ట్ ఫైలుగా మార్చి, మంచి ఫాంటులను వాటికి ఆరోపించి తిరిగి పుస్తకాలను అచ్చువేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ పరిజ్ఞానమే అందుబాటులో లేదు. తెలుగు విశ్వవిద్యాలయంవారు మహాభారతం మొత్తాన్ని ఆనందముద్రణ ప్రతిని తీసుకొని ఉన్నది ఉన్నట్లు ఫోటో కాపీ చేసి అచ్చువేశారు. ఇలా కాక, ఓసీఆర్ యంత్రం దీన్ని చదవగలిగి తిరిగి పాఠ్యాన్ని యూనికోడ్ లోనికిమార్చగలిగితే

చాలా అందంగా తయారు చేయడానికి వీలుకలిగేది. ప్రాచీన గ్రంథాలు అన్నింటి విషయంలో ఈ మాట వర్తిస్తుంది. ప్రాచీన తెలుగు అక్షరాలను టైపు అక్షరాలను కూడా చదవగలిగే ఓసీఆర్ యంత్రాన్ని మనం తయారు చేసుకోవాలి అని ఈ అవసరం మనకు తెలుపుతుంది.

ఇక చేతివ్రాత ప్రతులకు సంబంధించి మరికొంత గహనమైన పనిచేస్తేనే చాలా విస్తృతమైన పరిశ్రమ పరిశోధన జరిగితేనే వీటిని చదవగలిగే యంత్రపరికరాలు మనకు తయారు చేయించడం సాధ్యం అవుతుంది. కారణం చేతివ్రాత ప్రతులు చాలా స్థాయిల ప్రాచీనత ఉన్నవి ఉన్నాయి. బైండ్లవారు నులక చందయ్యలు ఇంకా ప్రాచీన కాలంలో ఉన్న నాటి కవులు రాసిన హస్తలిఖిత ప్రతులు లభిస్తాయి. వాటిని చదివేలాగా యంత్రాన్ని చదవడానికి ఎంతో పరిశోధన పరిశ్రమ జరగాలి. మొదట వీటిని మనుషులు చదివి అర్థం చేసుకొని వాటి చిత్రాన్ని కంప్యూటర్ కి అందించి దానికి తుల్యమైన నేటి అక్షరాలను అసైన్ చేస్తూ ప్రతి పాత అక్షరాలను లేఖన సంప్రదాయాలను కంప్యూటర్ కి అందించగలగాలి. అప్పుడే లేఖన ప్రతులను చదివే కంప్యూటర్ యంత్రం ఓసీఆర్ ని సిద్ధం చేయడం సాధ్యం అవుతుంది.

చేతిరాత ప్రతుల తర్వాత చదవవలసింది రాగిరేకులు. రాగిరేకులలో అన్నమయ్య రాగిరేకులు మిగతా రాగిరేకులకన్నా భిన్నంగా ఉంటాయి. అవి కాస్త పరిణత స్థాయిలో వారు ప్రతి అక్షరానికి ఒక పోగరు తయారు చేసి యాంత్రికంగా రేకు పైన ముద్రించగలిగారు. కాని ఇతర రాగిరేకులలో ప్రతిఅక్షరాన్ని చెక్కడం మనకు కనిపిస్తుంది. ఈ రేకుల చిత్రాన్ని కూడా కంప్యూటర్‌కి అందిస్తే కూడా అది చదవగలిగేలాగా పాఠ్యాన్ని తయారు చేసేలాగా వాటిని తయారు చేయగలగాలి. ఇది మరింత ఎక్కువ శ్రమతో కూడిన పని కాని ఒక్కసారి యంత్రాన్ని తయారు చేయగలిగితే ఎన్ని రాగిరేకులనైనా అది చదవగలుగుతుంది.

తర్వాత పరిష్కరణ చాలా సులభం అవుతుంది. ఇక ఆ తర్వాతి స్థాయి కనీసం ఐదువందల సంవత్సరాలనాడు మన శాసనాలలో ఉన్న కన్నడం తెలుగు లిపులు కలిసి ఉన్న కాలంనాటి తెలుగు లేఖన సంప్రదాయాలను చదవగలిగేయంత్రాలను తయారు చేయగలగడం. ప్రతి అక్షరాన్ని ఒత్తులు పొల్లులు వాటి స్థానాలు సైతం అర్థం చేసుకొనగలిగేలాగా యంత్రాన్ని చేయగలగాలి. ఈ పనులు అన్నీ మన గ్రంథ పరిష్కరణ కార్యక్రమానికి అవసరం అవుతుంది. దీనికి ఎంతో మంది ఉద్యోగులు యంత్ర సామగ్రి అవసరం అవుతుంది. గూగుల్ వారు భారతీయ భాషలకోసం కొంత పరిశోధనను కొనసాగిస్తున్నట్లు గట్టిగానే తెలుస్తూ ఉంది. కాని పైన చెప్పిన యంత్రపరికరాలను తయారుచేయడానికి తెలుగు ఓసీఆర్ యంత్రాన్ని పైన చెప్పిన అన్ని స్థాయిలలో పనిచేయడానికి ఒకదాని తర్వాత ఒక స్థాయిగా తీసుకొని పెద్ద ప్రాజెక్టును చేయగలగాలి.

ఇంతటి బృహత్ కార్యక్రమాన్ని ప్రభుత్వాలే చేపట్టగలవు. రెండు తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా కాని లేదా ఏదైనా ఒక తెలుగు రాష్ట్రంగాని ఈ బృహత్ ప్రాజెక్టును చేపట్టి ఎక్కువ మంది ఉద్యోగులను వారికి అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచి చేయించాలి. ఈ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం సృష్టించిన మన Institute of Telugu Classical Language వారు కాని చేపట్టవచ్చు.

ఇక్కడ ప్రతిపాదనలు అన్నీ నేను ఒక వాడుకరిగా లేదా end user ఒకపరిశోధనకు పరిశోధకుడికి ఏమి కావాలనో ఇక్కడ ప్రతిపాదించాను. కాని ఈ రంగంలో పనిచేసే సాఫ్ట్‌వేర్ నిపుణులు దీనికన్నా మంచి ప్రతిపాదన చేయగలరు. సాఫ్ట్‌వేర్ నిపుణులతో డిపిఆర్ తయారు చేయించడం కూడా– ప్రభుత్వం కాని ప్రభుత్వ సంస్థలుకాని మాత్రమే చేయించగల పని. నేడు తెలుగురాష్ట్రాలలో తెలుగుకు నెలకొని ఉన్న పరిస్థితులలో ఇది ఎలా సాధ్యం అవుతుందో అనే విచారించవలసిన పరిస్థితి ఉంది. మంచి రోజులు రావాలనే ఆశిద్దాం.

కవిత

మీరేమంటారు??

ఊపందుకుంటున్న వరుస ఎన్‌కౌంటర్లు
పదునెక్కుతున్న ఉరి చట్టాలు
మరింత పరుగుపెట్టి
న్యాయం పట్టాలెక్కితే
గుబులు చీకట్లో మగ్గుతున్న
ఆడ బతుకులకు ఓ వరమై
వెలిగే చీకట్లో చిరుదీపమే కాదంటారా??

నీలి చీర విడిచిన గగన దేహం
అలా రాత్రిని అల్లుకుందో లేదో
ఎటు చూసినా వావివరుసలు మరిచిన
ఊర కుక్కల స్వైర విహారమే....
కసుగాయల ఉసురు తీసిన
ముచ్చట చెవిన పడ్డప్పుడల్లా
కష్టాల సెగ గుండె లోతుల్లోంచి వస్తుంటే
కన్నీటి కడవలలో ఎసరు మరుగుతుంటే
నా అక్షరాలు కుతకుతా ఉడుకుతయి
న్యాయం కోసం తండ్లాడుకుంటూ

కామ కొక్కాలను తగిలించుకుని
జూలు విదిల్చిన మదమృగాలు
వెతల వలలు విసిరీ
పచ్చటి ఆడబతుకులలో
నెత్తురులు పారిస్తూ మానాలు మేసి
దుఃఖ నదులలో ముంచేసి
లొసుగుల చట్టాలలో దూరి
కాలయాపన తో గట్టుకు బడే
పంది కొక్కులకు ఉరే సరి...

అరుణ కీర్తి పతాక కరాదుల
9395147443

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

పడమటి గాలితో
నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద

భారతదేశం సకల సంపదల గని. చుట్టూ ఆవరించిన సముద్రజల సంపద, భూ భాగం అంతా విస్తరించిన నదీ నదాలు, ఎడారులు, అడవులు, కొండలు అన్నింటా అందుబాటయిన సంపద, భూ భాగంలోపల విస్తృతమైన అద్భుత ఖనిజ సంపదతోబాటున్న బంగారం నిల్వలు, నల్ల బంగారం ఇలా చెప్పుకుంటూ వుంటే మనకు లేనిదేముంది. అన్ని అమరినా సరిగా వినియోగించుకోలేని అవిద్య, అజ్ఞానం ప్రపంచ దేశాల అభివృద్ధికి దూరం చేసింది. దీన్ని ఆసరాగా చేసుకున్న వర్గాలన్నీ బలహీనులపై బలవంతుల ఆధిపత్యం, వర్గభేదం, వర్ణకాలుష్యం అన్న అథఃపాతాళానికి తీసుకువెళ్లాయి.

దీన్ని ఆసరాగా, అలుసుగా తీసుకున్న ఇతర దేశాలు మనపై దండెత్తి మన సంపదను, ఆస్థిపాస్తులను, స్థిర, చర సంపదలన్నీ యధేచ్ఛగా దోచాయన్నది జగమెరిగిన వాస్తవం. విస్తరించిన జనాభా ఉన్నా ఐక్యత లేనందువల్ల రకరకాల దోపిడీకి గురి అయ్యాయన్నది స్తవముకాని వాస్తవం.

ఈ నేపథ్యంలో అన్ని దేశాల దాడుల అనంతరం పాశ్చాత్య దేశాలు వర్తకం పేర మన దేశంలో అడుగుపెట్టి అరాచకాలు, అన్యాయాలు, అక్రమాలు చేశారన్నది అందరికీ తెలిసిన విషయమే. అయినా వాళ్లకోసం, మనదేశంలో మనమే కూలీలుగా మారి వాళ్లను మోశామన్నది, అన్నీ భరించామన్నదీ అక్షరాక్షర సత్యం. ఈ క్రమంలో జరిగిన పాలక ప్రభావం పాలితులపై అన్ని రంగాల్లో విస్తరించి విద్య, వైద్య మత పరమైన రంగాల్లో నిలబడి వేళ్లూనుకుంది. ఒకరకంగా రాజకీయంగా పాలక దోపిడీలో భాగంగా దేశీయ పరమైన వర్ణ, లింగ అసమానతలు, అమానవీయ అకృత్య జీవన వేదాలన్నీ బహిరంగ భూమికకు నేపథ్యాలయ్యాయి. ఈ పరిస్థితుల్లో మత వ్యవస్థ పాశ్చాత్య సంస్కృతీ సంప్రదాయిక కట్టుబాట్లు మనకు సరికొత్త పుంతలతో ఆవిష్కృతం అయ్యాయి. కొత్తొక వింత పాతొక రోతలా భారతీయులు అన్ని వ్యవస్థలనూ ఆదరించే సహృదయ సజ్జన సుమనస్కులు. అందువల్ల దిగుమతి అయ్యే మత వ్యవస్థలన్నీ మనకు ఆసక్తితోపాటు ఆనందంగా ఆచరించే అలవాటుగా చేసుకోవడం జరిగింది. ఈ స్థితిలో పాశ్చాత్య దేశాలు వాణిజ్యంతో పాటు వారి మత వ్యవస్థను దేశీయులు చూసి ఆకర్షితులు కావడం జరిగింది.

ఒక వైపు వర్తక వాణిజ్య వ్యాపారంతోపాటు మన దేశీయ భాషా సంస్కృతిని, సాహిత్య సంపదను విని ఆకర్షితులయిన పాశ్చాత్య అధికారులు, మత పెద్దలు దేశీయ సాహిత్యం నేర్చుకోవడం, అది నేర్పించడం అనే క్రమంలో ముందుకు సాగారు. ఈ స్థితిలో తొలిగా మన భాషలు నేర్చారు దానిని ఒక క్రమంలో ఉంచడానికి కోశ వ్యాకరణాలు తయారు చేశారు. నిజానికి ఈ విధమైన సాహిత్య విజ్ఞాన విధాన విధులన్నీ వ్యాపారంలో భాగంగా వేయలేదు. అది మత పరమైన ఆచార సంప్రదాయాలకూ ఏ మాత్రమూ సబంధం లేకుండా కేవలం భాషా విజ్ఞాన వెలికితీతకు సంబంధిగా తొలి నాళ్ళలో చేసిన కృషి మరువలేనిది. ఆ విధంగా వెలికితీసి, చికిలీపట్టి, నగిషీ చేసిన కోశ వ్యాకరణాలు, అసూర్యం పశ్యలుగా ఉన్న కావ్య సంపద, తాళపత్రాల్లో సమస్థమూ నిక్షిప్తమై అందరికీ అందుబాటుకాని సర్వ సాహిత్యాన్ని అచ్చుకు సిద్ధం చేసిన పాశ్యాత్య ప్రభుత్వ అధికారగణం, వాళ్ళకు తోడుగా ఉన్న మత పెద్దల సహకారం మన భాషా సాహిత్యం నేడు కళ్ళ జూసే పరిస్థితి అవకాశం వచ్చింది. ఇది తరతరాలకు నిలబడి అచ్చుకు నోచుకుని ఆనందించే అవకాశం కలిగించిన బెంజమిన్ షూల్జి, క్రేన్, మోరిస్, కల్నల్ మెకంజీ, ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్, కాంబెల్, విలియం కేరీ, బిషప్ కాల్వెల్ తదితరుల కృషి విజ్ఞానం వరుస క్రమంలో అందించే లక్ష్యంతో ఈ వ్యాస పరంపర ప్రారంభించడం జరిగింది.

ఇందులో చాల వరకు చారిత్రక, సామాజిక, మత పరమైన అంశాలు కూడా వస్తాయి. వాటితోపాటు ఆనాటి దేశీయ విదేశీయుల విద్యా విధానం, భాషా సంస్కరణలు, అనువాద విధానాలు కనిష్టి చోటు చేసుకుంటాయి. యధా విధిని మన అమ్మనుడి పాఠకులు ఆదరిస్తారని, సూచనలు, సలహాలు సహృదయంతో ఎప్పుడూ స్వీకరించడానికి సిద్ధమని వినయంగా తెలియజేస్తున్నాము. ఆధారాలతో మంచి సలహాలిచ్చి తోడ్పడగలరని విశ్వసిస్తున్నాము.

• • •

①

తరతరాల మన సంస్కృతీ వైభవాలు, భాష, సాహిత్యం అను వంశికంగా పరంపరీణంగా, పరిణామశీలంగా ప్రకాశిస్తూ ఉందన్నది జగమెరిగిన సత్యం. ప్రతిదానికీ ఆటుపోట్లుంటాయి. చరిత్ర కూడా ఎప్పుడూ ఒడిదుడుకుల మధ్యే నడిచింది. అనాదిగా భారతదేశంలో వివిధ రాజులు, రాజ్యాలు, జమిందారులు, వలసదారులు, పెత్తం దారులు బలం బలగం ఉన్న వాళ్లంతా రాజ్యాలు, సుఖాలు ఏర్పరచు కుని బలహీనులపై పెత్తనం సాగించారన్నది జగమెరిగిన వాస్తవం. అంటే పాశ్యాత్యుల రాక పూర్వం భారతదేశమంతా చిన్నచిన్న పరగణాలుగా ఉండేది. ఈ నేపథ్యంలో పాశ్యాత్యులు వర్తకం పేర భారతదేశంలో అడుగు పెట్టారు. బుడత కీచు చక్రవర్తులు నూతనా న్వేషణను ప్రోత్సహించినందువల్ల వాస్కోడిగామ అనే పోర్చుగీసు నాయకుడి నాయకత్వాన లస్బెన్ ఓడ రేవు నుండి బయలుదేరి ఆఫ్రికాలోని గుడ్ హోప్ అగ్రమును చుట్టి 1498 మే 20న భారతదేశ పశ్చిమ తీరమైన కోజికోడులో లంగరు వేశాడు. కోజికోడు అనే నేటి కాలికట్ ప్రాంతాన్ని జామొరిన్ అనే రాజు పరిపాలించాడు. జామొరిన్ రాజు తో సఖ్యత వర్తకం ప్రారంభించారు. బుడతకీచువారు కాతలిక్ క్రైస్తవులు. పోపు అనుయాయులు. అందువల్ల వారి వర్తక వాణిజ్య వ్యాపారాలకు రాజు అనుమతికి తోడు పోపుగారి అనుమతి కూడా అవసరం అయింది. అందువల్ల పోర్చుగీసు వారి ప్రతి నావికా ప్రయాణానికి పోపు అనుమతి తప్పనిసరి అయింది. దీనికితోడు 500 టన్నులు మించిన ప్రతి ఓడలోనూ ఒక పాదిరి ఉండాలనే నియమం ఉంది. ఈ కారణంగా ప్రతి 500 టన్నుల బరువుతో వచ్చే ఓడలో ఒక పాదిరి లేదా బిషప్ భారతదేశానికి రావడం వచ్చినవాళ్లు ఇక్కడే స్థిరపడటం జరిగింది. వచ్చిన పాదిరి మొదట్లో వాళ్ల వాళ్లకే ప్రార్థనాదికాలు నిర్వహించేవాళ్లు. అనంతరం స్థానిక భాషలు నేర్చి ఆ ప్రాంతాల్లో ఉన్నవారికి ప్రార్థనలు, నిత్య నైమిత్తిక పూజాదికాలు నిర్వహించే వారని imperial Gazetter of india vol.1 పుట 442లో స్పష్టంగా ఉంది.

వాస్కోడిగామా దాదాపు 170 మంది సిబ్బందితో కలిసి మూడు పడవల్లో భారతదేశానికి వచ్చాడు తన ప్రయాణం మూడేళ్లపాటు కొనసాగేలా సిద్ధపడి 1497 జులై 8న బయలుదేరాడు. పడవల్లో మూడు సంవత్సరాలకు సరిపడా ఆమేర సామగ్రి, మంచినీళ్లు, యుద్ధసామగ్రి, ఫిరంగులు, మందు సామానులు, విల్లంబులు మందులు, వైద్యుడు అన్ని రకాల పనివాళ్లు అంటే ఓడను మరమ్మత్తులు చేసేవాళ్లు, తెరచాపలు కట్టే నేర్పరులు, వంటవాళ్లు, గజ ఈతగాళ్ళు, అత్యవసర సామగ్రితో రక్షించే రక్షక సిబ్బంది అంతా కలిసి ఒక పెద్ద సర్కస్ కంపెనీలా అన్ని ఏర్పాట్లతో బయలు దేరారు. మూడు ఓడలకు వేర్వేరు పేర్లున్నాయి. మొదటిది అన్నింటికన్నా పెద్ద ఓడ. దీనికి సావో గాబ్రియెల్ అని పేరు. దీని కెప్టెన్ గొన్సాలొ ఆల్వారెజ్ పైలట్ పెరో దవెంకర్ మొదటి ఓడలోనే వాస్కోడిగామా లో ఉండేవాడు. రెండో ఓడపేరు సావొ రఫాయెల్ దీని కెప్టెన్ వాస్కోడిగామా అన్న అయిన పాలొదగామా మూడో ఓడపేరు బెరెయో దీని కెప్టెన్ నికొలావ్ కొయిలొ వీళ్లందరితో పాటు వివిధ భాషలు తెలిసిన పండితులను, ద్విభాషీ (దుబాసీ) లను కూడా తీసుకు వెళ్లాడు. ముఖ్యంగా అరబిక్ పండితులున్నారు. వారిలో ఫెర్నావొ మారిన్నే, జొన్యూన్స్ అనేవాళ్లు ముఖ్యులు. మార్గమధ్యంలో ఎన్నో అవాంతరాలు వచ్చాయి. సముద్రపు దొంగల బీభత్సం అంతాయింతా కాదు. వాళ్ళని మర ఫిరంగులతో పేల్చి వేయడం శత్రు నౌకలను చెల్లా చెదరు చేయడం వాళ్ళు వాస్కోడిగామా బృందానికి తప్పలేదు. ఒకసారి అరబ్బుల నౌకను ముట్టడించి వాళ్ళ దగ్గరున్న ఆహార పదార్థాలు దోచుకుని వాళ్ల నౌకను తగలబెట్టారు. అది సముద్రంలోనే నాలుగు రాత్రులు నాలుగు పగళ్ళు మంటల్లో మాడి పోయింది. అందులో ఎంతోమంది స్త్రీలు, పిల్లలు ఉన్నారని చరిత్ర తెలియజేస్తుంది.

వాస్కోడిగామా భారతదేశ యాత్ర జరపడానికి గల కారణం బంగారం, సుగంధ ద్రవ్యాలు తీసుకుని వాళ్ల దేశంలో అమ్ముకోవడం. అలాగే ఎక్కడయితే భూభాగాన్ని ఆక్రమించుకున్నాడో అక్కడ పోర్చుగల్ రాజు ఆధిపత్యం తెలిపే విధంగా రాతి స్థంభాలను నాటాడు. ఈ స్థంభాల శాసనాలను "పద్రావ్' అంటారు. ఈలాంటి శాసనాలు మార్గమధ్యంలో కేప్ ఆఫ్ గుడ్ హోప్‌లో కొన్ని ఉన్నాయి. అలాంటివే గోవాలో కొన్ని ప్రతిష్ఠించాడు. మొత్తం తన నావికా యాత్ర, భారతదేశానికి మూడుసార్లు చేశాడు. చివరికి 1524 డిసెంబర్ 24న కొచ్చిన్‌లో మరణించాడని అంటారు. ఐతే పోర్చుగీసు నావికులు భారతదేశాన్ని ఆక్రమించినా అనంతరం చైనా, జపాన్, ఫిలిపీన్స్ మొదలయిన ప్రాంతాల్లో విస్తరించి వ్యాపారం చేశారు.

పోర్చుగీసు వారి వల్ల భారతదేశానికి వచ్చిన వాణిజ్య పంటలు కొన్ని ఉన్నాయి. అలాగే వారి భాషాపదాలు తెలుగులో కూడా వచ్చి చేరాయి. ఉదాహరణకు అనాస, బొప్పాయి, కాబేజి, అల్మార, బాల్చీ, కమీజు, ఇస్త్రీ, మేస్త్రి మొదలయిన వాటితోపాటు పీపా, మేజా, నబ్బు మొదలయినవి గమనం నిత్యం వాడే పదాల్లో కొన్ని వర్తక సంబం ధమైన వాటిల్లోకొస్తా, గిడ్డంగి, గోదాం, బంకు మొదలయినవి ఉన్నాయి. ఈ రోజు మనం గుంటూరు మిరప అని గర్వంగా చెప్పే మిరపకాయ, వేరుశనగ, సీతాఫలం, జామ మొదలయినవి ఉన్నాయి. ఈ వివరాలన్నీ ఆచార్య తూమాటి దొణప్పగారి భాషా చారిత్రక వ్యాసావళిలో స్పష్టంగా చూడవచ్చు. అలాగే మిరపకాయను మిరియం కాయగా తొలినాళ్ళలో ఉచ్చరించి అనంతరం మిరపకాయగా మారిం దని ఆచార్య ఎన్.గోపి తన పరిశోధనా వ్యాసంలో విశ్లేషించారు.

(తరువాయి రానున్న సంచికలో...)

కథానిక

కోణం

సి.వి.కృష్ణయ్య
9396514554



లెక్కల మాష్టారు రామారావంటే అందరికీ హడల్. ఆయన్తో మాట్లాడాలంటే టీచర్లకూ, చివరకు హెడ్మాష్టరుకూ భయమే. ఏది మాట్లాడినా ఎదుటివారి మాటల్లో ఏదో ఒక తప్పు జూపి, తనమాట నెగ్గించుకొంటాడు. అతని వాదన విన్న వారంతా నిజమేనని ఒప్పుకొని తీరాల్సిందే. ఎలాంటి విషయాన్నైనా ఉదాహరణలతో సహా తర్కబద్ధంగా వివరించి ఎదుటివారిని ఒప్పించగల నేర్పు, భాషాజ్ఞానం అతనికున్నాయి.

అయితే అతనితో వచ్చిన చిక్కేమిటంటే ఈ రోజు మనచేత ఔనని ఒప్పించిన విషయాన్ని మరునాడు దాన్ని ఖండించి, మన చేతనే అంగీకరింపజేస్తాడు. అందుకే అతను మాట్లాడేటప్పుడు ఔనంటే ఏమంటాడో కాదంటే ఏమి ప్రమాదమోనని, వినే వాళ్లు తలలు అటూ ఇటూ ఊపకుండా నోట్లో నుండి మాటలు రానీకుండా మూగ మొద్దుల్లా వింటూ ఉండిపోతారు.

గణితం అన్ని సబ్జక్కుల్లో రారాజు అంటాడు. ఈ విశ్వమంతా గణితనియమాలపైన నడుస్తున్నదని, ఉదాహరణలతో సహా వివరించి మనల్ని ఒప్పిస్తాడు. కాబట్టి పాఠశాలలో గణితం నేర్పడానికి ప్రథమ స్థానం ఇవ్వాలంటాడు. నిజమే కదా అనుకొంటాం. మరునాడు గణితమైనా భౌతికశాస్త్రమైనా, దేన్ని అర్థం చేసుకోవాలన్నా భాష ముఖ్యమని, భాష రాకపోతే, ఏ సబ్జక్టూ నేర్చుకోలేరనీ మనల్ని ఒప్పి స్తాడు. కాబట్టి తెలుగు ఇంగ్లీషు భాషలు నేర్చు కోడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలంటాడు. ఈ మాటలతో భాషోపాధ్యాయుల గుండెలు అంతెత్తున ఉబ్బిపోతాయి.

మరో వారం రోజులకు "మానవ సమాజాభివృద్ధికి మూలం సైన్సు అని, చదువు వచ్చినా రాకపోయినా, శాస్త్ర విజ్ఞానం ఉండే మనిషి అభివృద్ధి సాధిస్తాడు" అని వాదిస్తాడు. "చదువు రాని మెకానిక్కులు, మట్టి పిసుక్కొనే రైతులు కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని, కాబట్టి సైన్సు నేర్పడానికి ప్రథమ స్థానం ఇవ్వాలంటాడు.

"అదేమిటిసార్ నిన్న అలా అన్నారు గదా" అని అడిగితే "అంతా మనం చూసే దృక్కోణాన్నిబట్టి ఉంటుందంటాడు.

పాపం ఇలాంటి మాష్టారు ఒక రోజు క్లాస్‌రూంలో ఒక గిరిజన విద్యార్థి చేతిలో విలవిలలాడిపోయాడు.

అది ఎనిమిదవ తరగతి క్లాస్ రూం. ఆ రోజు పాఠం త్రిభుజాల గురించి, పాఠం చెప్పేటప్పుడు అనేకసార్లు కోణం, డిగ్రీలు, అనే మాటలు ఉపయోగించాడు. పాఠం పూర్తయింది. అర్థం కాని వాళ్లు చేతులెత్తండి" అన్నాడు.

ఒక గిరిజన కుర్రాడు లేచాడు. "సార్ నాకు కోణం, డిగ్రీలు అనే మాటలు ఏమిటో అర్థం కాలేదు" అన్నాడు.

"కోణం అంటే యాంగిల్" డిగ్రీలంటే కోణాన్ని కొలిచే కొలతా అన్నాడు. "ఏమో సార్! అర్థంకావటం లేదు" అన్నాడు విద్యార్థి.

"ఇది చూడు" అంటూ బోర్డుమీద చాక్ పీస్‌తో భూమికి సమాంతరంగా మరో సరళరేఖ గీసాడు. దీన్ని ఖండిస్తూ పైకి చక్కగా మరో సరళరేఖ గీసాడు. రెండు రేఖలు ఖండించుకొనే మూల ఒక చాపాన్ని గీసి "ఇదిగో ఇదే కోణం" ఇది 90 డిగ్రీలు లంబకోణం అంటారు. ఈ కోణాన్ని రెండుగా విభజించి మధ్యలో మరో రేఖ గీస్తున్నా" అంటూ మధ్యలో మరో రేఖ గీశాడు.

ఆ గిరిజన విద్యార్థి కోణం అంటే ఏమిటో అర్థం చేసుకోడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. మధ్యలో గీసిన వాలిన రేఖను చూడగానే అతనికి కొండవాలు గుర్తుకు వచ్చింది.

"అర్థమయింది సార్ కోణం అంటే 'వాలు' అన్నమాట" అన్నాడు. ఈ మాట వినగానే లెక్కల మాష్టారు "వాలు" ఏమిటి"

అని అడిగాడు.

"అదే సార్ 'కొండవాలు' ఆ మూల మీరు చాపాన్ని గీశారు. అది బండి చక్రం వంపులా ఉంది. ఇదే గదా కోణం అంటే" అన్నాడు. ఆ విద్యార్థి అర్థం చేసుకొన్న తీరు మాష్టారికి అర్థమైందో లేదో తెలియదుగాని "యస్.యస్. అదే అదే" అన్నాడు. అంతటితో ఆగకుండా కోణాన్ని 'వాలు' అన్నావు. చాపాన్ని "వంపు" అన్నావు మరి డిగ్రీలని ఏమంటావు" అని అడిగాడు. ఆ విద్యార్థికి ఇదొక సవాలుగా మారిపోయింది. బాగా ఆలోచించాడు.

"డిగ్రీని 'ఒక నూలు" అంటారు సార్" అన్నాడు.

"నూలు ఏమిటి?" అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చాడు మాష్టారు.

"గోడలు కట్టే మేస్త్రీలు, చెక్క పనిచేసే వాళ్లు, కొంచెం తేడాలను నూలు, అరనూలు, రెండు నూళ్లు, అనే మాటలు ఉపయోగిస్తారు. ఇవేగదా డిగ్రీలంటే" అని వివరించాడు.

"వెరీగుడ్ వెరీగుడ్" అంటూ విద్యార్థిని మెచ్చుకొని ఆలోచనలో పడ్డాడు - తనకెప్పుడూ ఇలాంటి అనుభవం ఎదురు కాలేదు.

ఒక పదం అంటే రెండో, మూడో అక్షరాలు కాదు. అదొక భావం - అదొక అనుభవం. ఆ పదం చుట్టూ చాలు అనుభవ జ్ఞానం ఉంటుంది. కొత్త విషయం అర్థం చేసుకొనేటప్పుడు ఈ అనుభవజ్ఞానం అంతా వినియోగంలోకి వస్తుంది. మాతృభాష, లేదా ఇంటిభాష అయితేనే ఇది సాధ్యం. తన పూర్వ జ్ఞానం అంతా ఇంటిభాష (మాతృ భాష) పదజాలం చుట్టూ చేరి ఉంటుంది.

మనం ఎంత గొప్ప పండితులమనేది ముఖ్యం కాదు. మనం ఎంత సరళమైన మాటల్లో పిల్లలకు తెలిసిన పదజాలం ఉపయోగించి అర్థమయ్యేటట్లు చెబుతున్నామా లేదా అనేదే ముఖ్యం.

ఈ గిరిజన విద్యార్థి జీవితానుభవం నుండి ఇంటిభాష ద్వారా అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు. మిగిలిన పిల్లలకు అర్థమై ఉంటుందా? ప్రశ్నించడమే మరిచిపోయిన పిల్లలకు అర్థమైతేనేమి? అర్థం కాకపోతేనేమి? ఫస్టుక్లాసులో పాసవుతారు గదా!

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు



నెల్లూరులోని దీనదయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ భవనంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో 21-02-2020 తేదీన మాతృభాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది.

ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా తెలుగు రచయితలు, కవులు, కవయిత్రులు, చరిత్రకారులు, భాషాభిమానులు పాల్గొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రాజెక్టు డైరెక్టర్ ఆచార్య మునిరత్నం నాయుడు ప్రసంగిస్తూ నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు నలభైవేల మందికిపైగా ద్వితీయభాషగా తెలుగును అభ్యసిస్తున్నారని, మాతృభాషల గొప్పతనాన్ని తెలియజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లూరుజిల్లా శాసన మండలి సభ్యులైన శ్రీ విఠపు బాలసుబ్రహ్మణ్యం 'మాతృభాష అంతరిస్తే ఆ జాతికూడా అంతరించినట్లవుతుందని' చెబుతూ, ఒకప్పుడు అంతరించి పోయిన హిబ్రూభాషని బతికించు కోవటానికి హిబ్రూ భాషీయులు పడిన కష్టాన్ని గుర్తుచేశారు. మాతృభాషల్లో విద్యాబోధన జరగకపోతే భాషతోపాటు ఇతర సామాజిక శాస్త్రాలు మాతృభాషలో లభ్యమవడం కష్టతరమౌతుంది. తద్వారా ఆయా భాషల జాతి, చరిత్ర, సంస్కృతి మరుగునపడే ప్రమాదం ఉంటుంది. మాతృభాషలను పరిరక్షించుకోవడంలో హిబ్రూభాషీయులు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచారని, అలాంటి మార్గనిర్దేశకశక్తి, మాతృభాషా పరిరక్షణ తపన ఈ తెలుగు అధ్యయన కేంద్రానికుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌరవ అతిథి నెల్లూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డా.పాతూరి అన్నపూర్ణ నెల్లూరు పట్టణానికి తెలుగు అధ్యయన కేంద్రం తరలి రావటానికి కారకులైన ఉపరాష్ట్రపతిగారి సేవలను కొనియాడారు. మాతృభాషల ఔన్నత్యాన్ని చాటిచెప్పుతూ ప్రభుత్వాలు,ప్రజలు కలిసి చేయాల్సిన కృషిని తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు, శ్రీ జయప్రకాశ్ మాట్లాడుతూ నేటి తరుణంలో మాతృభాషలను సంరక్షించడానికి పత్రికలు చేస్తున్న అవిరళ కృషిని గుర్తు చేశారు. ఈ సమావేశానంతరం నెల్లూరుజిల్లా రచయితలతో ఇష్టాగోష్ఠిని నిర్వహించడమైనది. ఈ గోష్ఠిలో ఆచార్య మునిరత్నం నాయుడు, ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం ఇప్పటివరకు చేపట్టిన, భవిష్యత్తులో చేపట్టబోతున్న కార్యక్రమాలను గురించి రచయితలతో పంచుకున్నారు. అలాగే ప్రాచీన తెలుగు భాషకు, చరిత్రకు, సాహిత్యానికి సంబంధించిన శాసనాలు, తాళ పత్రాలు, రాతప్రతులను సంస్థకు అప్పగిస్తే వాటిని భద్రపరిచి, పరిష్కరించి ప్రచురిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా॥ బి.నాగశేషు, డా.టి.ఎస్.వెంకటేశ్, డా.రమేష్, డా.రాంబాబు, డా.సతీష్, డా.కాశీంబాబు సహాయ సహకారాలందించారు. సమావేశాన్ని డా.మిరియాల సత్యనారాయణ, సీనియర్ ఫెలో వందన సమర్పణతో ముగించారు.

డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి
99639 17187

మాతృభాషా మాధ్యమ చట్టాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంగ్లీషు మీడియం పూర్తిగా అమలు చేయబోతున్న నేపథ్యంలో ఈ అంశంపై వివిధ రకాలుగా చర్చ సాగుతోంది.

సమకాలీన పరిస్థితులు, వాటి ప్రభావాల వల్ల ఎవరి అభిప్రాయాలు వారికి ఉండవచ్చు. రాజ్యాంగపరంగా , రాజ్యంగ స్ఫూర్తితో ఇప్పటికే అమలులో ఉన్న చట్టాలు ఈ విషయమై ఏమి చెబుతున్నాయనేది కూడా ఈ సందర్భంలో పరిశీలించాల్సిన అంశం.

భారత రాజ్యాంగం ఆర్టికల్ – 21 ప్రకారం రాజ్యం ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల లోపు గల బాల బాలికలకు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని తెలుపుతుంది.

రాజ్యంగంలోని పదిహేడవ భాగం మొత్తం అధికార భాషా సంబంధిత అంశాలను వివరిస్తుంది.

ఇందులో..

ఆర్టికల్ 343, 344 లలో రాజ్యాంగం అమలులోకి వచ్చిన అనంతరం 15 సంవత్సరాలు ఇంగ్లీషు అధికారిక భాషగా కొనసాగుతుంది. ఈ క్రమంలోనే అధికారభాషాసంఘం నెలకొల్పి హిందీని అధికార భాషగా ఉపయోగించడానికి సిఫారసులు చేయడం, ఇంగ్లీషు భాషా వినియోగం తగ్గించాలని తెలుపుతుంది.

ఆర్టికల్– 350 ప్రజలు తమ కేంద్ర రాష్ట్ర అధికారుల ముందు తమ సంతాపాలు, బాధలు ఏ భాషలోనైనా రాసి ఇవ్వవచ్చని ఉంది.

350– (ఎ) ప్రకారం బాలబాలికలలకు ప్రతిరాష్టంలోను ప్రాథమిక విద్యను మాతృభాషలోనే అందచేయడానికి అవరమైన చర్యలను చేపట్టాలి.

350 – (బి) ప్రకారం రాష్ట్రపతి భాషా మైనారిటీ లపై అధ్యయనానికి ప్రత్యేక అధికారిని నియమిస్తారు. ఈ ప్రత్యేక అధికారి రాజ్యాంగ ప్రకారం మైనారిటీల భాష అభివృద్ధికి అందించవలసిన రక్షణలు సరిగా అందుతున్నాయో లేదో సరిచూస్తుంది.

అల్పసంఖ్యాక వర్గాల భాషగురించి రాజ్యాంగం లోని ..

ఆర్టికల్ 29(1) ప్రకారం భారతదేశంలో నివసిస్తున్న పౌరులు ఏ వర్గంలో వారైనా వారి విశిష్ట భాష, లిపి లేదా సంస్కృతి ఉన్నట్లయితే దానిని కాపాడుకొనే హక్కు వారికుంటుంది.

ఆర్టికల్ 30(1), (2) ప్రకారం భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గీయులు తమకు నచ్చినవిధంగా విద్యాసంస్థలు నెలకొల్పుకొని నిర్వహించుకోవచ్చు. ఆ విద్యా సంస్థలకు ఆర్థిక సహాయం విషయంలో రాజ్యం వివక్ష చూపరాదు అని తెలియచేస్తుంది.

రాజ్యాంగంలోని పై మొత్తం అంశాలను బట్టి ప్రాథమిక విద్య అంటే ఎనిమిదో తరగతి వరకు మాతృభాషలో విద్యపొందే హక్కు కల్పిస్తుంది. అల్ప సంఖ్యాక భాషల హక్కులను సంరక్షణ కోసం రాష్ట్రపతి చర్యలు కూడా తీసుకోవచ్చని తెలియచేస్తుంది. జాతీయ భాషగా ఇంగ్లీషును తగ్గించి హిందీకి ప్రాధాన్యత ఇవ్వాలని వివరిస్తుంది.

విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. ఎవరు చట్టం చేయాలన్నా రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకనుగుణంగా ఉండాలి. ఇది భావోద్వేగాలకో, జనాభిప్రాయానికో పరిమితమైన అంశంకాదు. ఏ మార్పులు చేయాలన్నా రాజ్యాంగ సవరణ తప్పని సరి అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ రూల్స్, జి.ఓ యస్ నెం :1188 – 10మే 1996 ప్రకారం, సెక్షన్ 48 మీడియం ఇన్‌స్ట్రక్షన్‌లో మాతృభాషలో విద్యాబోధన చేయాలి. అల్ప సంఖ్యాక భాష వారు కనీసం పదిమంది ఉంటే సమాంతరంగా ఒక సెక్షన్ ఏర్పాటు చేయాలని తెలియచేస్తుంది.

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం(యాక్ట్ నెం 35/ 2009) సెక్షన్ 29(యఫ్) ప్రకారం విద్యార్థుల మాతృభాషలో బోధన ఉండాలని తెలియచేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీసుకొన్న ఇంగ్లీషు మాధ్యమ నిర్ణయం ఇక్కడి అధిక సంఖ్యాకులైన తెలుగుభాష పరిస్థితి సమస్యనెదుర్కొనేలా చేస్తుంది. అల్పసంఖ్యాక భాషలు ఇంక లెక్కలో కూడా ఉండదు.

రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరికి నచ్చిన ధోరణిలో వాళ్ళు భాషల విషయంగా నిర్ణయాలు తీసుకొంటూ వెళితే అనేక భాషలతో కూడిన, సమాఖ్య వ్యవస్థగా సాగుతున్న భారతదేశంలో ఉత్తరోత్తర సంక్లిష్ట సమస్యలు ఎదురవుతాయి. అందుకే ఈ విషయంగా రాజ్యాంగంలో అనేక జాగ్రత్తలు తీసుకొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమిళం, కన్నడ, ఒరియా, ఉర్దూ తదితర భాషామాధ్యమాలలో కూడా ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాలలు ప్రస్తుతం నడుస్తున్నాయి. అల్పసంఖ్యాక వర్గాల భాషాహక్కుల ప్రకారం వారికి తమ మాతృభాషలో విద్య పొందే హక్కు ప్రశ్నార్థకంగా మారుతుంది. అనేక ఇతర రాష్ట్రాలలో తెలుగు మాధ్యమ పాఠశాలలు నడుస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రంలో 1956 లో మూడువేల తెలుగు పాఠశాలలు ఉండేవి. 2006 క్రితం వరకు 505 ప్రైమరీ, మిడిల్ పాఠశాలలు , 40 హైస్కూలులు, 35 హయ్యర్ సెకండరీ పాఠశాలలు మొత్తం 580 పాఠశాలలు నడిచేవి. తరువాత కాలంలో తెలుగు మాధ్యమం తొలగిస్తూ కేవలం తమిళం మీడియంలో చదవాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. తెలుగు పాఠశాలలు తమిళ, ఆంగ్లంలోకి మారుతు వచ్చాయి. పరీక్షలు లేకుండా కేవలం ఐచ్ఛిక అంశంగా తెలుగును చదువుకోండని మాత్రమే అవకాశం ఇస్తున్నారు. తెలుగు మాధ్యమంకోసం అక్కడి తెలుగు భాషా సంఘాలు కోర్టులను ఆశ్రయించారు. ప్రస్తుతం వివాదం కొనసాగుతోంది. దాదాపు మూడు

వందల పాఠశాలలలో తెలుగు మీడియం ఇప్పటికీ నడుస్తుంది.

కర్ణాటక రాష్ట్రం 2010-2011 నాటి వివరాల ప్రకారం 33 లోయర్ ప్రైమరీ పాఠశాలలు ,52 అప్పర్ ప్రైమరీ , 14 సెకండరీ పాఠశాలలు మొత్తం 99 పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికీ తెలుగు మీడియంలో కొనసాగుతుంది. ఒరిస్సా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలోను తెలుగు మాధ్యమం అక్కడి విద్యార్థులకు అందుతోంది. ఈ విధంగా దేశమంతటా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా రాజ్యంగ స్ఫూర్తితో మాతృభాషా మాధ్యమాలు పక్క రాష్ట్రాలలోను అమలవుతున్నాయి. ప్రస్తుతం తెలుగు మాతృభాషగా గల కోటానుకోట్ల మంది ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాతృభాషలో చదువుకోవడాన్ని నిరాకరిస్తే రేపు ఇతర రాష్టాలలోని తెలుగువారు కూడా తెలుగు మాధ్యమంలో చదువుకొనే హక్కు నిరాకరించబడే పరిస్థితులు ఎదురవుతాయి. అక్కడి ప్రభుత్వాలకు ఆ ప్రాంతంలోని తెలుగువారు శాశ్వతంగా భాషకు దూరమయ్యే పరిస్థితులు వస్తాయి. ఇక్కడ ఇంగ్లీషు ప్రధానమైనట్లే అక్కడ వారికి నచ్చిన ఇంకో భాషలో చదవమని నిర్బంధం చేయవచ్చు. ఈ పరిణామాల కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ దేశంలో ఇప్పటికి ఉన్నసమస్యలే కాకుండా భాషపరమైన సమస్యలు కూడా అధికమవుతాయి.

దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాలలో ఇలాంటి ఉల్లంఘనలు దృష్టిలో ఉంచుకొనే నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదాలో ఒకటి నుండి ఎనిమిది వరకు మాతృభాషలో విద్యావిధానం అమలుకు కేంద్రం చర్యలు తీసుకోబోతోంది. దేశవ్యాప్తంగా త్రిభాష సూత్రం అమలుచేసి ఒకే విధానం అమలు జరుగుతోంది.

ప్రథమభాషగా మాతృభాష, ద్వితీయభాషగా జాతీయభాష, తృతీయ భాషగా ఇంగ్లీషు ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉంది. మాధ్యమ భాషగా మాతృభాష ఇన్నాళ్ళు సాగింది. గత రెండు దశాబ్దాల కాలంగా రాష్ట్రంలో వ్యాపారధోరణిలో ప్రవేశించిన ప్రయివేటు పాఠశాలలకు రాజ్యాంగ విరుద్ధంగా ఇంగ్లీషు మీడియంలో అనుమతులిచ్చారు. అది తీవ్రస్థాయికి చేరింది. ఏకంగా ప్రభుత్వ పాఠశాలలనే ఇంగ్లీషు మీడియంలో కొనసాగే వరకు వచ్చింది. సమస్య ప్రారంభమైన చోట పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలి. సమస్యలో ఒక పక్షంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కావడం అసమంజసంగా అనిపిస్తుంది.

విద్య యొక్క లక్ష్యం విద్యార్థి సమగ్రాభివృద్ధి సాధించాలి. కేవలం ఉపాధి యంత్రం మాత్రం కాదు. విద్య ఉపాధి అవకాశాలకు ఆధారమని ప్రయివేటు పాఠశాలలు, పాలక వర్గాలు, కొందరు తల్లిదండ్రులు భావించవచ్చు. అందుకోసం ఏ నిర్ణయమైన అమలు పరచి అనుసరిస్తామంటే ప్రస్తుత భారత రాజ్యాంగం మాత్రం అందుకు అనుమతించదు.

ఇంగ్లీషు మీడియం అవసరం, తప్పనిసరి అయితే అది కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అమలు కాకుండా దానిపై దేశమంతటా చర్చజరగాలి.మిగతా రాష్ట్రాల ఆలోచనలు వినాలి. ప్రాథమిక స్థాయి మాధ్యమభాషపై సంబంధిత నిపుణులతో అధ్యయనం చేయించాలి. రాజ్యాంగంలో ఆర్టికల్ 350(ఎ, బి) లకు సవరణలు జరగాలి. అప్పటిదాకా ప్రస్తుతం ఉన్న నియమాల ప్రకారం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలలో ప్రాథమిక విద్య మాతృభాషలో అందే విధంగా చర్యలు తీసుకోవాలి. చట్టాలలోని లొసుగుల ఆధారంగా ప్రయివేటు పాఠశాలలకు ఇంగ్లీషు మీడియం అనుమతులను ఇవ్వడాన్ని అరికట్టాలి. ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలి.

తృతీయ భాషగా, ఒక సబ్జెక్టుగా ఉన్న ఇంగ్లీషును ఎలా ఆధునిక పరిస్థితులకు తగ్గట్టుగా మెరుగుపరుచుకోవాలో ఆలోచించాలి. ఎనిమిది సంవత్సరాలు ఒక సబ్జెక్ట్‌గా ఇంగ్లీషును శాస్త్రీయంగా అవసరమైనంత నేర్చుకోవడంపై దృష్టి పెడదాం.

ఒక సబ్జెక్ట్‌గా ఇంగ్లీష్ ను చదివి ఆ భాషలో నైపుణ్యంతోపాటు, వివిధ రంగాలలో గొప్పస్థాయికి ఎదిగినవారు మన కళ్ళముందు చాలా మంది ఉన్నారు. పూర్తిగా ఇంగ్లీషు మీడియంలో చదివిన వేలాదిమంది నిరుద్యోగులు కూడా మనకళ్ళముందే ఉన్నారు. మాతృ భాషతో జీవిద్దాం. అవసరమైనంత ఆంగ్లం వినియోగిద్దాం.

మైదుకూరులో మాతృభాషా దినోత్సవం



వివిధ మాతృభాషలను మాట్లాడేవారు, వారివారి భాషలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ మాతృభాషల్లో పట్టు సాధించినప్పుడే ఇతర భాషలపై అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ప్రసంగించిన తెలుగు భాషోద్యమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ తమ సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆంగ్లభాష అవసరం ఎంత ఉన్నా, మాతృభాషలను విస్మరించరాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగుభాషలో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థినీ, విద్యార్థులకు పుస్తకాలను, పెన్నులను బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రతినిధులు ఏ. వీరాస్వామి, ధర్మిశెట్టి రమణ, టి.మహానందప్ప, పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వై. సుభద్రమ్మ, ఎస్. వెంకటేశ్వర్లు, రెడ్డి కుమారి, శ్రీధర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636

స్థానిక పదజాలమే అమ్మభాష!!

మన మాతృభాష తెలుగే! అందులో సందేహం ఏ మాత్రం లేదు!! అయితే ఆ తెలుగులో చేరుకొన్న సంస్కృత, ఇతర ప్రాంతీయ పదాలే ప్రాథమిక దశలో పిల్లలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

నేను చాన్నాళ్లుగా నా ఉందూరి భాషలో(స్థానిక పదజాలంతో) రచనలు చేస్తూ, ఇతర్లు రాసిన వాటికి కూడా అదే భాషలో స్పందిస్తూ ఉంటే.... అందరూ నన్నో పురాభావాల పుట్ట అని,మార్పును కోరని మనువాదుల మందలోని జీవి-అని అనుకోవడం... నాతో వాదించడమూ జరిగింది.

వారికి అసలు విషయాన్ని చెప్పడానికే ఈ ప్రయత్నం.

నా వయస్సు 66. నేను గత 40 సంవత్సరాలుగా 50 యేళ్ల వయోజనుల నుండి ఐదు సంవత్సరాల గ్రామీణ పిల్లలు, మూడు సంవత్సరాలు పైబడ్డ ఆంగ్ల మాధ్యమ పిల్లలు, కన్నడం మాతృభాషగా కలిగి బలవంతంగా తెలుగు నేర్చుకొంటున్న ఉన్నత పాఠ పాఠశాల విద్యార్థులకు చదువులు నేర్పిస్తూ...నేను చిన్నప్పుడు చదివిన సమయంలో పడిన ఇబ్బందులనూ గుర్తుంచుకొని.. ఆ పరిధుల్లో చెప్పడానికి ప్రయత్నిస్తాను.

పిల్లలకు విషయ బోధన కనీసం పదవ తరగతిదాకా వారి స్థానిక పదజాలం తోనే ఉండాలి (దానినే మాండలికం, గ్రామీణం, పల్లెటూరి భాష, ఉందూరి భాష...ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు) అలా ఉన్నప్పుడు వారు విషయ గ్రాహకానికి పదాలను కంటస్తం చేయకుండా సహజ పదాలుగా గుర్తుంచుకొనే అవకాశం ఉంది.

అట్లని ప్రతి మండలానికీ ఒక్కో పాఠ్య పుస్తకం ముద్రించడం సాధ్యమా? పిల్లలని ఇతర ప్రాంత తెలుగు పదాలకు దూరం చేయడం మంచిది కాదు కదా??అని మీరు అడగవచ్చు!!

అన్ని ప్రత్యేక పుస్తకాలు అక్కర లేదు. ఏదో ఒక ప్రాంతం విద్యాధికుడు అతనికి తెలిసిన పదజాలంతో పుస్తకం రాస్తాడు. అది అతనికి తప్పదు. రాయనీయండి.

అతడు రాసిన పుస్తకంలో (1)బర్రె (2)ఆంబోతు (3)పొట్టోడు (4)గడుసరి (5)బాబాయి (6)కొండచిలువ (7)నాగలి (8)రాబందు (9)పాతిక (10)పెందలకడనే (11)మేష్టారు (12)మాపటేల (13)మోటార్ బైకు (14)అలుగు పారు (15)చీనీ కాయ (16)బొప్పాయ (17)చోళ్లు (18)ఉల్లి పాయలు (19)అటక (20)సీతాకోక చిలుక.... మొదలైన పదాలు ఉన్నాయి అనుకొందాము.

పై పదాలను ఏ ప్రాంతంలో ఎలా పిలుస్తారో ఆ పదాల్ని తెలుసుకొని ఆ పదాలతోనే బోధించాలి. పిల్లలు రాసిన ప్రాంతీయ పదాలలో అక్షరదోషాలుంటే సవరించాలి కానీ, వారు రాసిన పదాలను గౌరవించి మార్కులు వేయాలి. రచయిత పుస్తకాల్లో ప్రయోగించిన పదమే ఉండాలని బలవంతంగా వారి నెత్తిన రుద్దడమే ఇక్కడ తెలుగు భాషలో వచ్చిన చిక్కంతా!!

కాబట్టి మాతృభాష అంటే తెలుగే కానీ సంస్కృత పండితులు, మాబోటి తెలుగు పండితులు గ్రంథాల్లో నేర్చినది మాత్రం కాదని మరోసారి మనవి చేస్తూ....శ్వాస తీసుకొన్నట్లు అసంకల్పితంగా పెదవుల నుండి దాటి వచ్చేది అమ్మభాష!! ఆ భాషలో చదవడం రాయడం వస్తే ఇతర విషయాలూ భాషలూ మనిషికి వొంటబట్టడం పెద్ద సమస్యకాదు.

పైన ఉదహరించిన పదాలను నేను నా సొంత ఊరి(మండలం అనికూడా అనవచ్చు) పదాలుగా మారిస్తే (1)ఎనుము (2)కుర్ర (3)పొట్టోడు (4)గట్టోడు (5)చిన్నాన్న (6)దాసరి పాము (7)మడక (8)కాలు బాగం (9)పీతిరి పంత (10)పొద్దున్నే (11) అయ్యవారు (12)పొద్దు పడి/ సాయంత్రం (13)కుటు కుటు మోటార్ (14)మరువ పారు (15)తిత్తుల కాయ (16)పరంగి కాయ (17)రాగులు (18)యర్ర గడ్డలు (19)అట్టువ (20)ముత్యలమ్మ పురుగు ....

ఈ విధంగా పదో తరగతిదాకా అయినా బోధిస్తే, కనీసం విద్యార్థులకు తెలుగులో తప్పులు లేకుండా చదవడం వచ్చే అవకాశం ఉంది.

మీరంతా పదోతరగతి మార్కుల శాతాన్ని చూసి మోస పోతున్నారు. అక్కడ 100% వచ్చిందంటే 30% కిందే లెక్క!! మిగిలినదంతా టార్గెట్ కోసం చెప్పించిన 20 మార్కుల బిట్లూ...పరీక్ష పేపర్లు దిద్దినప్పుడు 25/30 వస్తే, ఫెయిలు చేస్తే మాత్రం యేమి చదివి ఏడుస్తాడని అక్కడొకటి, ఇక్కడొకటి ఇరికించి 35 మార్కులకు జుట్టుపట్టి లాగుతాము!!

10 పాసయిన వారిలో సగం మంది తమ పేర్లను తప్పులు లేకుండా రాయలేక పోతున్నారని చెప్పడానికి సిగ్గుపడుతున్నాను.

8 సంవత్సరాలకు ముందు బియ్యే పాసయి, బి ఈ డీ ముగిస్తూ అందులో భాగంగా శిక్షణ కోసం విద్యార్థులకు పాఠం బోధించడానికి నేను పని చేస్తున్న బడికి కొందరు వచ్చారు.(ఆ పని జిల్లా విద్యా యంత్రాంగం చేస్తుంది)

ఎదురుగా కూర్చొంటే జంకుతో ఇబ్బంది పడతారని, తరగతికి పరిచయం చేసి బయటికి పోయాను. పిరియడ్ ప్లాను చూస్తే అక్షర దోషం లేకుండా ఒక్క వాక్యం కూడా లేక పోవడం గమనించి,గతంలో నేను రాసింది ఇచ్చి దాన్ని అలాగే రాసి ఇవ్వమన్నాను. చూచి రాతలో కూడ వంద తప్పులు. (నా దృష్టిలో భాష ఉన్నది - విషయ పరిజ్ఞానాన్ని బండ్ల కెత్తి వంకలో తోసేద్దాం-తప్పులు లేకుండా రాయడం చదవడానికే) దానికి టిక్కులు కొట్టి సంతకం చేయడం నా చేత కాలేదు!! చివరికి అక్కడ నాతో పాటూ పనిచేసే గ్రేడ్ ॥ తెలుగు ఉపాధ్యాయునికిచ్చి ఆ తతంగ మేదో ముగించమన్నాను.

వీరు ఉపాధ్యాయులై ఏ భాషను బోధిస్తారు!!

ప్రభుత్వమైతే అందరూ బడిలో చేరాలి. అందరూ కనీసం పది పాసు కావాలి!! అనే నినాదాలైతే చేస్తుంది. నిజంగా అందరూ అక్షరాశ్యులు కావాలంటే, నా అనుభవంతో...

ఐదో తరగతి దాకా ఇతర సబ్జెక్టులను గాలికి వదిలేసి వారి సొంత ఊరి పదజాలంతో తప్పులు లేకుండా చదవడం రాయడం నేర్పిస్తే చాలు. పదేళ్ల దాటాక వారిలో నేర్చుకోవాలనే తపన, కుతూహలం పెరిగితే సయిన్సూ, గణితమూ, ఇతర భాషలూ, కళలూ వారి వారి శక్తిని, అభిరుచిని బట్టీ ఒకటి రెండేళ్లలో నేర్చుకో గలరు!!

ఈ మౌలికమైన సూక్ష్మాన్ని గమనించకుండా కొందరు "ధనవంతులేనా! ఆంగ్ల పాఠశాలల్లో చదివి, అమెరికాకు వెళ్లి డాలర్లు సంపాదన చేసేది?? వెనుకబడ్డవారు ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు చదివి ఇంకా వెనుకబడి పోవాల్సిందేనా!! కాబట్టి మా పిల్ల కోసం ఒకటో తరగతి నుంచీ ఆంగ్ల మాధ్యమం ఉండాల్సిందే" అని వాదన చేస్తున్నారు.

అట్టివారికి నేను చెప్పేది ఒక్కటే!! నేను పని చేస్తున్నప్పుడు ప్రభుత్వం ఆరవ తరగతి నుంచీ ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెడితే ప్రతి తరగతిలో సగం మందికి పైగా ఆంగ్లానికి మారారు. వారు పదికి వచ్చేసరికి అటు ఇంగ్లీషు,ఇటు తెలుగూ రాక - ఎంత పరిజ్ఞానాన్నీ, జీవితాన్నీ పోగొట్టుకొన్నారో ఎలా చెప్పను!!

కాబట్టి మాతృభాష అంటే తెలుగే కానీ సంస్కృత పండితులు, మాబోటి తెలుగు పండితులు గ్రంథాల్లో నేర్చినది మాత్రం కాదని మరోసారి మనవి చేస్తూ....శ్వాస తీసుకొన్నట్లు అసంకల్పితంగా పెదవుల నుండి దాటి వచ్చేది అమ్మభాష!! ఆ భాషలో చదవడం రాయడం వస్తే ఇతర విషయాలూ భాషలూ మనిషికి వొంటబట్టడం పెద్ద సమస్యకాదు.

సవరణలు

ఫిబ్రవరి సంచికలో 27,28,29,30 పుటలలో ప్రచురించిన డా॥ సిరి రచించిన 'అక్షర స్రవంతి' వ్యాసంలో దొర్లిన తప్పులను ఈ క్రింది విధంగా సరిచేసుకొనవలసినదిగా కోరుతున్నాము.

27 వ పుట మొదటి పంక్తి : హిమనీనదం (తప్పు)- హిమానీనదం (ఒప్పు).

నాలుగవ పంక్తి : తడిసేసే (తప్పు) తడిపేసే (ఒప్పు).

28వ పుట ఖమ్మం జిల్లా అంశంలో 1వ పంక్తి : వీటి (తప్పు) - నీటి (ఒప్పు).

29 వ పుట ఆదిలాబాద్ జిల్లా - 10 వ పంక్తిలో - నిక్‌పూజిసిక్ (తప్పు) నిక్ వూజిసిక్ (ఒప్పు).

29 వ పుట వరంగల్లు జిల్లా అంశంలో-3వ పేరా మొదటి పంక్తిలో: 'దెయ్యం చేసిన (తప్పు) నెయ్యం చేసిన (ఒప్పు).

వరంగల్ జిల్లా అంశంలోనే రెండవ పేరాలో -2వ పంక్తిలో: 'ఆమెలా నిజానికి' (తప్పు) - నిజానికి (ఒప్పు).

ఇబ్బంది కలిగించినందుకు మన్నించగోరుతున్నాము.

- సంపాదకుడు

కవిత

భూమిపుత్రుడు

జీవగుణం ప్రకృతి లక్షణం
చూడటానికి చిన్నదయినా
ఒక్కవిత్తు వేలప్రాణాలను సృష్టించటం
సృష్టి చైతన్య రహస్య పరంపర.
మా స్కూల్లో నా చిన్నప్పటి మర్రిచెట్టు
ఇప్పుడు లేకపోయినా
అది ఎన్ని మర్రిచెట్లుగా విస్తరించిందో
చిరునామాలు పట్టుకోవటం
ఎవరికి మాత్రం ఎప్పటికయినా
ఎలా సాధ్యం ?
ప్రతి విత్తనం రూపుదిద్దుకునేది
రైతు చెమట ..రక్తం తోనే కదా..
ప్రతి విత్తనం డి.ఎన్.ఎ.శోధనలోంచి
కులం, మతం, ప్రాంతాలను గుర్తించగలవా...
నువ్వు తినే అన్నంమెతుకు మీద
రైతన్నల వేలిముద్రల
కన్నీటి స్పర్శ తగులుతోందా...
ప్రతి బీజం దేశీయమైనప్పుడే...
ప్రతి పైరు సేంద్రియ బలాన్ని
సహజంగా సంతరించుకున్నప్పుడే...
పంటతల్లి రెండు చేతులు కలిపి
నేలమ్మకు నమస్కారం చేస్తుంది.
నిటారుగా నిలబడే జాతి జెండాలా
ఆకాశం కేసి ఆనందంగా ఎదుగుతుంది
అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు
అన్నంముద్దల్ని అందించే రైతు
మరో బ్రహ్మ కదా!
మరి విత్తనం..?
మనలాగే మట్టిలో పుట్టి...నీటితో స్నేహించి
గాలిని శ్వాసించి...మన క్షుథాగ్నిని చల్లార్చే
అమ్మకి మరో రూపం కదా!బి.టి..బోల్గార్డ్..ఏవయినా
ప్రాణాంకురంలో ప్రాణాన్ని మాయంచేసేవే!
ఎరువులకోసం...విత్తనాలకోసం
రైతన్న..బిచ్చగాడిలా మారటం చూస్తూ
విత్తనం కన్నీరు పెడుతోంది
మొలకెత్తే భూమిపుత్రుని అరచేతికోసం
అరకలన్నీ వెదుక్కుంటున్నది
విత్తనానికీ ఒకరోజును రాసిమ్మంటున్నది.

డా.సి.భవానీదేవి
9866847000

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
9441427977


తోకచుక్క - వేగుచుక్క

'లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా'

'తోకచుక్కయు, వేగు చుక్కయు, ఒడ యుడౌ వేవెల్గు కొలువుకు, వెడలి మెరిసిరి మిన్నగా'

'తూర్పు భళ్ళున తెల్లవారెను - తోక చుక్క అదృశ్యమాయెను, లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా'

(గురజాడ 'ముత్యాల సరాలు'.)



తోకచుక్కను సంఘ సంస్కరణ పతాక అనుకుని దాని వెంట పడిపోయాం.మధ్యలో 'దేశి సరుకులనమ్మవలెనోయ్' అని కలలు గంటూ, దిగుమతి చేసుకున్న చదువులతో విదేశి మార్కెట్ పెంచాం. ఆ కలలలో మధ్య మధ్య మనం పోగు చేసిన దేశి వాంఙ్మయ సంపద నేడు వేగుచుక్కగా దారి చూపిస్తుంది.

'తెల్లవాళ్ళ పాలనలో చాల బాగుం డిందని మనల్ని నమ్మించటానికి పెద్దలు ప్రయత్నం చేస్తుంటారు...మొదట్లో బ్రాహ్మ ణ్యాన్ని కనీసం సంస్కరించటానికి పూనుకొన్న బ్రిటిష్ ప్రభుత్వం, పోను పోను ఆ సంస్కరణ బాధ్యతను వైయక్తిక చొరవకు వదిలిపెట్టి బ్రాహ్మణ్యంతో సమైక్య సహజీవనం చేయ సాగారు. బ్రిటిష్ వలసరాజ్యం బ్రాహ్మణ్యం తో అంతగా రాజీ పడింది. ఆ రాజీ నుండి పుట్టిన రాజ్యం ఈ నాటికీ మనల్ని ఏలు తోంది. ఇంక మిల్ దొరగారు, మెకాలే దొర గారు, నెహ్రూ దొరగారు ఎన్ని లెక్చర్లిచ్చినా, అది ప్రజాస్వామికంగా ఎట్లా ఉండగలదు?! (నూరేళ్ళ కన్యాశుల్కం ప్రత్యేక సంచికలో బాలగోపాల్ వ్యాసం)

తెల్లవాళ్ళు రావటానికి ముందు 'మొత్తం సాహిత్యం మీద మౌఖిక సాహిత్య ప్రభావం బలంగానే ఉంది' (త్రిపురనేని మధుసూదనరావు (త్రిమరా) 'సాహిత్యం లో వస్తు శిల్పాలు').వాళ్ళ హయాంలో మొదట్లో బోధనా మాధ్యమంగా గ్రాంధికం తిష్ట వేసింది. అక్షర్యాస్యత, ప్రచురణరంగం, ప్రామాణిక భాష ఆవిష్కరణకు దారి తీసాయి. క్రమంగా వ్యావహారిక /ప్రామాణిక భాష, బోధనా మాధ్యమం, అధికార భాష, పత్రికా భాష, ప్రాచీనభాష, ఇప్పుడు ప్రాధమిక స్థాయిలోనన్నా మాతృభాష...ఇలా చదువు కున్నవారు, చదువుకునే వారికోసం ఉద్య మాలు చేస్తున్న కొద్దీ, బతుకు తెరువులలో శాస్త్రం/భాష గుర్తించి - కాలానుగుణంగా వస్తున్న మార్పులు గమనించి, కష్టజీవులకు సాయపడే ప్రయత్నాలు అడుగంటి పోసా గాయి.

'క్రీస్తు పూర్వం వెయ్యి సంవత్సరాల క్రితం తెలుగు సంస్కృతి, ఆనాటి, పాశ్చాత్య సంస్కృతుల కంటే ఏమాత్రం తీసిపోదు. **ఏ కాలంలోనైనా, ఒక భాష మాట్లాడే వాళ్ళ సంస్కృతి వాళ్ళ పదజాలం లోనే ఇమిడి ఉంటుంది'** ('భాష సమాజం సంస్కృతి' : భద్రిరాజు) 'తెలుగుభాష ఎంత విస్తృత మైనదో తెలుసుకోటానికి జానపదుల వాడు కలో ఉన్న పదజాలాన్నంతటిని కోశస్థం చేయాలి. ఇంతవరకు వచ్చిన తెలుగు నిఘం టువులు ప్రధానంగా కావ్యభాష ఆధారంగా ఏర్పడ్డవి కాబట్టి, వాడుకలో ఉన్నపదాలు వాటిలోకి ఎక్కలేదు'. అని గమనించి ఎంతో శ్రమకోర్చి మాండలిక వృత్తి పద కోశాలు తయారు చేసి ఆ లోటును పూరించే ప్రయ త్నం చేశారు. దేశ్య పదజాలాన్ని ప్రమాణ భాషలో పునరుజ్జీవింపచేయటానికి, మాతృ భాషలో సామాన్య శాస్త్ర గ్రంథాలు రచించ టానికి వయోజన విద్యావ్యాప్తికి కూడా ఈ



కోశాల్లోని పదజాలం అపారంగా ఉపయో గిస్తుంది' (మాండలిక వృత్తి పదకోశం- వ్యవసాయం: భద్రిరాజు కృష్ణమూర్తి.) అని ఆశించారు కాని, ఆ ప్రయత్నాలు, వారుగానీ, వారి మలితరం గాని చేపట్టలేదు. నన్నయ, తిక్కన పదప్రయోగ సూచికలనుండి రావిశాస్త్రి సిమిలీల వైపు వారి కృషి మళ్ళింది. ఫలి తంగా భాషోద్యమాలు, నేలవిడిచిన సాములై ప్రజలలోకి చొచ్చుకు పోలేకపోయాయి. వేతన శర్మలకు సాహిత్యం ఆటవిడుపు విడిది అయింది. 'వెన్నెముకలేని మధ్యతరగతి' (త్రిమరా) శిష్టసాహిత్యం సృష్టించసాగింది'. 'సమాజంలో విద్యావంతులై కవిత్వం సృష్టిం చగల, అనుభవించగల వర్గం ఒకటి ఉంది. ప్రజారాశులకు లేని సంస్కృతి తమకు ఉందనే గుర్తింపు కోసం ప్రయత్నం చేస్తూ ఉంటారు. సామాన్య ప్రజలకు నీచాభిరుచులుంటాయి. ఉత్తమ కవిత్వాన్ని అనుభవించే శక్తి వారికి ఉండదు. శిష్టుల, సామాన్య ప్రజల అభి ప్రాయాల, అభిరు చుల సంఘర్షణ నుంచి, శిష్టుల వైపుగా కవిత్వం అభివృద్ధి పొందు తుంది. ఇది శిష్ట వాదం.ఆధునిక కవిత్వంలో విభిన్న ధోరణు లకు ఈ శిష్టవాదమే నేపథ్యం'. (త్రిమరా).

'సాహిత్యం సమాజానికి పూసే పువ్వు. చెట్టుకు పూలు పూస్తాయి కాని, పువ్వుకు పూలు పూయవు'.(కొ.కు ప్రత్యేక సంచిక. ప్రజాసాహితి.) క్రమంగా ఈ శిష్ట సాహిత్యానికి ఎదుగు బొదుగులేని గుంట



పూలు, వాసనలేని కట్ ఫ్లవర్స్, వెలిసిపోయే కాగితం పూలు పూయసాగాయి. తెలుగువారి సాంఘిక జీవితం, శాస్త్రజ్ఞానం,వృత్తి పద కోశాలకు బదులు, శిష్ట సాహిత్యంలో వెతుక్కునే ధోరణి పెరిగిపోయింది. చూరులోంచి సూర్యకాంతిని చూపించే సాహిత్య గాళ్ళు పెరిగి పోయారు.

'మధ్య వలసవాదులు వచ్చి మొత్తం సామాజిక వ్యవస్థను కంపింప చేయకపోతే (తంజావూరు యుగంలో) స్వేచ్ఛాభోగ ఉద్యమం స్త్రీ విముక్తి ఉద్యమంగా పరిణమించేది. ఎన్నో సహజమైన మార్పులు వచ్చేవి' (త్రిమరా). సంస్కరణలు, శాస్త్రీయ దృక్పథం సంప్రదాయాన్ని నిరసించి, పాశ్చాత్య విచారధారకు పట్టం కట్టాయి. ఒకనాడు, నేడు చదువుకున్నవాళ్ళు అనువాద సాహిత్యాలనే అంటగడుతున్నారు (త్రిమరా). విదేశీ సాహిత్యం పునర్ముద్రణకు నోచు కుంటున్నది, కాని జానపద సాహిత్యం విశ్వ విద్యాలయాలకే పరిమితం అయింది.

'తెలుగులో మరో రకం సాహిత్యం: తెలుగు భాషలో రాయ బడిన పద వాఙ్మయం. పల్నాటియుద్ధం, కాటమరాజు కథ, దేశింగు రాజు కథ..వంటి ప్రజలలో ప్రచారంలో ఉన్న కవిత్వమే తెలుగు కవిత్వం' (త్రిమరా) ఉద్యమ, శిష్ట సాహిత్యాలమధ్య, బతుకు తెరువుతో పెనవేసుకున్న ఈ జానపదం, కనుమరుగు కాసాగింది. 'పాలకవర్గాలు' ఈనాటికీ తెలుగు సాహిత్యాన్ని జానపద సాహిత్యం అని ముద్దుపేరో మొరకపేరో పెట్టి విస్మరిస్తున్నారు'. (త్రిమరా) 'మూక కళ...శిష్ట బృందంలోని క్షుద్రులు ప్రజల్ని అలగాజనంగా తయారు చెయ్యటానికి సృష్టించే కవిత్వం మూకకవిత్వం. మూక కవిత్వానికి రూపంలో ప్రజా స్వభావం ఉంటుంది. జానపద బాణీ లను ఉపయోగించుకుంటారు... ఈ మూక పదచిత్రాలలోని దృశ్యాల నీడలు పాఠకుడి మనస్సుని ఆక్రమించుకుని, అతని సంస్కారాన్ని, ఆలోచనా పద్ధతిని, దృక్పథ పరిపక్వతను, సున్నితమైన అభి రుచిని, తార్కిక శక్తినీ, భయంకరంగా వికృతం చేస్తాయి'. (త్రిమరా) నకిలీ జానపదాలు పెరిగి కళాజాతలుగా దిగజారాయి.

'పాఠ్యంశాల నిర్ణయంలో విద్యార్థులు మిలిటెంట్‌గా జోక్యం చేసుకున్నారు'–'ప్రజల మనిషి' వరవరరావు. 'జానపద బాణీలో గెరిల్లాలు ప్రవేశ పెట్టిన గాథలు వినిపించాయిగాని, అమ్మమ్మ నాయ నమ్మ కథలు విని పించలేదు'. ('జంగల్ నామా' – వరవర రావు)' కథయే పరమార్థంగా, వాహికగా కాక, లక్ష్యంగా, సాహిత్య ప్రక్రియగా కాక, ఉద్యమంగా ప్రచారం చేసి, ఆ ప్రచారమొక సత్యంగా ప్రచారం చేసి,...ఆ ప్రచారమొక సత్యంగా నమ్మే ప్రమాద సూచిక దగ్గరికి ప్రచారకులు చేరిపోయారు'. (భూమితో మాట్లాడు – వరవర రావు.) ఉద్యమ 'కార్యకర్తల ప్రచార లక్ష్యం నెరవేరినా, ప్రజలు తమ అనుభవాలను కవితాబద్ధం చేయటానికి, వారు కార్యకర్తలు కట్టిన విని పించిన పాటలను ఆదర్శంగా భావించటంతో, ఆ స్థాయిలో రాసినవే పాటలని, తాము ఆ స్థాయిలో రాయలేమని భావిం చటంతో వారు (జాన పదులు) తమ అనుభ వాలకు పాట రూపాన్ని ఇవ్వలేక పోయారు'. (శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం: ముత్యం)ఈ విధంగా ప్రజలు రచయితల పాటలమీద ఆధారపడసాగారు. తమ విత్తనాలు, ఎరువులు తాము తయారు చేసుకోకుండా కంపెనీల సరుకు కొనుక్కో సాగారు.

ఉద్యమాలు వేడి పుట్టిస్తున్నాయి. ఉద్యమనాయకులు బలి అయిపోతున్నారు. కాని, ఈ వేడి తరువాత వచ్చే భూసంస్కరణ వగైరా చట్టాల వెలుగును దక్కించుకొనేందుకు, 'తిరిగే కాలు – తిట్టే నోరు'గా పేరు తెచ్చుకున్న మేధావులు, సాయపడలేక పోయారు. అమరుడైన పిడిఎస్‌యు విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి తమ్ముడు సిరిల్ 'సలహా' సంస్థ, యంగ్ ఇండియా సంస్థలు చెప్పటం మొదలు పెట్టిన భూమి కూలి లెక్కలు ప్రచారం చేయలేకపోయారు. మావో ఆలో



చనా విధానం అంటూ ఆదరగొట్టేవాళ్ళు మావో ఆచరణను, విద్యా విధానాన్ని కనీసం ప్రస్తావించటం లేదు.'Students studied the fundamentals of internal combustion engines in mathematics classes, students studied how to measure the volume of a pile of grains, a pile of organic fertilizers and the size of piece of land as well as principles and rules of book keeping for the collective farms. All this changed in the reform era...millions of children are forced to memorize trivial facts about distant western countries, while learning nothing about their own communities. (EPW ,Dec 27,2008)

చిలకమర్తి వారన్నట్లు 'నీవేమన్నా కరణానివా, మునసబువా, అమీనువా, కనిస్తేపువా! నీకు దడిసేందుకు?' చదువు ఉద్యోగం కోసం ,ఉద్యోగం అధికారదర్పం చూపించడానికి, జనాన్ని మోసగించటానికి దారితీయటం జనాన్ని ఉద్యమాల బాట పట్టించింది. ఉద్యమ సాహిత్యం ఉత్సాహాన్ని, చైతన్యాన్ని పెంచిందే కానీ ఆలోచనను జ్ఞానాన్ని పెంచలేదు. జ్ఞానం లేని చైతన్యం గుడ్డిది. చైతన్యం లేని జ్ఞానం కుంటిది. చోదక శక్తి కావలసిన సాహిత్యం మాదకద్రవ్యంగా మారింది..'

ఒకనాడు వేదాలు, మంత్రాలుగా మారి క్రతువులకు సంభావనలకు పరిమితమైన తరుణంలో, అడవులు ఉపనిషత్తులకు తత్త్వ విచారానికి శ్రీకారం చుట్టాయి.కాని తెలుగు దేశంలో అడవులకు వెళ్ళిన భాషా పరిశోధకులు కొత్తభాషను కనుక్కోవటం,



దానికి వ్యాకరణం రాయటానికి పరిమితమై, తెలుగు గిరిజన మాండలికాన్ని పట్టించుకోలేదు, 'కొండ భాషకు మాండలికాలు ఎక్కువ. కొండ భాషాపదానికి అర్థం తెలుగు పదం వల్లనే తెలుస్తుంది' (భాష సమాజం సంస్కృతి : భద్రిరాజు) అన్న వారి పరిశీలన, ఆ దిశలో కొనసాగలేదు. మాతృభాషలో విద్యా బోధన పథకంలో తెలుగేతర తెగలకు వాచకాలు తూతూమంత్రంగా తయారు చేసారు.

కాని తెలుగు తెగల సాహిత్య సేకరణ, మానవ శాస్త్ర నేపథ్యంతో ప్రాచ్య పాశ్చాత్య విచారధారలను సమన్వయిస్తూ చేసిన కృషిని, చెంచులు కొండరెడ్ల సంప్రదాయ సాహిత్యం, భావదాస్యంలో కూరుకుపోయిన తెలుగుజాతి పట్టించుకోలేదు. తన మూలాలను తెలుసుకుని 'ఎటునుంచి ఎటు పోతున్నావో' (కొ.కు.) తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

మన సాహిత్యవిమర్శ, ఆంగ్ల, సంస్కృత సంప్రదాయాల నుండి వచ్చింది కాని మానవశాస్త్ర విశ్లేషణ విధానాలను అర్థం చేసుకోలేదు. ఫ్రెంచ్ తత్వవేత్త జీన్ పాల్ సార్త్రే గురించి తెలిసిన చాలామందికి, మరో ఫ్రెంచ్ మానవ శాస్త్రవేత్త లెవి స్ట్రాస్ గూర్చి తెలియదు. 1970 నుండి గ్రామనామాల చరిత్రలు వస్తున్నా, చరిత్ర రచనలో ఇంకా వాటికి చోటు దొరకలేదు. 'బీల తంపర' దేశి పదాలమీద ఒక ఉద్యమం నిర్మాణమైంది. ఆ పదసంపద మీద మనం దృష్టి పెట్టలేదు.

'అభ్యుదయ వాదం అవలంబించిన వారిలో కూడా అనేకులు మార్పు మనిషికి బాహిరంగా, సామాజికవ్యవస్థ లోపలనూ వస్తేనేగాని సమాజస్వరూపం, అభ్యుదయకరంగా మారదని గుర్తించి కూడా, ఆ మార్పు తెచ్చే బాధ్యత ఇంచుమించు పూర్తిగా అతిధులకు వదిలేసి, జనాన్ని వర్గరహిత సమాజంకేసి సుముఖులను చేయటానికి, సమాజాన్ని విమర్శించటానికి,ఎక్కువగా పాటుపడ్డారు'. (కొ.కు. ప్రత్యేక సంచిక ప్రజా సాహితి.)

సాహిత్యం తెలిసినంతగా మనకు సమాజం తెలియదు. రచయిత రావిశాస్త్రి, యానాది ఎరుకల తెగల విముక్తికి పాటుపడ్డ రాఘవయ్య న్యాయవాదులు, సమకాలికులు, రచయితలు. రావిశాస్త్రి రచనలు చదివే వారికి రాఘవయ్య కృషి తెలియదు.

మొత్తానికి సహజవనరులు క్షీణించి ప్రపంచమంతటా పాలకులకు జ్ఞానోదయం కాసాగింది. సంస్కృతి వైపు, సంప్రదాయం వైపు వారి దృష్టి మళ్ళింది. ఈ హెచ్చరికలు కూడా పనిచేశాయి..

'విద్యార్థి జీవితంలో ఏదో ఒక వృత్తిలో స్థిరపడే శిక్షణ ఇవ్వాలి. క్రింది తరగతులలో వల్లె వేయటం విద్యార్థికి క్రమశిక్షణను అలవాటు చేస్తుంది. అమెరికనిజం ఫోర్డిజం అనే పద్ధతి కష్టజీవులలోని ఒక వర్గాన్ని కమ్యూనిజం నుండి వేరుచేస్తుంది. సోవియట్ యూనియన్‌లోని ఆ దేశ సోషలిస్టు నిర్మాణంలోని బలహీనతలే సోవియట్ యూనియన్ కుప్పకూలడానికి దారితీశాయి. రైతాంగం పట్ల, జాతుల పట్ల అనుసరించవలసిన వైఖరిలో పెడధోరణులు, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించడం జరిగాయి'. (గ్రామ్సీ - రచనలు వర్తమాన ప్రపంచం. నంబూద్రిపాద్-ప్రజాశక్తి ప్రచురణ. 1996)



'Both capitalism and socialism -- has shown themselves incapable of extricating the majority of our people from misery; and cultural question. Therefore is this; is there another solution, A solution of our own'. Report of World Commission on Culture and Development -1996

పారిశ్రామిక విప్లవానికి తగిన అభివృద్ధికి దేశీయ విద్యలు సరిపోవని- పాశ్చాత్య విద్యలను మనం దిగుమతి చేసుకున్నాం.ఐతే ఈ అభివృద్ధివిధానం వల్ల సహజ వనరులు క్షీణదశకు వచ్చాయి.సతత హరిత విప్లవం, సుస్థిర అభివృద్ధి అంటూ దిద్దుబాటు చర్యలు చేపడుతున్నాం. ఈ దశలో మనం ప్రాచ్య పాశ్చాత్య శాస్త్ర పద్ధతులను సమన్వయం చేసుకోకపోతే, దిద్దుబాటు చర్యలు కూడా వారు చెప్పినట్టుగానే చేస్తూపోతాం. శాశ్వతంగా భావదాస్యంలో కూరుకు పోతాం. గుడ్డిగా శ్రమించే వర్గం, ఆ శ్రమను నిర్దేశించే వర్గంగా మిగిలిపోతాం'.

1990 తరువాత ప్రపంచీకరణ ప్రయత్నాల ద్వారా, జ్ఞానంలో వివిధ కోణాలను గుర్తించే కృషి ఊపందుకుంది. ఇంతకాలం సహజ వనరులు కొల్లగొట్టటంలో చేతులు కలిపిన పాలకవర్గాలు, శాస్త్రవేత్తల దృష్టి సేంద్రియ వ్యవసాయం, సంప్రదాయ జ్ఞానం, మేధో సంపత్తి హక్కులు, ఉమ్మడి వనరుల వాడుక, హక్కులగుర్తింపు వైపుగా మళ్ళింది. 2002లో జీవవైవిధ్య చట్టం, 2006లో అటవీ హక్కుల గుర్తింపు చట్టం వచ్చాయి.

తెలుగువారు ఆరంభ శూరులు - ఆవేశ వివశులు. కొత్తొక వింత అని తోక చుక్కలు - తెల్లవాళ్ళ వెంటపడ్డాం...వాళ్ళ విద్య, ఉద్యోగాలకు ఎగబడ్డాం. మధ్యలో బడుగు జనాన్ని బతికించే దేశి చదువులు, జానపద వాంఙ్మయం పోగు చేసి, వదిలేశాం. చీకట్లోంచి చీకట్లోకి పరుగెడుతున్నాం. మధ్యలో ఉద్యమాలలో పుట్టిన వేడిని, వెలుగుగా చట్టాల అమలులో పాల్గొని నిలబెట్టుకోలేక పోతున్నాం. మనం పక్కనపెట్టిన 'దేశి' సంపద నేడు ధ్రువతార, వేగుచుక్కగా మనకు దారి చూపిస్తుంది. వాటిని నవీకరించుకుని, శాస్త్ర సాంకేతిక విధానాలతో మేళవించుకోవాలి. జీతం కోసం చేసే కొలువులు కాదు, ప్రజల బతుకు తెరువులే, వారి భాష, నైపుణ్యాలే సుస్థిర అభివృద్ధికి రహదారులు.

నవల

డి.పి. అనూరాధ
9010016555



జగమునేలిన తెలుగు

గోదావరి నుంచి జావా దాకా... 7

(జరిగిన కథ)

తెలుగు తల్లి కృపతో సూర్యవర్మ కాలాలకు అతీతంగా ప్రయాణాలు చేస్తుంటాడు. ప్రాచీన తెలంగాణతో అనుబంధం ఉన్న మయన్మార్ మూల తెగవారైన మన్ జాతీయులను కలుసుకుంటాడు. మయన్మార్, థాయిలాండ్లలో వారి ప్రాచీన రాజ్యాలను సంచరిస్తాడు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆంగ్ కార్ వాట్ ఆలయంతో తెలుగు నేలతో ఉన్న వాస్తు సంబంధం తెలుసుకుంటాడు. కాంబోడియా తరవాత అతడి తరువాతి మజిలీ ఎక్కడో...

సముద్ర అలల్లో ప్రయాణం...

ఓ మోస్తరుగా ఉంది నావ...

ఇరవై మంది ఉన్నారు.. బలమైన శరీర దారుఢ్యం వారిది..

మోకాళ్లవరకూ పంచలు కట్టుకుని ఉన్నారు..

వారిలో ఓ వ్యక్తి... నాయకుడిలా ఉన్నాడు.. సముద్రంకేసి తీక్షణంగా చూస్తున్నాడు..

'అందరూ సిద్ధంగా ఉండండి... పెద్ద నౌక సమీపంగా వస్తోంది.. మూకుమ్మడిగా దాని పైకి దాడి చేద్దాం.. సిద్ధంగా ఉండండి' అంటూ హెచ్చరించాడు.

అందరూ అప్రమత్తులై విల్లంబులు ఎక్కుపెట్టి తెరచాపల వెనక దాక్కున్నారు..

ఓ పెద్ద నౌక ఎదురుగా వస్తోంది.. ఒక్కసారిగా ఆ నావికుల పైకి బాణాల వర్షాలు కురిపించారు..

అనూహ్య పరిణామానికి తేరుకుని... కొంత మంది ఎదురు దాడి చేశారు.. కానీ వీరు చాకచక్యంతో వారి ఆటలు కట్టిపడేశారు.

ఒక్కసారిగా ఆ నౌకలోకి తాళ్లసాయంతో దూకారు. చురకత్తులతో ఆ నావికుల్ని బెదిరించి నిలువు దోపిడీ చేశారు. కొన్ని సరకుల మూటల్ని తీసి తమ నౌకలోకి విసిరేశారు. ఆ నౌకా యాత్రికులందరూ శిలల్లా మారారు..

అక్కడ జరుగుతున్నదంతా స్పష్టంగా కన్పిస్తోంది.. ఈ సముద్ర దొంగలందరూ క్షణాల్లో తమ పనులన్నీ పూర్తి చేసుకుని తమ నౌకలోకి దూకేశారు.. అంతే వేగంతో తమ నౌకను నడుపుకుంటూ ముందుకు వెళ్లారు.

పెద్ద నౌక క్రమంగా కనుమరుగైంది.. అందరూ సంతోషంగా ఈలలు వేశారు.

నాయకుడు తాము దొంగిలించిన మూటలన్నిటిని మధ్యలో పెట్టి తెరిచాడు.. బంగారు నాణేలు...ధాన్యాలు..పట్టు వస్త్రాలు.. వజ్రవైఢూర్యాలు.. ఇలా విలువైనవి ఎన్నో ఉన్నాయి..

'ఈ దాడిలో వారిని గట్టి దెబ్బే కొట్టాం'.. అంటూ నాయకుడు అందరినీ చూస్తూ నన్ను చూడగానే కాస్త ఆశ్చర్యం కాస్త ప్రేమ కలబోసిన నవ్వుతో నా దగ్గరకు వచ్చాడు.

'నా పేరు భద్ర... నువ్వొస్తున్నావని మా ఆచార్యులు చెప్పారు. నీ కోసం చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నా..' అన్నాడు.

'నా గురించి నీకెలా తెలుసు' ఆత్రంగా అడిగాను.

'మన తెలుగు జాతంతా ఒకటే.. నువ్వు భవిష్యత్తు తరం వాడివి.. మేం పాత కాలానికి చెందిన వాళ్లం. మా కథంతా మీకు తెలియాలి కదా.. అందుకే మనం ఇలా కలుసుకున్నాం. సముద్ర దొంగలమని మమ్మల్ని తక్కువ అంచనా వేయొద్దు..

అనాదిగా మాకూ హూనులకు విరోధం. వాళ్లు మా ఊర్లను ఊర్లు ఎన్నోసార్లు ధ్వంసం చేశారు.. మా ఆలయాల్లో మణులూ,



మాణిక్యాలను కొల్లగొట్టడమే కాదు విగ్రహాలనూ వదలేదు. బంగారు విగ్రహాలను కరిగించి ధనాన్ని దండుకుంటున్నారు. అందుకే మాకు ఆ రాజ్యం వైపు వెళ్లే నౌకలన్నా.. అటు నుంచి వచ్చే నౌకలన్నా కోపం. వాటిపై సముద్ర దొంగల్లా మెరుపుదాడులు చేసి కొల్లగొడుతుంటాం. ఇదో ప్రవృత్తిలా మా జాతికి మారింది. అంటూ చమత్కారంగా నవ్వాడు.

'మీరెవరు... నేను ఎక్కడున్నాను' సూటిగా ప్రశ్నించాను.

'నువ్వు ప్రస్తుతం ఉన్నది చంపా రాజ్యంలో.. మా తాత ముత్తాతలు ఎంతో సాహసికులు.. ధాన్యకటకం పరిసర ప్రాంతాల్లో వర్తక వ్యాపారాలు చేసే వారట..

తమ వ్యాపారాన్ని విస్తరించుకోవాలన్న ఉద్దేశంతో పెద్ద ఓడలను తయారుచేసుకుని తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ బయల్దేరారు. ఎన్నో మాసాలు ప్రయాణం చేసిన తరవాత జావా ద్వీపాన్ని చేరుకున్నారట. అక్కడ పోటీ ఎక్కువగా ఉండడంతో ముందుకు వచ్చి ఈ నేల మీద ఆగిపోయారు." అంటూ విపులీకరించాడు.

అయితే నేను ప్రస్తుతం చంపా రాజ్యంతో ఉన్నానన్నమాట. అది నేడు ఏ దేశంగా మారిందో అర్థంకాలేదు. అదే ఆలోచనలతో ఉండిపోయా. ఇంతలో రేవు వచ్చింది.. అందరమూ మూటలతో సహా దిగాం. చాలా నౌకలు లంగరు వేసి ఉన్నాయి. పెద్ద నౌకలు లేవు. అన్నీ చిన్నవే.

గ్రామం తీర్చిదిద్దినట్టుగా ఉంది. రహదారులకు ఇరువైపులా ఇళ్లను నిర్మించారు. మట్టి.. చెక్కతో నిర్మించిన ఇళ్లే అన్నీ..

మగవారికి మీసాలున్నాయి.. స్త్రీలు పొడవైన కురులతో అందంగా ఉన్నారు. పైట, లంగా లాంటి వస్త్రాలు ధరించారు. నడుముకు వడ్డాణం, చెవులకు లోలాకులు, మెడలో హారాలు, చేతికి కంకణాలు లాంటి ఆభరణాలను ధరించారు.

భద్ర దారిలో తెలిసిన వాళ్లందరినీ పలుకరిస్తూ ముందుకు వెళ్తున్నాడు. మిగతా అందరం అతడిని అనుసరిస్తున్నాం. చూస్తుంటే అతడు ఈ గ్రామ నాయకుడిలా ఉన్నాడు.

రెండు అంతస్తులున్న ఓ పెద్ద కలప ఇల్లు దగ్గర ఆగాం.

'మిత్రమా, ఇదే మన ఇల్లు.. సుస్వాగతం..' అని ఆహ్వానించాడు.

చూడచక్కగా ఉంది.. లోపలి నుంచే పైకి వెళ్లేందుకు చెక్క మెట్లున్నాయి. ఆ మూటల్ని మేడ పైన ఓ గదిలో పెట్టేసి అతడి అనుచరులు వెళ్లిపోయారు. అతడి భార్య మమ్మల్ని భోజనానికి రమ్మంది. వరి బియ్యం.. చేపల పులుసూ.. అంబలి..ఫలాలతో భోజనం పూర్తిచేశాం..

'మిత్రమా కాసేపు విశ్రాంతి తీసుకో.. భద్రేశ్వర ఆలయం వెళదాం అంటూ ఆ గదిలో రెండు చిరుచాపలు పరచాడు.. ఒక దానిపై తాను పడుకున్నాడు. పక్కదానిపై నేను సేద తీరాను. అలసటగా ఉండడంతో వెంటనే నిద్రపట్టింది.



ఇద్దరమూ గుర్రాలపై బయల్దేరాం..

'చంపా రాజ్య ప్రధాన దేవుడు భద్రేశ్వర స్వామి.. వాస్తవానికి భద్రవర్మ అనే చక్రవర్తి శివాలయాన్ని నిర్మించి తన పేరునే ఆ ఆలయానికి భద్రేశ్వర ఆలయం అని పేరు పెట్టాడట' ఆలయ విషయాలను భద్ర వివరిస్తున్నాడు.

చుట్టూ పచ్చని కొండలు.. పారే సెలయేర్లు.. పక్షుల కిలకిల రావాలు.. దారంతా ఎంతో అహ్లాదకరంగా ఉంది. అల్లంత దూరం నుంచే కళ్లను ఆకర్షించింది ఆలయ గాలి గోపురం.. ఇటుకలతో నిర్మించిన ఆలయం అది.. పైకప్పుకు అక్కడక్కడా కలపను వాడారు. చుట్టూ ప్రాకారం కూడా ఇటుకలదే.

అక్కడ అశ్వశాలలో గుర్రాలను కట్టేసి గుడి చూడడానికి వెళ్లాం. ఈ రాజ్యంలో ఏనుగులూ కన్పిస్తున్నాయి. కొంత మంది భక్తులు ఏనుగు అంబారీలపై వస్తున్నారు.

అర్చకులు సంస్కృత వచనాలు వల్లెవేస్తూ పూజలు చేస్తున్నారు. సుమారు 2 అడుగుల ఎత్తుతో శివలింగం ఉంది. విభూతిరేకులు, పూలతో చక్కగా అలంకరించారు. గుడిలో పూజ తరవాత ఆలయం పక్కనే ఉన్న ఓ కుటీరానికి వెళ్లాం. అక్కడ ఆలయ ప్రధాన అర్చకులు ఉన్నారు. ఆయన ముఖం బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతోంది. ఆయన్ని చూడగానే భద్ర సాష్టాంగ నమస్కారం చేశాడు. నేను అనుసరించాను.

మమ్మల్ని ఆశీర్వదిస్తూ 'సూర్యవర్మా, ఎలా ఉన్నావ్ నాయనా' అని అడిగారు.

బాగున్నానని తలాడించాను.

'చేజెర్ల కపోతేశ్వరాలయంలో మా తండ్రి ప్రధాన అర్చకులుగా



ఉండేవారు. ఆ ఊరి వ్యాపారస్థుల కొడుకులు దూర తీరాలకు వ్యాపారం కోసం వెళుతున్నామని చెప్పారు. నేనూ వారితో కలిశాను. మొదట మా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఏ గడ్డ మీదున్నా శివారాధ నను విడిచిపెట్టనని, మన సంస్కృతీ సంప్రదాయాలను మంటగలపనని ప్రమాణం చేశాను. అలా ఈ నేల మీదకి వచ్చి మొన్న కార్తీక పౌర్ణమికి అరవై వసంతాలు పూర్తయ్యాయి. మన ఆచార వ్యవహారాలన్నిటినీ ఇక్కడ క్రోడీకరించాను. భవిష్యత్ తరాల కోసం వేద పాఠశాలలను ఏర్పాటుచేశాను. ఇక్కడి రాజభాష సంస్కృతమే. రాజగురువుగా రాజ్యంలో మంచి పేరుంది. కీలక సందర్భాలలో మహారాజుకి ఆంతరంగిక సలహాదారుడిగా వ్యవహరిస్తున్నాను. విదేశీ గడ్డపై మన హిందూ సంస్కృతిని విస్తరింపజేయడంలో విజయం సాధించాను. నా మాతృభూమి నుంచి వామ భుజంపై హంసగుర్తులున్న ఓ యువకుడు వచ్చి అతి త్వరలో కలుస్తాడని అశరీరవాణి తెలిపింది. దానికి మూలకర్త భద్రుడవుతాడనీ తెలియజేసింది. ఈ రోజు కోసమే ఎదురుచూస్తున్నా' అంటూ నన్ను చూశారు.

నేను ఎంతో ఆశ్చర్యంగా ఆయన మాటలు వింటున్నా.. నాగార్జునకొండకు వెళ్లి పచ్చబొట్టు పొడిపించుకోవడం వల్లే ఇదంతా జరుగుతున్నట్టుగా అన్పిస్తోంది.

'సూర్యవర్మా నాదో కోరిక నెరవేరుస్తావా' అని ఆచార్యుడు నా దగ్గరగా వచ్చి నిలుచున్నారు.

'చెప్పండి గురుదేవా'

'నువ్వు స్వదేశం వెళ్లిన తరవాత చేజెర్ల కపోతేశ్వర ఆలయంలో నా పేరున రుద్రాభిషేకం చేయించు. ఇదే నా ఆఖరు కోరిక. శుభం భూయాత్...' అంటూ పక్కనే ఉన్న అరటిపళ్లను నా చేతిలో కొన్ని, భద్ర చేతిలో కొన్ని పెట్టి లోపలికి వెళ్లిపోయారు.

ఆయన్ను తన చిన్ననాటి జ్ఞాపకాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్టున్నాయి.

నేనూ, భద్రా ఆయన వెళ్లిన దారి వంకే చూస్తూ ఉండి పోయాం. కాసేపటికి అక్కడి నుంచి ఇద్దరమూ మౌనంగా బయటకు వచ్చేశాం. కొంత మంది యువతులు విశేష వస్త్రధారణలో మెరుపు తీగల్లా మాకు ఎదురుపడ్డారు.

వారందరూ ప్రతి సాయంత్రం ఆలయ వేదికపై 'అప్సర నృత్యం చేస్తారట. ఆ అద్భుత నృత్యాన్ని చూసిన తరవాతే వెనుదిరగా లని నిర్ణయించుకున్నాం. ఓ సెలయేటి ఒడ్డున సేదతిరగాం. చల్లని గాలి వీస్తోంది. రంగు రంగుల పక్షుల కిలకిల రావాలు.. అహ్లాద కరంగా ఉంది వాతావరణం... మనసులో మాత్రం ఏదో నిశ్శబ్దం.. ఆచార్యుడి లాంటి వాళ్లు ఎంత మంది ఆవేశంతో ఇలా సముద్ర దారుల్లో తమ మాతృభూమికి దూరంగా వచ్చేశారో. వారిలో రాజకుమారులు, వ్యాపారస్థులు, బ్రాహ్మణులు, శిల్పకారులు, చిత్ర కారులు, వ్యవసాయ కుటుంబీకులు, నేతకారులు, కుమ్మరులు, కమ్మరులు, కూలీ పని వాళ్లు ఇలా అందరూ ఉండొచ్చుకదా. రాజశాస నాలలో రాజుల పేర్లు కనపడతాయి కానీ, నేను ఇక్కడికి రాకపోతే ఆచార్యుడి కథ తెలిసేది కాదు. మిగతా వాళ్ల కథలన్నీ ఈ నేలలో కరిగి కలిసిపోవలసిందేనా? అలా ఎన్ని దేశాల్లో మన జాతి వారి

కథలు కొండెక్కిపోయాయో... విచారంతో గుండె బరువెక్కింది.

ఉద్యోగరీత్యా నేడు కూడా ఎంతో మంది అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, యూరోపు ఇలా ఎన్నో ఖండాలకు వెళ్తున్నారు, వాళ్లు తమకు తెలిసినంత వరకు తమ కుటుంబం, తమ ఊరు చరిత్రను ఓ చోట రాసిపెట్టుకోవడం మంచిది. భవిష్యత్ తరాల వారికి అదో చారిత్రక గ్రంథంలా ఉపయోగపడుతుంది. ఏదో శబ్దం విన్పించేసరికి నా ఆలోచనలు ఆగిపోయాయి.

ఇద్దరు యువకులు గుర్రాలపై ఎంతో వేగంగా మా ముందుకు వచ్చారు.

'భద్రన్నా, ఘోరం జరిగిపోయింది. రాజ్యంపైకి హూనులు దండెత్తి వచ్చారు. రాజధాని చంపాపురాన్ని పూర్తిగా ధ్వంసం చేశారట. కోటంతా రక్తపు మడుగులే. 15 ఏళ్లు పైబడిన మగవారి తలలు నరికేశారు. కోశాగారం తలుపులు పగులగొట్టి ఖజానానంతా దోచుకున్నారు... అని విచార సంఘటనలు వివరిస్తున్నారు...

సైన్యాధ్యక్షుడు మన పదివేల గజాలను యుద్ధరంగంలో నిలిపాడు. శత్రువులు అతితెలివితో బొమ్మ సింహాలను ముందు వరుసలో నిలిపి బాణసంచా పేల్చారట. దీంతో గజాలు భయభ్రాంతులు చెంది అటూ ఇటూ పరిగెత్తాయి. మన సైనికులు వాటి పాదాలకింద నలిగిపోయారు. దీంతో శత్రువులకు కోటలోకి ప్రవేశించడం సులభమైంది."

భద్ర ముఖం కోపంతో మండిపోతోంది. 'మహారాజు క్షేమమేనా' అని ఆత్రంగా ప్రశ్నించాడు.

'సైన్యాధ్యక్షుడు కొంత మంది సైనికుల సమేతంగా మహారాజును సురక్షిత ప్రాంతానికి తరలించారు' అని చెప్పడంతో కాంత నెమ్మదిపడ్డాడు.

'శంబువర్మ మహారాజు కంటే ముందు పరిపాలించిన పద్దెనిమిది మహారాజుల బంగారు వస్తువులను, వేల బౌద్ధ గ్రంథాలను, భారతీయ సంగీత సాధనాలను హూనులు దోచుకుని వెళ్లార'ని వేగులు చెప్పగానే 'మన వారసత్వ సంపదనూ వదలేదన్నమాట.. హూనులతో యుద్ధం ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. దీనికి తుది లేదు. ఇందులో ధన, ప్రాణ నష్టం సంభవిస్తునే ఉంటుంది' అంటూ నిట్టూర్చాడు.

ఇద్దరమూ వెంటనే చంపా నగరానికి అశ్వాలపై బయల్దేరాం. భద్ర ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. 'శత్రు దాడుల్లో ధ్వంసమైన నగరాల్ని పునరుద్ధరించడం, సుభిక్షంగా మార్చుకోవడం.. మళ్లీ శత్రువుల దండయాత్రలు, ఖజానాను కొల్లకొట్టడం.. వందల ఏళ్లుగా ఇదే జరుగుతోంది చంపా రాజ్యంలో...' అని ఆవేదన చెందాడు.

అతడు అశ్వచోదనంలో ఆరితేరిన వాడు. అతడి గుర్రం మేఘాల్లో దూసుకెళ్లినంత వేగంగా వెళుతోంది. నేనూ అంతే వేగంగా నడపడానికి ప్రయత్నించి పెద్ద బండరాయికి తగిలి కింద పడిపోయాను. నా గుర్రం ముందుకు సాగుతూనే ఉంది. భద్ర ఇదేమీ చూడకుండా వెళ్లిపోతూనే ఉన్నాడు. నా కళ్లు బైర్లు కమ్మాయి.

★



ఎవరో ముఖమ్మీద నీళ్ళు చల్లారు... మెలుకువ వచ్చింది. విదేశీ టూరిస్టుల్లా ఉన్నారు. అందులో ఓ వ్యక్తి దెబ్బలు ఎక్కడైనా తగిలాయా అని చేతులూ కాళ్ళూ చూస్తున్నాడు. పెద్దగా ఏం కాలేదని అన్నాడు. అయినా మనతో తీసుకెళ్దామని మిగతా వారన్నారు. అతడు నా భుజం పట్టుకుని పైకి లేపాడు. అలాగే చేత్తో సాయం చేస్తూ బస్సు ఎక్కించాడు. తినడానికి సాండ్విచ్ ఇచ్చాడు. అది ఏసీ బస్సు, పాతిక మంది టూరిస్టులు ఉన్నారు. వివిధ దేశాలకు చెందిన వారిగా వాళ్ళను చూడగానే అర్థం అవుతోంది. అందరూ జంటలు జంటలుగా ఉన్నారు. సాండ్విచ్ తింటూ కిటికీలోంచి బయటకు చూస్తున్నా.. పచ్చని పొలాలు, తలపై గుండ్రటి టోపీలు పెట్టుకొని పొలం పనులు చేస్తున్నారు రైతులు.

'మనం ఇప్పుడు 'మిషన్ వరల్డ్ హెరిటేజ్ శాంక్చువరీ' ని సమీపించాం.

క్రీస్తు శకం 2 వ శతాబ్ది నుంచి 19 వ శతాబ్ది వరకూ మధ్య వియత్నాం అంతా చంపారాజ్యంగా ఉండేది. ఆగ్నేయాసియాలో హిందూ వలస రాజ్యాలలో చంపా ఒకటి. అత్యంత ఘన చరిత్ర కలిగిన రాజ్యం ఇది. ఇక్కడి ప్రజలను చామ్‌లుగా పిలుస్తారు. మిసన్ ప్రవేశ ద్వారం ఇదే. ఇక్కడ నుంచి ఎకో ఫ్రెండ్లీ వెహికిల్స్ లో హెరిటేజ్ సైట్ దగ్గరికి వెళ్లాలి. అందరూ కిందకి దిగండి..' అంటూ గైడ్ మొదట దిగాడు.

మయన్మార్తో మొదలై థాయిలాండ్, కంబోడియాల తరవాత ఇప్పుడు వియత్నాంకి వచ్చానన్నమాట. తొలినాళ్లలో ఈ రాజ్యాలన్నిటినీ మన తెలుగు వాళ్లే పరిపాలించారా? నేడు మనకు అస్సలు సంబంధం లేని నేలల్లా ఎందుకుండి పోయాయి. ఎక్కడో ఏదో లోపం... ఇలా ఆలోచిస్తూ బస్సు దిగాను.

'నువ్వూ మాతో రా'... అంటూ గైడ్ నన్ను ఆహ్వానించాడు. తను అందరి కంటే ముందు నడుస్తున్నాడు. అతడు వేసుకున్న టీ షర్టు వెనక భాగంలో ఓ పడవ బొమ్మ ఉంది. అది అచ్చం భద్ర





పడవ లాగానే ఉంది. అందరమూ అతడిని అనుసరించి వెళ్తున్నాం. 'చామ్ మ్యూజియం' అన్న బోర్డు దగ్గర ఆగిపోయి...

'చంపా రాజ్యం గురించి ముఖ్యమైన విషయాలు తెలుసుకుని ముందుకు వెళదాం' అన్నాడు.

అది ఓ మోస్తరు మ్యూజియం. మిసన్ చంపారాజ్య సాంస్కృతిక కేంద్రం. క్రీస్తు శకం 4 వ శతాబ్దిలో నిర్మించిన భద్రేశ్వర ఆలయం చుట్టూ అనేక కట్టడాలను నిర్మించారట. అమరావతి, ఇంద్రపుర, సింహపుర, వీరాపుర వీరి రాజధాని నగరాలుగా ఉండేవి. ఇప్పుడు ఆ నగరాలకు వియత్నమీస్ పేర్లు పెట్టారట. అవన్నీ చూస్తూ ముందుకు వెళుతోన్న నాకు చంపారాజ్య గొప్ప రాజుల పేర్లున్న పట్టిక కన్పించింది. అందులో మొదట భద్రవర్మ, ఆ తరవాత ఇంద్రవర్మ అని ఉంది.

అయితే పట్టాభిషేకానికి ముందు అతడి పేరు భూములవార లక్ష్మీంద్ర గ్రామస్వామి. ఆయన వేయించిన ఓ శిలా శాసనంలో ఈ పేరు బయటపడింది. 'ల', 'వార' పత్యయాలు ఉన్న అచ్చు తెలుగు పేరు. క్రీస్తు శకం ఏడో శతాబ్దిలో చంపాను పాలించిన రాజు శంభువర్మ. ఆ పేరు చూడగానే విస్మయం కలిగింది.

భద్రతో కలిసి నేను ఆనాడు చంపారాజ్యంలో పర్యటించిన కాలం ఏడో శతాబ్దమని దీన్ని బట్టి అర్థం అయింది. అలాగే చంపా లిపికి మూలం దక్షిణ భారతదేశానికి చెందిన పల్లవ లిపి అని మరో పట్టికలో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ నేను సందర్శించిన దేశాల మ్యూజియాల ఆధారంగా మయన్మార్లో మన్ లిపి, థాయిలాండ్ లో లాన్నా లిపి, వియత్నాంలో చంపాలిపికి మూలం పల్లవ గ్రంథి లిపే కావడం విశేషం. ఎనిమిదో శతాబ్దికి ముందున్న చంపా శిల్పంపై అమరావతి శిల్ప శైలి ప్రభావం పూర్తిగా ఉందని అక్కడ పేర్కొన్నారు. తెలుగు నేలతో ఈ రాజ్యాలకు ఉన్న అనుబంధ సంబంధాల గురించి పరిశోధనలు జరిగాయా? అన్న సందిగ్ధంలో ఉండిపోయా. ఏదేమైనా ఇవన్నీ సాహసానికి మరో పేరైన మన తాతముత్తాతలు నడయాడిన ప్రదేశాలు... వాళ్ల నిర్మించిన కట్టడాలు... ఈ ఆలోచన రాగానే మనసెంతో ఉప్పొంగింది.

పక్కనే ఉన్న కౌంటర్లో టికెట్ తీసుకుని గైడ్ సిద్ధంగా ఉన్నాడు. మిసన్ సిటీకి బ్యాటరీ కారులో బయల్దేరాం. అపురూప కట్టడాలు కాలుష్య బారిన పడకుండా అక్కడి ప్రభుత్వం తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలివి. చుట్టూ పచ్చటి కొండలు.. ఆ కొండల మీది నుంచి జాలువారుతోన్న సెలయేర్లు, పెద్ద పెద్ద వటవృక్షాల మధ్య ఆ ప్రదేశం ఎంతో రమణీయంగా ఉంది.

'ఒకప్పుడు ఇక్కడ 70 దాకా పురాతత్వ నిర్మాణాలు ఉండేవి. కానీ అమెరికా - వియత్నాం యుద్ధంలో అమెరికా వేసిన కార్పెట్ బాంబుల దాడిలో చాలా నిర్మాణాలు ధ్వంసం అయ్యాయి. ప్రస్తుతం రెండు కిలోమీటర్ల పరిధిలో 30 పురాతత్వ ప్రదేశాలు ఉన్నాయి.' అని గైడ్ వివరిస్తున్నాడు.

ఇవన్నీ ఇటుకలతో నిర్మించిన కట్టడాలు. సూర్యుడి వెలుగుకి వింతైన శోభతో మెరుస్తున్నాయి. ఓ వరుస క్రమంలో వాటిని సందర్శించేలా కాలి బాటలు వేశారు.

ప్రతి మాన్యుమెంట్ కి ఇ1, ఇ2 ఇలా నెంబర్లు ఇచ్చారు. ఇక్కడ ఆలయ శిథిలాలు ఎన్నో ఉన్నాయి. కేవలం బయటకు మాత్రమే. ఆకారానికి అన్నట్టుగా ఉన్నాయి. లోపలి శిల్పాలను వెలికి తీసి వివిధ మ్యూజియాలలో భద్రపరచారట. ఎండకూ, వానకూ మరింత క్షయానికి గురికాకుండా ఉండేందుకు కొన్నిటిపై రేకుల షెడ్డులను ఏర్పాటుచేశారు. తమ వారసత్వ సంపదలను పరిరక్షించుకోవడానికి వియత్నాం ప్రభుత్వం గట్టి ప్రయత్నాలే చేస్తోంది.

మిసన్ లోని ఏ1 ఆలయం దగ్గర ఆగిపోయాను. అది భద్రేశ్వర స్వామి ఆలయం. అంటే నేను, భద్ర కలిసి సందర్శించుకున్నది. ఆనాడు ఎంతో వైభవోపేతంగా ఉన్నది నేడు వెలవెలబోతోంది. గోపురం ఛిద్రమైంది, లోపల శివలింగం లేదు. కొన్నేళ్లయితే ఇది కూడా ఉండదు. ఈ ఇటుకలు నేలలో కలిసి కరిగి పోతాయి.

అశ్వశాలలు, గజశాలలు పేరుకైనా లేవు. ఆచార్యుడి కుటీరం ఎక్కడ... సెలయేటి తీరమెక్కడా అని చూస్తుంటే అల్లంత దూరంలో రెండడుగుల వెడల్పు ఉన్న ఓ పిల్లయేరు కన్పించింది. చెప్పలేనంత వేదనతో ఆ పిల్లయేరు నీటిని తనివి తీరా తాకాలని ముందుకు వెళ్లాను. దగ్గరగా కన్పిస్తోంది కానీ అది దూరంగానే ఉంది.

గత వైభవాన్ని గుర్తుచేసుకుంటూ భారంగా నడుస్తున్నానో లేక నా అడుగులు తడబడుతున్నాయో తెలియదు. చుట్టూ కంచెలున్నా పట్టించుకోకుండా పిల్లయేటిలో దిగాను. ఆ చల్లని నీరు నా మనసుకు స్వాంతన చేకూర్చినట్టయింది. కిందకి వంగి నీరు తాగదామని చూశాను. కాస్త దూరంలో స్ఫటిక మంత స్వచ్ఛంగా మెరుస్తోన్న నీళ్లు కన్పించాయి. అలాగే అడుగులేస్తూ ముందుకు వెళ్లాను. దోసిట్లో నీటిని తీసుకుని తాగబోతున్నాను.. వెనుక నించి ఏవో అరుపులు విన్పిస్తున్నాయి...

సెక్యూరిటీ గార్డ్స్ వాగులోంచి బయటకి రమ్మని పిలుస్తున్నారు. ఆ పక్కన చూస్తే డేంజర్ బోర్డు ఉంది. ఆనాడు అమెరికా కురిపించిన బాంబుల వర్షంలో కొన్నిటిని ఇంకా గుర్తించలేదని, ఇది అలాంటి ప్రాంతమని రాసి ఉంది. నేను వేగంగా అడుగులేస్తూ పైకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నా కానీ... నా అడుగు ఏదో ఇనుప వస్తువుపై పడింది. ఏదో పేలింది.. పెద్ద శబ్దం విన్పించింది. ఒక్కసారిగా గాల్లోకి ఎగిరాను.. భద్రేశ్వరస్వామి ఆలయ శిఖరం అంత ఎత్తుకు గాల్లో ఎగిరాను...

అంతే....భూకంపం వచ్చినట్టుగా అనిపించింది.

(తరువాయి వచ్చే సంచికలో...)

డా॥ సామల రమేష్ బాబు

మాతృభాషను పట్టించుకోని తెలుగు రాష్ట్రాలు

ప్రపంచంలో అసమానతలు ఆర్థికంగానే గాక, ప్రజాజీవనానికి సంబంధించిన అన్ని రంగాల్లోనూ ప్రజల మధ్య, జాతుల మధ్య దూరాన్ని పెంచుతున్నాయి. ప్రపంచీకరణ విధానాల ఫలితంగా ఏర్పడుతున్న పరిణామాలు ఇవి. భాషా సంస్కృతులకు ఏర్పడుతున్న సవాళ్లను అధిగమించడానికి భాషాజాతులలో స్వాభిమానాన్ని పెంపొం దించడానికి, వారిలో అవగాహనను, సయోధ్యను పెంచడానికి, తమ జాతుల సర్వతోముఖాభివృద్ధికి మానవ వనరులను సంసిద్ధం చేయ డానికి ఈ 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' స్ఫూర్తినిస్తోంది. 2020 సంవత్సరానికి యునెస్కో ఈ సందర్భంగా ఇచ్చిన ఆలోచన, సందేశం ఇదే. సుమారు 18 కోట్ల మంది తెలుగువారు ప్రపంచ మంతటా విస్తరించి వున్నారని అంచనా. ఇందులో సగం మంది ఈ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఉన్నారు. ఈ సందర్భంగా మనం ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ఆలోచిద్దాం.

కొత్త బడ్జెట్టును సమర్పిస్తూ లోకసభలో దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, త్వరలో నూతన విద్యా విధానాన్ని తెస్తామని ప్రకటించారు. ముసాయిదా విద్యావిధానం – ప్రకారం ఎనిమిదో తరగతి వరకు మాతృభాషా మాధ్యమంలో చదువులు చెప్పాలి. ఆ తర్వాత 12వ తరగతి వరకు కూడా మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయవచ్చునని, అయితే విజ్ఞాన శాస్త్రాల విషయంలో సాంకేతిక పదాలను సమాంతరంగా ఆంగ్లభాషలో 9వ తరగతి నుండి పరిచయం చెయ్యాలని ఈ ముసాయిదాను సమర్పించిన కస్తూరి రంగన్ కమిటీ చెప్పింది. ఈ విధంగా చేస్తే ఉన్నత విద్యలో ఆంగ్ల మాధ్యమంలోకి వెళ్లవలసి వచ్చినప్పుడు విద్యార్థికి ఎటువంటి ఇబ్బంది కలుగదని ఆ నివేదికలో స్పష్టంగా ప్రకటించారు. కానీ ఇప్పుడు జరుగుతున్నదేమిటి? ఆంగ్ల మాధ్యమం లోనే పాఠశాలలో అడుగు పెట్టి తనది కాని భాషలో పసితనం నుండీ విద్యాబోధన జరగడం వల్ల బతుకుకీ విద్యకూ సంబంధం లేని స్థితిలోకి పిల్లలను తోసివేస్తున్నాం.

ఈ విధ్వంసం సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడే పాదుకొని, ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ, కొనసాగుతున్నది. ఆంధ్రప్రదేశ్ లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.


మొన్న ఎన్నికల ముందు వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు సమైక్య రాష్ట్రానికి ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంగ్ల మోజును ప్రజల్లో పెంచుతూ అనుసరించిన అశాస్త్రీయ విధానాలనే నిన్నటివరకూ కొనసాగించారు. ఆ తర్వాత జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత పాఠశాల విద్యను పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతూ, తెలుగు మాధ్యమానికి పూర్తిగా తలుపులు మూసేశారు. చంద్రబాబు లక్ష్యమూ ఇదే అయిన ప్పటికీ, తెలుగు మాధ్యమాన్ని నిషేధించే సాహసం చేయలేక, దాన్ని క్రమంగా సమాధి చేసే విధానాన్ని అనుసరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే – పెద్దాయనది వెన్నుపోటు కాగా ఈ యువనేత ఎదురుపోటు లేదా ముందుపోటు అనుకోవచ్చు. పైగా ఇద్దరూ చెప్పే మాట ఒక్కటే. 'తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తాం' అని. నిజానికి చంద్రబాబు హయాం లోనే 2003 లోనే జి.ఒ నెం 86ను ఇచ్చి ఆయన చేసింది అదే పని. తెలుగును ఒక భాషగా తప్పనిసరి చేసినా, ఆయన హయాంలో ఎన్నడూ ఆ విషయంపై శ్రద్ధ వహించనే లేదు. ఇప్పుడీ ముఖ్యమంత్రి చెప్తున్నదీ ఇదే. ఇప్పుడు జరుగబోయేదీ అదే. ఇందుకు బాధ్యత చంద్రబాబుదీ, ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులదీ అవుతుంది.

తెలంగాణ విషయానికి వస్తే కెసిఆర్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన వెంటనే చేసిన పని ఆంగ్ల మాధ్యమాన్ని పూర్తి స్థాయిలో పాఠశాల విద్యలో ప్రవేశపెట్టడం, తెలంగాణలో జరిగిన ఉద్యమాల ఫలితంగా ప్రజల్లో పెంపొందిన స్వాభిమానం, భాషా సంస్కృతుల పట్ల – అవ్యాజమైన అంకిత భావాలను ఈయన సమృద్ధిగా వినియోగించుకున్నారు. కానీ, తెలుగు మాధ్యమాన్ని ప్రోత్సహించే చర్యలను తలపెట్టనే లేదు.

ఈ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాలన – తెలుగులో జరగడం లేదు. కెసిఆర్ తెలుగులో ఎం.ఎ. లిటరేచర్ చేశారని వింటున్నాం . నిజానికి ఆయనకు తెలుగు పైన బాగా పట్టుంది. కాని, ముఖ్యమంత్రిగా తెలుగు కోసం ఆయన ఏం చేశారో ఆలోచిస్తే ఎంతో నిరాశా, విచారమూ కలుగుతుంది. మొత్తమ్మీద ఇద్దరు ముఖ్యమంత్రులు చేస్తున్నదీ ఒకటే. ప్రజల్లో వున్న ఆశల్ని ఆధారం చేసుకొని ఓట్లు సంపాదించుకొనేందుకు స్వార్థ రాజకీయాలను అవలంబిస్తున్నారు తప్ప, ప్రజాహితాన్ని గురించి ఈ విషయంలో ఏమీ పట్టించుకోవడం లేదు. అన్నీ – లోతుగా తెలిసిన తెలంగాణ ముఖ్యమంత్రీ, తెలుగును మాట్లాడడం తప్ప దానిపై ఎటువంటి పట్టూ ప్రేమా లేని, ఇంగ్లీషంటే అవ్యాజ ప్రేమ ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రీ– ఇద్దరూ తెలుగు జాతికి – ద్రోహం చేస్తున్నారు. ఇవే విధానాలను – కొనసాగిస్తే–ఇవి తెలుగు రాష్ట్రాలుగా మిగలవు.

అన్ని భాషలూ గొప్పవే. వాటిని ఉపయోగించడంతోనే అవి వికసిస్తాయి. అన్ని రంగాల్లో వినియోగంలోకి తెచ్చుకొంటూ సమకాలీన అవసరాలను తీర్చగల భాషగా వినియోగించగలిగితే ఏ భాషైనా పోటాపోటీగా ఎదుగుతుంది. తెలుగును మాట్లాడుకొనేవారు వివిధ రాష్ట్రాల్లో, దేశాల్లో ఉన్న వారందరినీ కలుపుకొని 18 కోట్లకు పైగా ఉన్నా, తమ మాతృభాష వినియోగంలో ముందుకు సాగకపోతే క్రమంగా తమ మనుగడ నామమాత్రమైపోయే పరిస్థితి వుంది. విద్యలో, పరిపాలనలో, అన్ని విధాల వినియోగంలో మన భాషను వృద్ధి చెందించుకోవాలి.


సాంకేతికతను వినియోగించుకోవడం ఇప్పుడన్ని భాషలకూ



తప్పనిసరి. ఈ అంశంలో మనం కొంత ముందుకే సాగుతున్నాం. అయినా ఇందుకు కూడా ప్రతిబంధకంగా ఉన్నవి మన ప్రభుత్వాలే. పరిపాలనను ఈ సాంకేతికతను ఉపయోగించుకొని పూర్తిగా తెలుగులోకి తేవడానికి ప్రభుత్వం తలపెడితే కొద్ది నెలల వ్యవధిలో అందుకు తగ్గట్టు అభివృద్ధి చేయగల నిపుణులు మనకు ఉన్నారు. అయితే ప్రభుత్వాలకు రాజకీయ సంకల్పమే కొరవడింది...

భారత ప్రభుత్వం కొత్త విద్యావిధానంతో ముందుకు రాబోతున్నది. అందులో మాతృభాషలో బోధనకు పెద్దపీట వేస్తున్నది. అయితే మన రాజ్యాంగంలో ప్రజాభాష విషయంలో విద్య, పాలనా రంగాల్లో మార్గదర్శకాలు వున్నాయి తప్ప తప్పనిసరి చేస్తూ ఏమీ చెప్పలేదనే అభిప్రాయం బలంగా వుంది. దాంతోపాటు విద్యారంగం అనే అంశం అటు కేంద్రం జాబితా గాక, ఇటు రాష్ట్రాల జాబితా గాక, ఉమ్మడి జాబితాలో వుంది. కనుక రాష్ట్రాలను కూడా కలుపుకొంటూ వారి ఆమోదంతో కేంద్రం ఈ విషయంలో ముందుకు సాగవలసిన అవసరం ఉన్నది. ఈ దశలో ఫిబ్రవరి 21న 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని (ఎల్లనాడుల అమ్మ నుడుల పండుగ) మనం జరుపుకుంటున్నాం. ఈ రోజునే 2003లో 'తెలుగు భాషోద్యమ సమాఖ్య'ను స్థాపించుకొన్నాం. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ పండుగను ప్రభుత్వ పాఠశాలల్లోనూ, జిల్లా కార్యాలయాల్లోనూ జరుపు కొంటున్న సంప్రదాయం వుంది. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఈ విషయంలో ప్రజలంతా -ముఖ్యంగా భాషోద్యమకారులు ఉద్యమించవలసివుంది...

('ప్రజాశక్తి' దినపత్రిక 21-2-2020 నుండి)



"భాషా పెత్తనం స్వరాజ్యం కాబోదు
మొదటి ప్రాధాన్యత ఎల్లవేళలా మాతృభాషదే
ఆ తర్వాతనే హిందీ భాష
నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం"
"మాతృభాషను పణంగా పెట్టి ఆంగ్లభాషను నేర్చుకోవలసివస్తే
అసలు ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం ఏ దేశానికీ లేదు"

– మహాత్మాగాంధీ

నంద్యాల నారాయణరెడ్డి
9360514800

సాతంత్రకాల సదువులు 10

బుద్దులు చెప్పిన బొజ్జతాత :

ఆంధ్రం [redacted] పోట్లాడుతుంటే [redacted] గురించి కదుపుర[redacted]స్తిని. పదకొండో తరగతి (ఎస్.ఎస్.ఎల్.సి) లో మర్నోమి (మహర్నవమి=దసరా) బిడువులకు ఊరికి వచ్చిండాను. మా తట్టు 'పెద్ద' ను 'గౌడు' అంటారు. ఊరిపెద్దను ఊరిగౌడు అనీ కులంపెద్దను కులంగౌడు అనీ ఇంటిపెద్దను ఇంటిగౌడు అనీ పిలుస్తారు. మావూర్లో బొజ్జగౌడు అని ఒక తాత ఉండాడు. ఆయన అసలు పేరు మునిరెడ్డి. పెద్ద కడుపు ఉండడం వలన బొజ్జగౌడు అనే అడ్డపేరు వచ్చేసింది. 'మునిరెడ్డిగౌడు ఉండాడా' అంటే 'ఎవురప్పా ఆయన' అని రవంత తడుమాడుతారు. 'అదేనప్పో బొజ్జగౌడు' అంటే చాలు, వెంటనే గుర్తుపట్టేస్తారు. ఆ తాత దగ్గరకు పోతే ఎప్పుడెప్పుడి సంగతులో వివరంగా చెప్తా ఉంటాడు. బొజ్జతాత మనుమడైన టీనారెడ్డిగాడు (టి.నారాయణరెడ్డి) నాకు జతగాడే. ఒకనాడు మాపుసరి నా జగతాని కోసం వాళ్లింటికి పోతిని. వాళ్లింటి జగిలి(అరుగు) మీద బొజ్జతాత కూకోనుండాడు.

"ఏమిరా నంద్యాలగా, రా కూకో, మీ అవ్వ (నాయనమ్మ) ఎట్లుందిరా?" అని పలకరించినాడు.

"మా అవ్వకేమి, ఏమో తిక్కలు తిక్కలుగా ఎప్పుడూ ఏదో మాట్లాడుకొంటా ఉంటుంది. ఇంకేమి పనుంది మా అవ్వకి" అని బదులిస్తిని.

"అట్లనద్దురా, రా ఇట్లొచ్చి కూకో, మీ అవ్వ కతను చెప్తాను" అంటా నన్ను దగ్గర కూకో బెట్టుకొని మా అవ్వ ఎల్లమ్మ కతను ఎత్తుకొన్నాడు.

"నంద్యాల ఎల్లమ్మంటే సామాన్యురాలు కాదు, ఆది పరాశక్తి. ఏబై యేండ్లకు ముందు మనూర్లో ఇన్నిండ్లు లేవు. రెడ్డోళ్లవి 25, కాపోళ్లవి 15, బలిజోళ్లవి 5, ముద్దలోళ్లవి 10, మగ్గమోళ్లవి 5, ఇంతే ఉండింది..."

"రవంత ఉండు తాతా" అంటా తాత మాటకు అడ్డం పడితిని. ఆంధ్రోద్యమం మాటల్ని విని పెరిగినవాడిని కదా, అందుకనే లెక్కలు కట్టేకి మొదలుపెడితిని.

"అంటే రెడ్డోళ్లవీ బలిజోళ్లవీ కలిపి 30 ఇండ్లు తెలుగోళ్లు, కాపోళ్లవీ మగ్గమోళ్లవీ కలిపి 20 ఇండ్లు కన్నడమోళ్లు, పదిండ్లు అరవమోళ్లు ఉండారు మనూర్లో" అంటిని.

రేయ్ గుగ్గూ (మూర్ఖుడా) అట్ల కాదురా లెక్కేసేది. ఇంట్లో ఎవరేమన్నా మాట్లాడుకోని, బయటికి వచ్చినపుడు ఏం మాట్లాడుతుండారనేది చూడాల. మనూర్లో వీదిబాస తెలుగే కదా, మనూరు మాత్రమే కాదు, మన హోసూరు తావున అందరిదీ అంతే. అది సరే, మీ అవ్వకతను విను. మీ ముత్తాతపేరు నంద్యాలరెడ్డి. ఆయనకి ముగ్గురు కొడుకులు. ఓబులరెడ్డి, కదిరప్పరెడ్డి, బాలరెడ్డి. పెద్ద కొడుకైన ఓబులరెడ్డే మీ తాత. ఆయన పెండ్లామే ఇపుడు మీ ఇంట్లో ఉండే మీ అవ్వ ఎల్లమ్మ. నీకు తెలుసు కదా, వాళ్లకు ముగ్గురు కొడుకులు, పెద్దోడు మీ అబ్బ నంద్యాలరెడ్డి, అనెంక మీ చినబ్బలు మునిసామిరెడ్డి, మునిరెడ్డి.

మనూర్లో మీదొకటే పెడకంటి రెడ్ల కుటుంబము. మిగిలిన రైతులిండ్లన్నీ నెరాటి రెడ్లవీ మొరసు కాపోళ్లవీ. ఏలనో తెలీదు, ఎపుడు ఏమాయెనో తెలీదు. ఊర్లో ఉండే రైతు కుటుంబాలంతా మీ కుటుంబము పైన కంటు పెట్టుకొనేసిరి. చేన్ల తావునా, ఆవుల్ని మేపే బీళ్ల తావునా, ఇండ్ల తావునా, వీదుల్లోనూ...ఇట్ల అన్ని తావులా అందురూ మీ ఇంటోళ్లతో గలాట్లు చేసేకి సురువు చేసిరి. రెడ్డిగౌడూ కాపుగౌడూ కలిసి మీ కుటుంబాన్ని ఈ ఊర్లోనింకా తరిమేయాలని కంకణం కట్టుకొనేసిరి. వాళ్లతో పడలేక మీ చినతాతలు ఇద్దరూ ఊరు విడిచి పోయ్యేసిరి. ఒకరు చిత్తనపల్లికీ ఇంకొకరు ఉలియాళంకూ వలస పోయిరి. ఇంక మిగిలింది మీ తాత ఓబులరెడ్డి కుటుంబం ఒక్కటే. బలం తగ్గిపోయింది కదా అని ఊరిగౌళ్లు అక్కడక్కడా మీ చేనుల్ని ఆక్రమించుకొనేకి సురువుచేసిరి.

కొన్నేండ్లు పోరాడి ఓబులరెడ్డి తీరిపోయె. అపుడు పెద్ద కొడుకైన మీ అబ్బకు పదేండ్లో పన్నెండేండ్లో ఉండిండచ్చు. మీ చిన్నబ్బలు ఇంకా చిన్న చిన్నోళ్లు. ముగ్గురు లేత బిడ్డల్ని పెట్టుకొని కూడా మీ అవ్వ ఎల్లమ్మ ఊరిడిచి పోలేదు. చావైనా బతుకైనా ఇక్కడ్నే అని నిలబడింది. బీదా సాదలకూ కూలోళ్లకునాలోళ్లకూ కడుపునిండా పెట్టి వాళ్లను చేరదీసింది. నోరుమంచితో పేదరైతు కుటుంబాలను తన పక్కకు తిప్పుకొనింది. గౌళ్లు ఆక్రమించుకొన్న చేనుల్ని పోరాడి స్వాదీనము చేసుకొనింది. కొడుకుల్ని పనిమంతులుగా దిద్దుకొనింది. ఊర్లో ఒకరి తంటకు పొయ్యేది లేదు, మీ తంటకు ఇంకెవరైనా వస్తే ఆ ఎల్లమ్మతల్లి మాదిరిగా ఉగ్రరూపును ఎత్తేది. పెద్దోళ్లు ఊరికే చెప్పింటారా, ఎంతో అనుబోగముతో కదా చెప్పింటారు సామెతల్ని. పెడకంటోళ్లు పెళుసు, పెడకంటి పెద్రం, పెడకంటోళ్లకు పేడబెల్లం, పెడకంటోడు అలిగితే పెడకంటోడు (శివుడు) అలిగినట్లే...ఇట్లా సామెతల్ని నిజమే అని నిరూపించుకొనింది మీ అవ్వ ఎల్లమ్మ. అనెంక అనెంక పరిస్తితులు మారిపోయె. ఇపుడు ఆ గౌళ్ల కుటుంబాలూ ఊర్లో అందరూ మీ కుటుంబమంటే ఎంత అక్కరగా ఉంటారో నీకు తెలుసు కదా. కోపమొచ్చినపుడు ఎంతటోళ్లనైనా లెక్కచేయకుండా



పోరాడింది, కోపం తగ్గినంక అందరికీ తలలో నాలుకయింది. ఇపుడు వయసు పెద్దదయిపోయె కదా, దానికే అట్ల ఏమేమో మాట్లాడుకొంటా ఉంటుంది. ఇదిరా మీ అవ్వ కత" అని ముగించినాడు బొజ్జతాత. తిక్కలు తిక్కలుగా ఉండే మా ఎల్లవ్వ ఇంత గొప్పదా అనిపించింది నాకు.

''అది సరేకాని తాతా, మమ్మల్ని ఏల ఊర్లో వాళ్లంతా నంద్యాలోళ్లు అనేది?" అని బొజ్జతాతని అడిగితిని. ఇది నాకు చానా ఏండ్లుగా ఉండే సందేహము.

''నారాయణా, మన తావునుండే తెలుగోళ్లంతా తెలుసుకోవలసిందే అడిగినావురా. చెప్తాను విను. తెలుగోళ్లకి బుడకట్టూ (ఇంటిపేరు) గోత్రమూ రెండూ ఉంటాయి. కన్నడమోళ్లకి బుడకట్టు ఉండదు, ఒక గోత్రం మాత్రమే ఉంటాది. అరవమోళ్లకి ఏదీ ఉండదు. గోత్రం ఏమిటికంటే, ఒక గోత్రం వాళ్లంతా ఒక కాలంలో ఒకే కుటుంబం వాళ్లు అని తెలుసుకొనేదానికి. ఒక తల్లికి పుట్టిన ఆడబిడ్డా మగచిన్నోడూ అక్కా తమ్ముళ్లో అన్నా చెల్లెళ్లో అయితారు కదా. అట్లనే ఒక గోత్రం వాళ్లంతా కూడా తోబుట్టుల వరుస అయితారు. గోత్రమనేది లేకపోతే ఏమయితుందంటే, అన్నా చెల్లెళ్లే పెండ్లిళ్లు చేసుకొనే ప్రమాదం ఉంటుంది. మీ తాతకు సొంత తమ్ముడు చిత్తనపల్లికి వలసపోయె, ఆయన కొడుకులో మనమళ్లో చిత్తనపల్లిని విడిచి ఇంకెక్కడికో దూరంగా వలసపోయిరి అనుకో. మీ కుటుంబానికీ వాళ్ల కుటుంబానికీ రాకపోకలే లేవు అనుకో. రెండు మూడు తరాలు అయినంక వాళ్లింట్లో బిడ్డకి మీ ఇంట్లో చిన్నోనికీ పెండ్లి చేయాలనుకొంటే ముందు గోత్రం అడుగుతారు. రెండు కుటుంబాలదీ ఒకే గోత్రమైతే చేసుకోరు. గోత్రమనేదే లేదనుకో, అన్నా చెల్లెళ్లు పెండ్లి చేసుకొనేస్తారు. తెలుగోళ్లకీ కన్నడమోళ్లకీ గోత్రం ఉంటుంది కాబట్టి పరవాలేదు. అరవమోళ్లకి ఉండదు కాబట్టి, రెండు మూడు తరాలయినంక అన్నా చెల్లెళ్లు కూడా పెండ్లిచేసుకొనేస్తారు వాళ్లలో. అందుకే గోత్రం ఉండి తీరాల".

"మరి బుడకట్టు ఏమిటికి తాతా?" అడిగితిని.

"గోత్రము పెండ్లిళ్లపుడూ పూజలపుడూ మాత్రమే బయటకు చెప్పుకొంటాము. మిగతా సమయాల్లో వీళ్లు పలాన ఇంటివాళ్లు అని తెలుసుకొనేకి బుడకట్టును చెప్పుకొంటారు. తెలుగువాళ్లు చానా తావులకు విస్తరించిన వాళ్లు కాబట్టి వాళ్లవాళ్ల మూలాన్ని మరిచిపోకుండా ఉండేకి బుడకట్టును పెట్టుకొన్నారు. తెలుగువాళ్లట్లా కన్నడమోళ్లు విస్తరించలేదు కాబట్టి వాళ్లు బుడకట్లను ఏర్పాటు చేసుకోలేదు. మన హోసూరు తావులోని తెలుగువాళ్లము, ఏబై అరవై ఏండ్లుగా బుడకట్లను విడిచిపెట్టేస్తిమి. తెలుగు తెలుగు అని ఊరికే చెప్పుకొంటే ఎట్ల? తెలుగు తీరును నిలబెట్టుకోవాల కదా! మన పల్లెల్లో ఇపుడెవరూ బుడకట్లను చెప్పుకొనేదే లేదు. ఇంకొక తరం పోతే 'బుడకట్టంటే ఏమి' అని అడిగేవాళ్లు వస్తారు. మనూర్లో బుడకట్టును నిలబెట్టుకొనింది మీ కుటుంబం ఒకటే. నంద్యాల అనేది మీ బుడకట్టు, తెలిసిందా?" విడమరచి చెప్పినాడు.

"తెలుగోళ్లకంతా బుడకట్లు ఉంటాయా తాతా?'' తిరిగి అడిగితిని.

"ఉంటేనే తెలుగోళ్లని లెక్క. తెలియక మరిచిపోయి ఉండవచ్చు కానీ, బుడకట్టు లేకుండా ఉండదు. మా ఇంటోళ్లనే చూడు. వాళ్లకు తెలీదు, నేను చెప్పినా వినేదిలేదు. మా గోత్రం కురుమండ్ల, ఇది తెలుసు వాళ్లకు. మా బుడకట్టు 'ఇందుకూరు' అని తెలీదు. నాకు తెలిసినంతవరకు మన హోసూరు తావునుండే బుడకట్లను చెప్తాను, కావాలంటే రాసిపెట్టుకో..." అని బొజ్జతాత చెప్పేకి సురువు చేసినాడు,

నేను రాసుకొంటా ఉండాను.

“మీ పెడకంటివాళ్లవే మొదలు చెప్తాను. అంబటి, అన్నవరం, అరబండి, ఆమూరి, ఇల్లూరి, ఉండేల, ఎద్దుల, కదిరి, కర్నాటి, కసిరెడ్డి, కాకలూరి, కానాల, కేతు, గజ్జల, గోపిరెడ్డి, చంద్రగిరి, చెన్నం, తవ్వా, నంద్యాల, నరాల, పల్ల, పత్తి, పులి, పేరం, బొమ్ము, మార్తల, బావి, వెన్నపూస, వేమన, శీలం.

మా నెరాటి వాళ్లవి : అనుమనగుత్తి, అంబవరం, ఆమిరెడ్డి, ఇందుకూరు, ఉయ్యాల, ఒంటికొమ్మ, కందనూరి, కలమళ్ల, కొరివి, గాలివీడు, చక్రం, దేవర, పర్వతరెడ్డి, పాకాల, పొలకల, బుక్కపట్నం, బొమ్మనపాటి, మన్నెం, మిరియాల, ముక్కర, మొగిలి, మైలాపురం, రాచమల్లు, రెడ్డిచెర్ల, వసంతం, వేముల, సాకం, సిరిపురం.

కుడిపాటి రెడ్లవి, వీళ్లని మోటాటి రెడ్లు అని కూడా అంటారు: అండ్లూరు, అరిపిరెడ్డి, అన్నారెడ్డి, ఉదారం, కంచెర్ల, కందుల, కొమ్మద్ది, కోట్ల, గుత్తి, చెంద్ర, జీరెడ్డి, తోట, నాగారెడ్డి, పాలగిరి, పెద్దిరెడ్డి, బుక్కసముద్రం, బైరెడ్డి.

కొడితి రెడ్లవి, వీళ్లల్లో చిన్నగుంపు, పెద్దగుంపు అని రెండు తెగలు ఉండాయి : అలిదెన, ఆవుల, ఇరగంరెడ్డి, ఇసకపల్లె, ఉమ్మారెడ్డి, ఊటుకూరి, కటకం, కాటసాని, కోటకం, కోడూరి, గరిసె, చిట్టెపు, తుమ్మలూరి, దాసరి, నల్లపరెడ్డి, పావులూరి, పెల్లేటి, మల్లెల, ముత్తుకూరి, వెలుగోటి.

రెడ్డోళ్ల బుడకట్లు తెలిసినట్ల నాకు వేరేవాళ్లవి తెలీదు. నాకు తెలిసి మన తావున కమ్మోళ్ల బుడకట్లు : కోట, బేతి, రాయంగల, దొడ్ల, పరిటాల, పయ్యావుల, ఊరాకిలి. కోమటోళ్ల బుడకట్లు : శంకు, బెంగుళూరు, శ్రీరామ, అరూరు, రాజా, బళ్లాపురం, చెవ్వా, దొంతి, మదనపల్లి, భగవతుల, వక్కలగంటి. ఇట్ల తెలుగు మాట్లాడే అన్ని జాతులోళ్లకి బుడకట్లు ఉంటాయి. వాటిని కాపాడుకోవాల” అంటా పూర్తి చేసినాడు బొజ్జతాత. తెలుగు సమాచారం తెలుసుకోవాల్సింది చానా ఉందే అనిపించింది నాకు.

ముగిసిన చదువు :

మా ఇంట్లో మూడు గూళెద్దులు ఉండాయి. ఒకనాడు మాపుసరి మా అబ్బా మా తమ్ముడూ చెరొక గూళిని (గిత్తను) పట్టుకొని వచ్చి నీళ్లు తాపుతా ఉండారు. కుడితినీళ్ల తొట్ల తావున ఒక కరంటు కంబం ఉంది. మా అబ్బ పట్టుకోనుండే గూళెద్దు పైకి వెనకనింకా రెండో గూళెద్దు కొమ్ము విసిరింది. మొదటిది దిడీలున ముందుకు దూకింది. మా అబ్బను గుద్దింది. అంతే మా అబ్బ విసురుగా పొయి కరంటు కంబం మీద పడిపోయినాడు. మేమందరమూ గబగబ మా అబ్బ దగ్గరకు పోతిమి. అబ్బ తలను పట్టుకొని కూకొనేసిండాడు. మాటా పలుకూ లేదు. లేపి జగిలిమీద కూకోబెట్టి నీళ్లు తాగించి సపర్యలు చేసినంక, ఒక గంట సేపటికి సుదారించుకొన్నాడు. ఆసుపత్రికి పోదాం పదబ్బా అంటేనూ, వద్దులే ఇదేమి చేస్తుంది అనేసినాడు. ఇది జరిగిన రెండోనాడే నేను హోసూరికి పోయేస్తిని.

అనెంక ఎపుడో నడిచేకే కాకుండా అయినపుడు బెంగుళూరు ఆసుపత్రికి పోయిండాడు. అక్కడ పరిక్షలన్నీ చేసి, తలలో పెద్ద దెబ్బ తగిలేసిందనీ చానా ప్రమాదకర పరస్థితుల్లో ఉండాడనీ చెప్పిరంట. బెంగుళూరునింకా నేరుగా ఇంటికి పోకుండా, హోసూరులో ఉండే నా తావుకు వచ్చినాడు. నేను అప్పుడే స్కూలునింకా గురువుగారి ఇంటికి వచ్చిండాను. మా అబ్బను చూస్తుంటే ఏమో దిగులు దిగులుగా ఒక తరాగా కనపించినాడు.

“నారాయణా, ఇంటికి పెద్ద కొడుకువి, నువ్వే మనింటికి పెద్ద దిక్కుగా ఉండాల. పెద్దల్లో పిన్నల్లో నలుగురిలోనూ మన కుటుంబానికి మంచిపేరును తీసుకోని రావాలప్పా” నా చేతుల్ని పట్టుకోని చెప్పినాడు. అట్ల చెప్పేనపుడు అబ్బ కళ్లల్లో సన్నగా నీళ్లు తిరిగి చూడకుండా పొయ్యేసినాడు. కాలం కడుపులో ఇంకొక నెల దినాలు కరిగిపోయినాయి.

“నారాయణా, మీ అప్పకేమో ఒళ్లు బాగలేదంట. ఊరికి పొయ్యేసి రాపో. ఎట్లా రేపటినింకా నాలుగునాళ్లు బిడువులే కదా” అన్నారు గురువుగారు. మా ఊరికి పయనమైతిని. కవురు కవురు మబ్బు (మునిమాపు)లో ఇంటికి చేరుకొంటిని. మా అబ్బ జగిలిమీద పడుకోని ఉండాడు.

“అబ్బయ్యా హోసూరులో నిన్ను చూసేకి వచ్చినాడంట కదా. అపుడు ఇంటికి వచ్చేతపుడు ఒక వెర్రికుక్క వెంటపడెనంట. రాళ్లతో కొడతా దానిని తరమతా వస్తా ఉండాడంట. పేట దాటినంక ఆ కుక్క పైకి ఎగబడి వచ్చెనంట. దాని ముందరి కాళ్లను పట్టి ఎత్తి గిరగిర తిప్పి కొట్టి చంపేసిండాడు. అపుడు దాని గోర్లు దిగబడె. పట్టించుకోకుండా ఉండిపోయిండాడు. మొదులే ఎద్దుకుమ్మి తలకు వేటు పడిండె కదా, అనెంక వెర్రికుక్క కాటు, డాక్టర్లు కూడా మేలయ్యేది లేదు అని చెప్పేసిరి” పూడుకుపోతుండే గొంతుతో మా చిన్నబ్బ చెప్పినాడు.

ఆ పొద్దు డిసెంబరు 31, నడిరేయి సరిగ్గా 12 గంటలకు మా అబ్బ ఊపిరి విడిచేసినాడు. అది డిసెంబరు 31 కాదు, జనవరి ఒకటీ కాదు, 1958 కాదు 1959 కాదు, బుధవారమూ కాదు బేస్తవారమూ కాదు, ఇంట్లోనూ కాదు బయటానూ కాదు; నట్టనడుమ తేదీన, నట్టనడుమ జగిలిమీద కన్నుమూసినాడు మా అబ్బ.


కట్టుకొన్న ఇల్లాలూ, కడుపున పుట్టిన బిడ్డలమూ, తోడబుట్టిన తమ్ముళ్లూ అంతా గోళుగోళున ఏడస్తా ఉంటే, కన్నతల్లయిన మా ఎల్లవ్వ మాత్రము ఏడవనే లేదు. “పొయ్యేసినాడా తిక్కల నా కొడుకు, ముందుగా పొయి అమ్మకు తావును సుద్దము చేస్తా ఉండాడులే...” అంటా ఏమేమో గొణుక్కొంటా ఉండిపోయింది. అనెంక కొన్నాళ్లకే కొడుకు చూపించిన దోవలో తానూ నడుచుకొంటా పొయ్యేసింది మా ఎల్లవ్వ.

అబ్బా అవ్వా తీరిపోయిరన్న వెతలోనే పదకొండో తరగతి (ఎస్.ఎస్.ఎల్.సి) పరీక్షల్ని రాస్తిని. పాసై పోతిని కూడా. పూటకు పదికిపైగా విస్తర్లు లేచే ఇంటికి పెద్ద కొడుకును. ఇపుడు ఇంటికి నేనే పెద్ద దిక్కును. పై చదువుల యోచనను కట్టిపెట్టి, సేద్యం పనికి వంగితిని. దేశానికి సొతంత్రం వచ్చినపుడు మొదలయింది నా చదువు. మా అబ్బ మా కుటుంబాన్ని అనాధను చేసి పోయిన అర్ధ ఏడాదికి, మా ఆంధ్రా అన్నలు మా హోసూరును అనాధను చేసిపోయిన ఐదున్నర ఏడాదులను నా సొతంత్రకాల సదువులు ముగిసినాయి. అయితే మీరు వినాల్సిన కత ఇంకా ఒకటి ఉండాది.

(తరువాయి వచ్చే సంచికలో...)

ధారావాహిక

జోగిని మంజమ్మ ఆత్మకథ ⑧



కన్నడ మూలం
డా. చంద్రప్ప సొబటి

అనువాదం
రంగనాథ రామచంద్రరావు
9059779289

(గత సంచిక తరువాయి...)

జనజాగృతి కార్యక్రమాల్లో ఏయిడ్స్ గురించి చెప్తున్నావుకదా - నీకు గౌరవమర్యాదలు లేవా?

అనేక చోట్ల అనేక జనజాగృతి కార్యక్రమాలు చేశాం. ఈ అన్ని కార్యక్రమాలలో భిన్నమైన అనుభవాలున్నాయి. ఏయిడ్స్ జాగృతి కార్యక్రమం అనుభవం భిన్నమైంది. దాన్ని ఎన్నడూ మరవలేం. ఒకసారి హగరిబొమ్మనహళ్ళి తాలూకాలోని పల్లెల్లో ఏయిడ్స్ జాగృతి కార్యక్రమాన్ని ప్రదర్శిస్తున్నాం. దాని కోసం ఊరి మధ్యన ఉన్న మైదానం కానీ, రచ్చబండను కానీ ఎన్నుకుని కార్యక్రమం ప్రదర్శించాలన్నది ఈ ప్రణాళిక ఉద్దేశ్యం. కార్యక్రమాన్ని ప్రారంభించే తీరు ఇలా ఉంది:

ముందుగా పాటలు పాడేవాళ్ళం. అప్పుడు జనం ఆ పాటలు వినడానికి గుమిగూడేవారు. జనం అలా గుంపు చేరిన మీదట, "ఇప్పుడు ఏయిడ్స్ అనే రోగం విస్తృతంగా వ్యాపిస్తోంది. ఇదొక మరణాంతక రోగం. మొత్తం మానవ కులాన్ని నాశనం చేసే శక్తి ఈ రోగానికి ఉంది. ఇలాంటి రోగానికి దూరంగా ఉండటం మన అందరి కర్తవ్యం. అందువల్ల కొన్ని ముందు జాగ్రత్త పద్ధతులు అనుసరించాలి. అందుకోసమే ప్రభుత్వం మీకు సమాచారం ఇవ్వమని మమ్మల్ని ఇక్కడికి పంపింది" అని చెప్పి, కండోమ్ వాడుక గురించి చెప్పడం మొదలుపెట్టేవాళ్ళం. ఈ కాండోమ్, ఏయిడ్స్ అనే పదాలు విన్న వెంటనే జనం తిట్టడం మొదలుపెట్టేవారు.

"కాళవ్వ జోగమ్మ, మంజమ్మ జోగమ్మలు వస్తే ఏదైనా కథ చెప్తారని, బుద్ధిమాటలు చెప్తారని ఇంట్లో పనులు వదిలి వచ్చాం. మీరు చూస్తే ఏవేవో గబ్బు మాటలు చెప్పడానికి వచ్చారు. ఏ పనికిమాలినవాడు మిమ్మల్ని ఇక్కడికి పంపించాడు? ఇంతమంది జనం ముందు, అది మైదానంలో అలాంటివి నోరు విప్పి మాట్లాడుతున్నారుకదా! మీకు సిగ్గు, శరమూ లేదా? గౌరవ మర్యాదలు లేవా? కాళవ్వా ! నువ్వు ముసలిదానివయ్యావు. మంచి కళాకారిణివని మేమంతా మాట్లాడుకుంటున్నాం. మిగతా జోగమ్మలకైతే తెలియదనుకో. నీకైనా తెలియదా? పిల్లాజెల్లాను పాడుచేయడానికి ఇక్కడికి వచ్చారా? ఇలా పనికిమాలిన పాడు మాటలు చెప్తున్నారు. యల్లమ్మ, హులిగమ్మలు ఈ పని చేయమని చెప్పారా? మీరు అందుకే దీక్ష తీసుకున్నారా?" అని వయస్సు మీరిన మగవాళ్ళు, ఆడవాళ్ళు తిట్టి కార్యక్రమాన్ని ఆపేసేవారు.

ఇంతకీ ఏయిడ్స్ గురించి కార్యక్రమం ఇవ్వడంలో మాకు ఆసక్తి లేదు. ఎందుకంటే మేము ఏదో ఒక ఊరికి వెళ్ళి చౌడికె వాయిస్తే చాలు. యల్లమ్మ దేవి, హులిగమ్మ దేవి, కాళవ్వ దేవి తమ గుమ్మంలోకి వచ్చిందని, లోపలి నుంచి చెంబు నీళ్ళు తెచ్చి మా కాళ్ళ మీద పోసి, నమస్కారం చేసి, లోపలికి పిల్చుకునిపోయి, నల్లకంబళి వేసి కూర్చోబెట్టి, పాట పాడించి, మమ్మల్ని దైవంగా పూజిస్తారు. అంతేకాకుండా ఒక చాటలో బియ్యం, జొన్నలు, ధాన్యపు గింజలు, చీర, రవికగుడ్డ ఇచ్చి పంపుతారు. అలాంటి సమయంలో మేమంతా దేవస్థానం దగ్గర, ఊరి ముందు, నిరోధ్ ఉపయోగించండని ఎలా చెప్పాలని బాధ కలిగింది. అయినా ప్రభుత్వం మాకు ఈ పని అప్పగించిందని చెప్పుకున్నాం.

జనం మమ్మల్ని ఆ దృష్టితో చూడటానికి లేదా జనం మా నుంచి అలాంటి మాటలు వినడానికి ఇష్టపడలేదు. ప్రజలకు వ్యతిరేకంగా నడుచుకోవడం మాకూ ఇష్టముండలేదు. అందువల్ల 'ఏడ్స్ జనజాగృతి' కార్యక్రమాన్ని వదిలేసి, కాన్పులో శుభ్రత, మగవాళ్ళు సంతాన నియంత్రణ కోసం అనుసరించ వలసిన విధానాలు, ఋతుమతుల ఆరోగ్యం, జాగ్రత్తలు, శుచీత్వం, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రదర్శించాం. ఇలాంటి



కార్యక్రమాలకూ ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిన కారణంగా జాగృతి కార్యక్రమాలను వదిలివేశాం. మంచి కార్యక్రమాలు వస్తే చేయాలనే కోరిక ఉంది. ఇది కేవలం కోరిక మాత్రమే కాదు. జీవితపు అనివార్యత కూడా. మా జోగమ్మలంతా బతకాల్సివుంది. అందు కోసమైనా చేయకతప్పదు..

'ఎయిడ్స్ జనజాగృతి' కార్యక్రమాన్ని వదిలేసి, కాన్పులో శుభ్రత, మగవాళ్ళు సంతాన నియంత్రణ కోసం అనుసరించ వలసిన విధానాలు, ఋతుమతుల ఆరోగ్యం, జాగ్రత్తలు, శుచీత్వం, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రదర్శించాం. ఇలాంటి కార్యక్రమాలకూ ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిన కారణంగా జాగృతి కార్యక్రమాలను వదిలివేశాం. మంచి కార్యక్రమాలు వస్తే చేయాలనే కోరిక ఉంది. ఇది కేవలం కోరిక మాత్రమే కాదు. జీవితపు అనివార్యత కూడా. మా జోగమ్మలంతా బతకాల్సివుంది. అందుకోసమైనా చేయకతప్పదు..

మా దేహాన్ని ఉన్నప్పుడూ, చచ్చినపుడూ ప్రజలు ద్వేషిస్తారు

ప్రజల ప్రవర్తన వల్ల మాకు మా దేహం పట్ల ప్రేమ, గౌరవం లేనట్టయ్యింది. అందువల్లనే మేము మా దేహాన్ని ప్రేమించడాన్ని తగ్గించుకుంటున్నాం. అప్పుడు మాకు తెలియకుండా మా దేహం అనారోగ్యానికి గురవుతుంది. ప్రజలు మా దేహాన్ని ద్వేషించిన అనేక ఉదాహరణలు మాకు తెలుసు. మరియమ్మనహళ్ళిలో "తుప్పద కుడికె జోగమ్మ" అనే మగజోగమ్మ చనిపోయింది. ఆమె శవసంస్కారం గురించి చెప్పాడానికి ముందు ఆమె చరిత్ర గురించి కొన్ని విషయాలను చెప్పాల్సిందే. 'తుప్పద కుడికె జోగమ్మ'అసలు పేరు శ్రీహుసేన్ సాబ్. అతను ముస్లీం ధర్మానికి చెందినవాడు. సుమారు నలభై ముస్లీంల ఇండ్లున్న ఫ్లాటులో నివసించేవాడు. అతనిది ఒక ప్రత్యేకమైన ఇల్లు. ఆ ఇంటి పక్కనే ఖాళీ స్థలముంది. ఆ ఖాళీ స్థలంలో యల్లమ్మ దేవాలయం కట్టించాలనే కోరిక అతనికి ఉండేది. దేవాలయాన్ని నిర్మించడానికి అనేక ప్రయత్నాలు చేశాడు. డబ్బు సేకరించి దేవస్థానాన్ని నిర్మించే కార్యానికి పూనుకున్నాడు. అప్పుడు ముస్లీం వీధుల్లో యల్లమ్మ దేవాలయం కట్టకూడదని, అతని పేరిట ఉన్న స్థలాన్ని అతని పేరుమీద లేకుండా చేశారు. అయినా అతను తన ప్రయత్నాన్ని మానలేదు. కోర్టుకు వెళ్ళి ఆ స్థలాన్ని తన పేరిట చేయించుకుని వచ్చి యల్లమ్మ దేవస్థానాన్ని కట్టించాడు.

చూడటానికి అతను చాలా అందంగా ఉండేవాడు. పాతకాలపు సినిమా నటిమణులు అతని సౌందర్యం ముందు నిలువరు. చీర కట్టుకుని చాలా అందంగా రెడీ అయ్యేవాడు. "నువ్వు చీర కట్టుకుంటే మా కులంలో చేర్చుకోం. నువ్వు యల్లమ్మనైనా పూజచెయ్. దుర్గమ్మనైనా పూజించు. అయితే చీర కట్టుకోవద్దు" అని అన్నదమ్ములు పట్టుబట్టారు.

తాను ఇష్టపడుతున్న చీరను వదిలేసి పంచెను కట్టుకోవడానికి ఆరంభించినప్పటికీ, 'యల్లమ్మ కలశం' మోయటం వదల్లేదు. పంచె కట్టుకుని దేవి కలశం మోసుకుని భిక్షం అడుక్కునేవాడు. నిత్యం యల్లమ్మను పూజించేవాడు. ఆ దేవాలయమే అతనికి ఇల్లుగా మారింది. నువ్వెందుకు చీరకట్టుకోవని ఎవరైనా అడిగితే చాలా దుఃఖించేవాడు. అలాంటి ప్రత్యేక వ్యక్తిత్వమున్న జోగమ్మ చనిపోయినపుడు అతడి అన్నదమ్ములు మమ్మల్ని వెదుక్కుని మా ఇంటికి వచ్చి ఆయన చనిపోయిన వార్తను తెలిపారు. అంతేకాకుండా మీరందరూ కలిసి తుప్పద కుడికె జోగమ్మ శవసంస్కారం కార్యక్రమాలను ముగించాలని అర్థించారు. వీరికి జోగిని సంప్రదాయం గురించి, హిందూ సంప్రదాయం గురించి ఏమీ తెలియదు. అందుకే నేను, కాళవ్వ అక్కడికి వెళ్ళాం. అక్కడికి వెళ్ళగానే మమ్మల్ని ఎందుకు పిలిచారో అర్థమైంది. అంటే అనేకమంది ముస్లీములు మా దగ్గరికి వచ్చి, 'తుప్పద కుడికె జోగమ్మ' దేవతను కట్టించుకుంది. ఆమె మెడలో యల్లమ్మ దేవత. ఆమె హిందూ దేవత. అందువల్ల మేమెవరం ఆ శవం తాకం. మీరే ఏమైనా చేయండి" అని అన్నారు. మాకు ఏం చేయాలో తోచలేదు. శవాన్ని మేమే స్మశానానికి మోసుకుని పోవాలంటే స్మశానం దూరంగా ఉంది. పైగా మేమున్నది అయిదు గురమే. అప్పుడు ఏమీ చేయాలో తోచలేదు. మరికొంత మంది జోగమ్మలకు చెప్పి పిల్చుకుని వస్తే సరిపోతుందని నేను, కాళవ్వ ఇంటికి వచ్చాం.

మా జోగమ్మలకు ఫోన్ చేశాం.

ఎవరూ ఊళ్ళో లేరు. దాంతో మేమంతా కలిసి కూరగాయల బండిలో వేసుకునిపోయి మట్టి చేద్దామని నిర్ణయించుకుని అక్కడికి పోయాం. అప్పుడు ఆ కుటుంబీకులు మళ్ళీ మా దగ్గరికి వచ్చి, 'తుప్పద కుడికె జోగమ్మ' యల్లమ్మ ఫోటో వెనుక పదివేల రూపాయలు పెట్టింది. అది మా దగ్గరే ఉంది. శవసంస్కారానికి ఏమవసరమో అవి కొనుక్కోండి. మేము డబ్బులిస్తామని అన్నారు. అప్పుడు శవసంస్కారానికి కావలసిన చీర, జాకెట్టు, పసుపు కుంకుమ, గాజులు, ఒడిబియ్యం పెట్టడానికి కావలసిన సామాన్లు తీసుకుని శవాన్ని మా జోగమ్మ సంప్రదాయం ప్రకారం పూజ చేసి శవాన్ని తీసుకుని పోవటానికి సిద్ధమయ్యాం.

అప్పుడు హిందూ మతానికి చెందిన గ్రామంలోని అయిదారు మంది నా దగ్గరికి వచ్చి "మంజమ్మా, ఈ శవాన్ని ఎక్కడికి తీసుకుని పోతున్నావు?" అని అడిగారు.

అప్పుడు నేను కంగారుపడ్డాను.

ఇదేమిటి వీళ్ళు ఇలా అడుగుతున్నారని అనుకున్నాను.

అయితే వారికి జవాబు ఇవ్వాల్సిందేకదా, అందుకే సహజంగా "స్మశానానికి" అన్నాను.

"ఏ మతానికి సంబంధించిన స్మశానానికి" అని అడిగారు.

"హిందూమతానికి చెందిన స్మశానానికి" అన్నాను.

దాంతో, "తుప్పద కుడుకె జోగమ్మ జన్మనామం ఏమిటి?" అని అడిగారు.

నాకు అప్పుడు వారి ప్రశ్నల వెనుకటి ఉద్దేశ్యం అర్థమైంది.

"శ్రీ హుసేన్‌సాబ్" అనిపేరు చెప్పాను.

అప్పుడు, ''ఏమమ్మా, హిందూమతంలో హుసేన్‌సాబ్ ఉంటాడా? నీ బుద్ధి ఎక్కడుంది? వాళ్ళకు వాళ్ళ స్మశానం లేదా? హిందూ స్మశానానికి ఎందుకు తీసుకునిపోతావు? ముస్లీం స్మశానానికి తీసుకునిపోమ్మని చెప్పు" అన్నారు.

ఈ మాటలు వింటూ అక్కడే నిలబడివున్న ముస్లీములు, 'తుప్పద కుడికె జోగమ్మ' ఇంటివాళ్ళు –

"మా స్మశానానికి వద్దేవద్దు. ఒక వేళ మా స్మశానానికి తీసుకునిపోతే పెద్ద గొడవ అవుతుంది" అన్నారు.

మాకు ధర్మసంకటం.

అప్పుడు నేను ఏడ్చేశాను.

అదే స్మశానంలో కుక్కలు, నక్కలు చనిపోతాయి. వాటిని ఎవరూ అడగరు. ఇప్పుడు ఈ రెండు మతాలవారు అలా అంటే ఆ శవాన్ని మేము ఎక్కడ పూడ్చాలి? వీళ్ళను బతికివున్నప్పుడూ జనం దగ్గర చేరదీయలేదు. చివరికి చనిపోయినప్పుడూ చేరదీయటంలేదు. మాలాంటివారు ఈ సమాజంలో పుట్టడం తప్పా? మేము ఇలా జన్మించాలని దేవుడిని కోరుకుని వచ్చామా? పోనీ హిందువులు మాత్రం జోగమ్మలు కావాలా? ముస్లీంలు జోగమ్మలు కాకూడదా? దేహంలో కలిగే మార్పులు లేదా ఈ జబ్బు మతాన్ని కోరుకుని వస్తుందా? ఇలాంటి మాటలను విన్న నాకు కోపం వచ్చింది. అప్పుడు ఈ శవం మీకూ వద్దు, మాకూ వద్దు అంటారు. అందువల్ల ఈ శవాన్ని తీసుకునిపోయి బస్టాండులో పడేస్తాను. అది వాసన వచ్చినపుడు మున్సిపాలిటీవాళ్ళు వచ్చి లాగి కసువు దిబ్బలో పడేస్తారు. ఆమె నుదుటిరాతలో అలా రాసివుంటే అది అలాగే జరగనీ అని గట్టిగా అరిచాను. ఇక ఇప్పుడు మంజమ్మ గొడవ చేసేస్తుందని అనుకుని, జోగమ్మలంతా కలిసి నన్ను ఊరకుండేలా చేసి, నన్ను ఇంటికి పిల్చుకొచ్చారు.

ఇలాజరిగిన తరువాత హిందూ మతస్థులంతా కలిసి పంచాయితీ చేసి, ''ఆయమ్మ గుడి కట్టించింది. ముస్లీం స్థలంలో దేవాలయం కట్టడానికి కోర్టుకు వెళ్ళివచ్చింది. మన హిందూ మతదర్మం ప్రకారం పూజలుచేసి బతికింది. హిందూ ధర్మాన్ని పాటించి ఆరాధించింది. అందువల్ల ఆమె మన హిందూవుగా ఉన్నట్టే... ఆమెను మనమే గౌరవించాలి. మన మతస్థులే గౌరవించాలి. లేకపోతే మన ధర్మాన్ని మనమే అవమానం చేసినట్టు. ఆ మంజమ్మ చెప్పిందే కరెక్ట్" అని మాట్లాడుకుని హిందూవుల స్మశానంలో శవసంస్కారం చేయటానికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకుని మమ్మల్ని పిలవటానికి వాళ్ళే మా దగ్గరికి వచ్చారు. ఆమెను మా స్మశానంలో శవసంస్కారం చేయడం సమంజసం అని చెప్పి పిల్చుకునిపోయారు. అంతే కాకుండా శవసంస్కారం ఆచరణ కోసం బ్యాండువాళ్ళను పిలిపించారు. టపాసులు తెప్పించి కాల్చారు. శవాన్ని పువ్వులతో చాలా చక్కగా అలంకరించి నమస్కరించారు. బతికి ఉన్నప్పుడు అవసరం లేని అలంకారం చనిపోయినపుడు ఎందుకు చేయాలని



అనిపించినా మా పోరాటంవల్ల 'తుప్పద కుడికె జోగమ్మ' శవానికి ఇంత గౌరవం దొరికిందికదా అని గౌరవపూర్వకంగా శవసంస్కారం చేసి ముగించాం. అయితే మేము చనిపోయినపుడు మా శవాలకు కూడా ఇలాంటి పరిస్థితి రావచ్చనే భయం మా జోగమ్మలను వేధిస్తోంది. వాళ్ళకు మత సమస్య ఎదురైతే, మా శవాలకు వేరే విధమైన సమస్య రావచ్చనే భయం గట్టిపడింది.

శవాన్ని తీసుకుని రండి, మా పొలంలో మట్టిచేద్దాం !

దణనాయకనకెరె గ్రామంలో ఇమాంసాబ్ అనే మగజోగమ్మ చనిపోయినపుడూ శవసంస్కారం సంబంధించి 'తుప్పద కుడికె జోగమ్మ' సమస్యలా పరిణమించింది. ఆ రోజు హిందూ, ముస్లీములతో పోట్లాడి అలసిపోయాను. నేను ఎంత చెప్పినా ఇరు మతస్థులు మాకు వద్దంటే మాకు వద్దంటూ పట్టుబట్టి, దాన్నుంచి వెనుకడుగు వేయలేదు. ఇది చూసిన ఆ ఊరి హరిజన స్త్రీ హులిగమ్మ, "ఏ మంజమ్మా, వాళ్ళ దగ్గర ఎందుకు మాట్లాడుతావు? హిందువుల స్మశానం వద్దు. ముస్లీముల స్మశానం వద్దు. నా పొలం ఉంది. అక్కడ ఎవరిని అడగవలసిన పని లేదు. పదా, మోసుకునిపోదాం. ఆమె మనిషి కాదా? దేవుడిని కట్టించుకుంది. అంతే. దానికి శవాన్ని ముందు పెట్టుకుని ఇలా పంచాయితీ చేయడం సరికాదు. దేవరను కట్టించుకుందంటే ఆమెను మనం దేవతలా కొలవాలి. మీరు మా పొలంలో మట్టిచేయండి. నేను ఆమె పేరిట సమాధికట్టి పూజలు చేస్తాను. రండి" అంది.

అప్పుడు ఊరివాళ్ళకు అవమానంగా అనిపించినట్టుంది.

ఆ కాలంలో ఆమె చేసిన తిరుగుబాటు గొప్పది.

ఇది ఊరివాళ్ళకు గుణపాఠమైంది.

దాంతో ఊరి ప్రజలు 'ఆమె పొలంలో మట్టిచేయటం వద్దు, అది మన ఊరి మానమర్యాదల ప్రశ్న' అని చెప్పి హిందూవుల స్మశానంలోనే శవసంస్కారం చేశారు. ఇలా మా దేహాలు బతికివున్నా, చనిపోయినా ప్రజలకు అవసరం లేకుండపోతాయి. అందువల్ల దీన్ని కర్మదేహం అంటారు. ఎందుకంటే తుప్పద కుడికె జోగమ్మ జీవించి ఉన్నప్పుడు ఆమెను ఎవరూ పలకరించేవారు కాదు. ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు ఆమెకు ఒక పూట భోజనం, ఒక లోటా నీళ్ళు తెచ్చివ్వలేదు. అయితే ఆమె చనిపోగానే, మేమంతా ఇంటికి వెళ్ళేలోపే తను కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుక్కున్న వస్తువులను, డబ్బును తీసుకునిపోయి తమ ఇంట్లో పెట్టుకున్నారు.

ఆమె వస్తువులు కావలసి వచ్చాయి. ఆమె శరీరం మాత్రం అక్కర్లేదు.

ఆమె చేయించిన ఇత్తడి సామాన్లుకు, ఆమె ఉపయోగించిన సామానులకు మైల లేదు. దేవుడు లేదు. మతం లేదు.

తన దేహానికి మాత్రం మైల, జాతి, మతం, దేవుడు ఉన్నాయి.

ఇది ఎలాంటి న్యాయం?

ఆమె, ఆమె దేహం వస్తువుల కన్నా అల్పమైపోయాయా?

పెన్షన్ వయో పరిమితిని తగ్గిస్తే మంచిది

విద్యార్థుల్లారా ! మీకొక ప్రశ్న. మీరు యాభై ఎనిమిదేళ్ళ వరకు బతుకుతారనే నమ్మకం మీకుందా?

(విద్యార్థుల నుంచి లేదనే సమాధానం వచ్చింది).

'లేదు' అనేటట్టయితే 58 సంవత్సరాల వరకే పెన్షన్ నమ్ముకుని ఈ రంగంలో కష్టపడాలి.

ప్రత్యేకించి మాది శ్రమదాయకమైన కళ.

ముప్పయి, నలభై సంవత్సరాల నుంచి ఈ కళను ప్రదర్శించిన నాకు ఇప్పుడు యాభై ఏళ్ళు.

ఇప్పుడు కూర్చుంటే 'అబ్బా' అంటాను. నిలబడితే 'అబ్బా' అంటాను.

రెండుకు బయలు ప్రదేశానికి వెళితే చెట్టున్న స్థలం వెదికి ఆ చెట్టును పట్టుకుని కూర్చుంటాను. మళ్ళీ ఆ చెట్టును పట్టుకునే లేవాలి. ఈ రోజు అంతటి బాధను అనుభవిస్తున్నాను. నిజం చెప్పాలంటే నేను బాధపడుతుండటం చూసిన కుమారి సారా నాతోపాటు కూర్చుని ఏడ్చింది. నా బాధ ఏమిటో నాతోపాటు ఉండి అర్థంచేసుకుంది. ప్రభుత్వంవారు మా బాధను అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోవాలి లేదా మనమంతా కలిసి అర్థమయ్యేలా చేయాలన్నది నా కోరిక.

ఇక్కడ చెప్పుకున్న బాధలను జానపద విశ్వవిద్యాలయం ప్రభుత్వ దృష్టికి తీసుకుని పోవాలి. అకాడెమి అధ్యక్షుల సభా సమావేశాలు జరిగేటప్పుడు ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకుని రావటం సమంజసమని గౌరవనీయులైన కులపతుల దగ్గర వినమ్రంగా విన్నవించుకుంటున్నాను. పెన్షన్ అర్హత వయస్సు తగ్గిస్తే మంచిదని నా అభిప్రాయం.

పెన్షన్ అర్హత వయస్సును యాభై ఎనిమిది కాకుండా కనీసం నలభై అయిదు నుంచి నలభై ఎనిమిదికి తగ్గిస్తే బాగుంటుందని నా సలహా. ఎందుకంటే ఇప్పుడు పెన్షన్ సౌలభ్యం వయసు దాటిన తరవాతే లభిస్తుంది. ప్రభుత్వ ప్రణాళికలు కొన్నిసార్లు ఇలాంటి అవ్యవస్థతో కూడుకుని ఉంటాయి. ఈ మధ్యన జారీ అయిన 'మనస్థితి మత్తు మైత్రి' ప్రణాళిక కూడా ఇలాంటి సమస్యతో కూడుకున్నది. ఆ సౌలభ్యాన్ని పొందడానికి కష్టపడుతున్నాను.

సంచారుల దగ్గర ప్రభుత్వం అడిగే దాఖలాలు ఉంటాయా?

రాష్ట్ర ప్రభుత్వం 'మనస్థితి మత్తు మైత్రి' అనే పథకాన్ని జారీ చేసింది. అందుకుగానూ గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారికి కృతజ్ఞతలు ! అయితే ఆ సౌలభ్యాన్ని పొందడానికి పాటించవలసిన నియమాలు గురించి అభ్యంతరముంది. భయముంది. మమ్మల్ని గుర్తించే పనిని ఆ గ్రామ పంచాయితీ అకౌంట్స్ అధికారికి ఇచ్చారు. నేను ఆ అధికారి దగ్గరికి వెళ్ళి మాకు ప్రభుత్వం జారీ చేసిన సౌలభ్యం కల్పించండని అడిగాను.

అప్పుడు ఆయన "మీకు ఓటర్ ఐ.డి. ఉందా? రేషన్ కార్డు ఉందా? మీ నివాస ధృవీకరణ పత్రం ఉందా?" అని అడిగారు.

నేను లేదని అనగానే, "మీరు ఏ ఊరివాళ్ళని గుర్తించి, ఏ ఆధారంగా మీకు ప్రభుత్వ సౌలభ్యాలు అందించాలి?" అని నన్ను ప్రశ్నించారు.

మా దగ్గర ఇవేవీ లేవు. మేము కానీ, మా సముదాయంవాళ్ళు కానీ ఒకచోట స్థిరనివాసం ఉండటం కష్టం. ఇప్పటి పరిస్థితిలో అలా నివాసం ఉండటానికి సాధ్యమేకాదు. నేను మాత్రం ఒకే చోట అంటే గొల్లరహళ్ళిలో నివాసం ఉంటున్నాను. నాకు ఆ రోజు గురువు కాళవ్వ జోగమ్మ దొరికింది. ఆమె నా దేశదిమ్మరి జీవితానికి ముక్కుతాడు వేసి కట్టివేసింది. అంటే నన్ను ఎక్కడికీ వెళ్ళడానికి వదల్లేదు. అంతేకాకుండా జీవనానికి ఒకింత ఆసరా కలిగించింది. ఆ కారణంగా నేను ఒకే స్థలంలో స్థిరంగా ఉండిపోయాను. స్థిరంగా ఉండిపోయిన కారణంగానే నేనున్న గ్రామంలో 'ఆశ్రయ యోజన' పథకంలో ఇల్లు ఇచ్చారు. ఓటుకార్డు, రేషన్ కార్డు ఇచ్చారు. ఇవన్నీ ఉన్నాయనే కారణంగా నివాసస్థల ప్రమాణపత్రమూ దొరికింది. నాకు అన్నీ ఉన్నాయి. ఆ సౌలభ్యాలకు అర్హురాలినని వెళ్ళి పెన్షన్ వచ్చేలా చేయించుకుంటే మిగిలినవారు ఏమనుకుంటారు? ఆయమ్మకు అన్నీ ఉన్నాయి. అందువల్ల పెన్షన్ వచ్చేలా చేసుకుంది. లేనివాళ్ళం మేమేమి కావాలి? అని మిగతావారు అనుకుంటారనే కారణంగా నేనింకా దరఖాస్తు పెట్టుకోలేదు.

జనం మమ్మల్ని గుర్తించటానికి ప్రభుత్వం వేరే నియమాలను జారీకి తీసుకుని రావాలి. నాటకీయమైనదేది? వాస్తవమైనదేది అని తెలుస్తుంది. చంద్రప్ప చీర కట్టుకుంటే ఇవ్వడానికి కుదురుతుందా? కుదరదు. ఎందుకంటే ఆడదాని భావాలు వేరు. అతని నడక, కళ్ళు, పెదవులు మాట్లాడే మాటలు వేరు. కేవలం చీర కట్టుకున్నంత మాత్రాన మా మాదిరి కాలేరు. అందువల్ల మా కోసం ప్రత్యేకమైన నియమాలను జారీకి తీసుకుని రావాలి. మా పేరిట జరిగే అన్యాయం ఆపటానికి ప్రభుత్వం ఇలాంటి నియమాలను జారీకి తీసుకునిరావాలి. అయితే మా సముదాయం వాళ్ళను అర్థం చేసుకుని పథకాలు జారీకి తెస్తే మరింత సమంజసంగా ఉంటుందని నా అభిప్రాయం.

విశ్వవిద్యాలయంలోనూ మా పరంపరను కొనసాగించేవారు ఉన్నారు

జోగిని కళను కాపాడాలి.

ఆ కళను అభివృద్ధి పరచాలని విన్నవించుకుంటున్నాను.

సాధ్యమైతే ఆ కళను నేర్పించడానికి మాకు అవకాశం ఇవ్వండి.

నేర్పిస్తామని మాన్యులైన కులపతులకు చెప్పాలనే అభిప్రాయంతో విశ్వవిద్యాలయానికి వచ్చాను.

అయితే ఇక్కడ కాలుపెట్టిన కొద్దిసేపట్లోనే కొందరు విద్యార్థులు నా దగ్గరికి వచ్చారు. రజియా అనే అమ్మాయి, అలాగే ఎన్.ఎం. సక్రి, హనుమంతప్ప బెంగేరి మొదలైనవారు వచ్చి, "మేము 'జోగిని నృత్యాన్ని' నేర్చుకుంటున్నాం. ఇప్పటికే నాలుగైదు ప్రదర్శనలు ఇచ్చాం" అని చెప్పారు.

నేను నివ్వెరపోయాను.

కొద్దిసేపు నా నోట మాట రాలేదు.

'అబ్బా! కర్నాటక జానపద విశ్వవిద్యాలయంలోనూ నాకు

పోటీదారులు ఉన్నారుకదా!' అని అనిపించింది.

ఇక్కడ పోటీ అనే మాట మరొక రీతిలో అర్థం చేసుకోకూడదు. ఆత్మీయంగా అన్నాను.

కళను కాపాడుకోవాలన్నది ప్రభుత్వం కోరిక

'జోగిని నృత్యకళను కాపాడాలి' అన్నది నా కోరిక.

పభుత్వం కోరిక కూడా అదేనని అనుకుంటున్నాను.

అందుకు కారణం మాకు ప్రభుత్వం ఇస్తున్న కార్యక్రమాలు. ఆ కార్యక్రమాల వల్ల ఈ సత్యం గోచరిస్తుంది. అంతే కాకుండా 'గురు–శిష్య పరంపర' ప్రణాళిక కింద నేనే పదిమందికి ఆరునెలలు ఈ నృత్యంలో తర్ఫీదు ఇచ్చాను. ఆ సందర్భంలో నేర్పిస్తున్నందుకు నాకు 2000/–రూపాయలు, నేర్చుకున్నవారికి 500/– రూపాయలు ఇచ్చారు. నాగపూర్‌వాళ్ళు కూడా 'గురు–శిష్య–పరంపర' ప్రణాళికలో భాగంగా ఆరునెలలు ఈ కళను నలుగురికి నేర్పాను. ఈ ప్రణాళికలో నేర్పినందుకు నాకు 5000/– రూపాయలు, నేర్చుకునేవారికి 2000/– రూపాయలు ఇచ్చారు.

ఈ రోజు నాతోపాటు నృత్యం చేసిన నలుగురు ఈ పథకం కింద తర్ఫీదు పొందినవాళ్ళే. నలుగురైదుగురు నృత్యం చేస్తున్నప్పుడు



మీరంతా చప్పట్లు కొట్టారు. మీకు మా నృత్యం సంతోషం కలిగించినందుకే, మా నృత్యం చక్కగా కనిపించినందుకే చప్పట్లు కొట్టారని అనుకుంటున్నాను. ఈ రోజు ఈ వేదిక అంతటా జోగమ్మలు నృత్యం చేశారు. అందువల్ల వేదిక నిండుగా, చక్కగా, కనులపండువగా ఉంది. నా జన్మ సార్థకమైంది.

వెనుకటి రోజుల్లో వీళ్ళెవరూ నృత్యం చేసేవాళ్ళుకారు.

గొప్ప గొప్ప వేదికలపై నేను నృత్యం చేశాను.

కాళవ్వ జోగమ్మ పాడటం, నేను నృత్యం చేయడం మా ప్రదర్శనలో ముఖ్యమైన భాగం.

ఇలా వేలాది వేదికలపై నృత్యం చేశాను.

అలా నృత్యం చేసి చేసి ఈ రోజు మోకాళ్ళ నొప్పులతో, నరాల వాపుతో బాధపడుతున్నాను.

పాదం నేలమీద మోపితే చాలా బాధ.

ఉదయం లేచి టాయ్‌లెట్‌కు వెళ్ళడం కష్టమైపోయింది.

ఊరిబయటికి వెళితే ఏదైనా చెట్టు ఉన్న స్థలాన్ని చూసుకుని కూర్చోవాలి.

లేచేటప్పుడు ఆ చెట్టును గట్టిగా పట్టుకుని లేవాలి.

అంతగా బాధపెడుతున్నాయి ఈ మోకాళ్ళు.

అదొక నరకయాతన !

వయస్సులో ఉన్నప్పుడు ఒక్కొక్క కాలికి రెండు రెండు వరుసల గజ్జెల సరాల్ని కట్టుకుని అవలీలగా నృత్యం చేసేదాన్ని.

బహుశా దాని ప్రభావం కూడా నా మోకాళ్ళపై పడినట్టుంది.

ఎవరైనా మమ్మల్ని ఆహ్వానించడానికి వచ్చినపుడు 'నేను మీ ఊరికి వచ్చినపుడు నాలుగు వరుసలు ఉన్న గజ్జెల సరాలు ఇవ్వాలి' అని అడిగేదాన్ని. అక్కడికి వెళ్ళినపుడు గజ్జెల సరాలు ఇస్తే సంతోషపడేదాన్ని. ఇవ్వకపోతే, "మీవి బుర్ర మీసాలు. మీరు మగవాళ్ళు కాదా? ఇంట్లో ఎద్దులకు గజ్జెలు కట్టలేదా? తెచ్చి ఇవ్వడానికి మీకేమైంది? తెచ్చి ఇవ్వండి" అంటూ బాగా తిట్టేదాన్ని.

రెండు రెండు వరుసల గజ్జెలు కట్టుకుని నృత్యం చేయడమంటే నాకు చాలా ఇష్టం. నేను నృత్యం చేస్తున్నప్పుడు నా అడుగుల వల్ల బయటికి ఎగసిపడే మధుర నాదం వేదిక అంతటా వినిపించాలన్నదే నా కోరిక. ఎందుకంటే హార్మోనియం, తబలా నాదలయలకు తగినట్టు నేను లయబద్ధంగా అడుగులు వేస్తూ నృత్యం చేస్తాను. ఈ అడుగులు చాలా అందంగా ఉంటాయి. జానపద, పౌరాణిక, ఆధునిక లయలను కలగలుపుకున్నటువంటివి. ఆ నృత్యం చేస్తున్నప్పుడు వినవచ్చే మువ్వల మృదుమధురనాదంలో నేను అనేకసార్లు నన్ను నేను మైమరచిపోయాను.

'మీరు మా విద్యార్థులకు నృత్యం చేసి చూపించాలి' అని ప్రొ. స.చి. రమేశ్‌గారు ఇరవై రోజుల క్రితం ఫోన్‌లో అడిగారు.

ఆ కారణంగా ఉదయం, సాయంకాలం వాకింగ్‌కి వెళ్ళడం ప్రారంభించాను.

అయితే నృత్యాభ్యాసం చేయలేదు.

కార్యక్రమాలు లేకపోవటంతో నృత్యాభ్యాసం పూర్తిగా కుంటుపడింది.

నేను నృత్యం చేయడం మానివేసి వచ్చేనెల 28కి సంవత్సరం అవుతోంది.

భిక్షాటన మానివేసి చాలాకాలమే అయింది.

ఈ మధ్య రోజులలో ఈ కళను అడిగేవారే లేకుండాపోయారు.

ఈ కళ వేదికకే పరిమితమైపోయింది.

ఇలాంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ఈ కళను నేర్పించే ఒక కార్యక్రమాన్ని చేబట్టడం ధైర్యంతో కూడిన పని. ఆ పథకం కింద ఈ కళ నేర్చుకున్నవారు ఇప్పుడు నేను మోస్తున్న భారాన్ని తగ్గించారు. ఈ నృత్యానికి మెరుగు ఇచ్చారు. మునుముందు మరింత మెరుగు పరచగలరనే బలమైన నమ్మకం నాకుంది. వాళ్ళకు చక్కటి సహకారం లభించాలి. అంతే నేను కోరేది. జోగినీ నృత్యకళ నేర్చుకున్నవారికీ, అందుకు సహకరించిన ప్రభుత్వం వారికీ ధన్యవాదాలు. అంతే కాకుండా నన్ను పిలిచి, సన్మానం చేసి, నా జీవితానుభవాలను చెప్పుకోవడానికి అవ కాశం కల్పించిన గౌరవనీయులైన వైస్‌ఛాన్స్‌లర్ గారికి, గౌరవ నీయులైన రిజిస్ట్రార్‌గారికి, గౌరవనీయులైన మౌల్యమాపన రిజిస్ట్రార్‌గారికి, ఈ కార్యక్రమం (విస్తరణ–సలహాకేంద్రం) డైరెక్టర్‌గారికి, సీనియర్ పరిశోధనా అధికారులకు, ఓర్పుతో ఇంతసేపు నా గోడును, నా జీవిత కథను విన్న మీ అందరికీ మరొకసారి నా నమస్కారాలు అర్పిస్తూ నా మాటలను ముగిస్తున్నాను

(అయిపోయింది...)

యాత్రాసాహిత్యం

మూల రచన : జూలియా చార్లోటి
అనువాదం : కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ,
డా. కాళిదాసు పురుషోత్తం
9000642079

'ఆమె లేఖలు'

(గత సంచిక తరువాయి...)

ఆరో లేఖ

1837 జనవరి 11వ తేది రాసిన జాబులో 'ఆమె' మరికొన్ని మద్రాసు సంగతులు ముచ్చటిస్తుంది–

"ఒకరోజు బిషప్ కోరి మా యింటికొచ్చారు. ఆయనంటే నాకెంతో గౌరవం. ఆయన్ను కలుసుకోడం నాకు చాలా ఆనందం కలిగించింది. యువ బిషప్ అంటే ఇలా వుండాలి అని అనిపించేట్లు, ఆయన చాలా సౌమ్యంగా, ఉన్నతంగా, ఆర్ద్రంగా ఉంటాడు. ఆదివారం మేం చర్చికి వెళ్లాంగానీ, ఆ రోజున బిషప్‌గారు ప్రసంగించలేదు ; మరెవరో మంచి చెడులను గూర్చి నిర్లక్ష్యంగా మాట్లాడారు. సాయంకాలం కొన్ని మైళ్ల దూరంలో బ్లాక్‌టౌన్‌లోని గుడికి (చర్చ్) వెళ్లాం. అక్కడ చాలా రద్దీగా వుంటుంది. అందులో స్థలం దొరకాలంటే ముప్పావుగంట ముందుగా వెళ్లాలి. అంత శ్రమపడి వెళ్లినందుకు మేము మంచి ప్రవచనమే వినగలిగాం. బిషప్ బాగా ప్రసంగించారు. ఆయన ఈ ప్రాంతంలో మంచి పనులు చేస్తున్నట్లు విన్నాం. ఆ గుడి ప్రధానంగా తక్కువ కులాల వారికి ఉద్దేశించిందే అయినా, ఆయనకున్న పేరు ప్రఖ్యాతుల వల్ల యూరోపియన్లు కూడా ఆ గుడికి వెళ్తుంటారు. అందువల్ల ఆ గుడిని ఎవరికోసమైతే నిర్మించారో వారికి అందులో ప్రవేశం లేకుండా పోతుందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. నిజమే కానీ, వారానికొక్క రోజు ఇంగ్లీషువాళ్లు కూడా మంచి మత ప్రసంగం వినడానికెందుకు నోచుకో కూడదా?

నిన్న ఉన్నత కులాల వారికి చెందిన నేటివ్ స్కూల్ చూడ్డానికి వెళ్లాం. ఆ పిల్లలు క్రైస్తవులు కాకపోయినా విద్యాసక్తితో బైబిల్ చదువుతున్నారు. చాలా తెలివైన పిల్లలు. చక్కని తలపాగాలు, ఆభరణాలతో చూడ ముచ్చటగా ఉన్నారు. చరిత్ర, భూగోళం, బైబిల్‌పై ప్రశ్నలకు చక్కగా సమాధానాలు చెప్పారు. 'ఏదోరోజు ప్రభువు విశ్రాంతి తీసుకోవడమంటే ఏమిటి? దేవుడికి విశ్రాంతి అవసరమా అని ప్రశ్నిస్తే, "రాత్రిళ్లు అవసరమే!" అని చెప్పారు. "ఉన్నత వర్గాలకు చెందిన 'నేటివు'ల కోసం కొందరు ఇంగ్లీషువారు నిర్మించిన పాఠశాల ఇది". అని ఆమె రాస్తుంది.

మద్రాసులో చదువు సాములను గురించి చెప్తూ, అక్కడ చాలా ఇంగ్లీషు స్కూళ్లలో ఉన్నత కులాలు, పంచములనే తేడా లేకుండా అందర్నీ చేర్చుకుంటారని, అది ఇంగ్లండులో లాంతర్లు తుడిచేవారిని, ఉన్నత వంశస్థుల్ని ఒకటిగా స్కూల్లో చదవమనడం వంటిది. మద్రాసులో చిన్న చిన్న కొట్టాముల్లో దిక్కుమాలినట్లు వుండే డాక్టర్ బెల్ విద్యా విధానాన్ని బోధించేవే నిజమైన స్కూళ్లని ఆమె వ్యాఖ్యానిస్తుంది. స్కూళ్లలో పిల్లలు ఉదయం ఆరు గంటల నుంచి, మధ్యలో అన్నం తినడానికి, కాసేపు నిద్రపోవడానికి తప్ప – రాత్రి ఎనిమిది గంటల వరకు రోజంతా గట్టిగా అరుస్తూ చదువుతూ వాళ్లు పడేశ్రమ అంతా యింతా కాదు. "మన శిశు విద్యాలయాల్లో చేసే రచ్చ ఈ స్కూళ్ల ముందు ఒక లెక్కలోనిది కాదు" అని అంటుంది. నిజానికి, పాపం, ఎంత కష్టపడినా వాళ్లు నేర్చుకొనేది మాత్రం చాలా స్వల్పమే". అంటుంది ఆమె.

ఇంగ్లీషువారి సిబ్బందిలో ఒక ఉపాధ్యాయుడు (మున్షీ) తప్పనిసరిగా వుంటాడు. ఆమె కూడా ఒక మున్షీని నియమించుకొంది. అతను వారానికి మూడుసార్లు తమిళం నేర్పించడానికి వచ్చేవాడు. చాలా నిదానస్తుడు, పెద్ద పెద్ద మీసాలు, నడుం చుట్టూ అరగజం వెడల్పుగల అందమైన శాలువాలు చుట్టాడు. నేను రమ్మన్నప్పుడు వస్తాడు. పొమ్మన్నప్పుడు పోతాడు. అతను వచ్చినప్పుడు నేను సిద్ధంగా లేకపోతే, నేను రమ్మనేంత వరకు – రెండు గంటల సైపైనా – వరండాలో పనీ పాటా లేకుండా గొంతు కూచుని ఉంటాడు. పాఠం వినడం విసుగెత్తితే, అతన్ని ఏదో రాసుకొంటుండమని చెప్పి లోపలికి వెళ్లిపోతాను. మళ్లీ నేను తిరిగి వచ్చేదాకా అతను అక్కడే కూచుని మెల్లగా ఏదో గెలుకుతుంటాడు".

ఆమెకు తమిళం నేర్పించే ఆస్థానిక ప్రముఖుడు మద్రాసులోని హిందూ లిటరరీ సొసైటీ అధ్యక్షుడు, ఆ సంస్థ ప్రారంభోత్సవ సభలో తాను ఇంగ్లీషులో చదివిన ప్రసంగానికి ఆయన ఎంతో గర్వపడుతుంటాడు. ఒకరోజు ఆ ప్రసంగం తెచ్చి ఆమెకిచ్చాడు. చాలా బాగుందని ఆమె మెచ్చుకొంది.

ఆయన నేర్పించే తమిళభాష పరమ వికారంగా ఉంటుందని అంటూ, ఆ చటపటమంటూ, కీచుమంటూ, మాట్లాడుతూంటే తుంపరలు పడుతున్నట్టుటుందని, కోళ్ల గూటిని ఒక్కసారి తెరిస్తే...ఎట్లా ఉంటుందో అట్లా కర్ణకఠోరంగా ఉంటుందని, అందులో చెవికి ఇంపైన శబ్దం ఒక్కటైనా లేదని అంటుంది. "కొన్నాళ్లకు విసుగెత్తుతుందేమోగానీ, ఇప్పుడు మాత్రం ఆ భాష నేర్చుకోడం తమాషాగానే వుంది నాకు" అంటుంది. ఆమె కథలు చదువుతూంటే అందులో కంఠస్థం చేయాల్సిన పద్యాలు మున్షీ రాసిపెడతాడు. ఒక రోజున ఆమె "తన్నులు తిన్న మొనగాడు" అనే పాఠం చదువుతూంటే, అందులో 'కిక్స్' అనే పదం రాయడానికి మున్షీ తటపటాయించాడు. ఎందుకంటే ఆ పదం ఆమెకు ఎంతమాత్రం ఉపకరించేది కాదట. ఒకసారి స్పాన్‌టన్‌కు ఏదో తాళపత్రం మీద రాసిపెట్టడానికి ఒక తమిళ లేఖకుడు వచ్చాడు. (మూలంలో కోడ్జన్ లీఫ్ అని ఉంది : అనువాదకుడు) అతను ఒక చేతిలో తాళపత్రం, మరో చేతిలో ఇనుప గంటం పట్టుకున్నాడు. "అతని చిటికెన వేలు గోరు గద్దగోరంత పొడవుంది. అది అసహ్యంగా వున్నా, ఆ చేతికొక ఆభరణంలా నాకనిపిస్తోంది. అతడు కాళ్లు

ముడుచుకొని అసౌకర్యంగా కూచున్నాడు. ఐనా చాలా సులువుగా, వేగంగా రాసేశాడు" అని ఆమె అంటుంది.

విందుల్లో చాలా దుబారా అవుతుంది. అందరూ ఉదయమే భోజనం చేస్తారు. దాన్నిక్కడ 'టిఫిన్' అంటారు. ఏమీ మిగల్చకుండా తినేస్తారు. మన ఇంగ్లీషు డిన్నర్లలో టేబిల్ మీద వడ్డించేదానికంటే నాలుగింతలు ఎక్కువ పెడతారు. కోడికూర, బాతుకూర, మాంసం అన్నీ, పద్ధతిగా వడ్డిస్తారు. ఇక్కడి పళ్లు మన స్ట్రాబెరీతో సమానం కాదు. పాండిచ్చేరిలో ఫ్రెంచి వారు ద్రాక్ష పెంచడానికి ప్రయత్నించారు. అవేవీ పెరగవని మన ఇంగ్లీషువారు తేలబలికేస్తూ ఎంతసేపూ పుల్ల బత్తాయిలు తింటూ కడుపునొప్పి తెచ్చుకొంటారు...ఎప్పుడైనా పాండిచ్చేరి నుంచి ద్రాక్ష తెప్పించుకొన వలసినదే. ఫ్రెంచివారు ద్రాక్ష చాలా చౌకగా రూపాయికొక గుత్తి యిస్తారు".

భోజనానంతరం అతిథులందరూ విశాలమైన గదుల్లో మధ్యన కూచొని దోమలు పెరుకుతూంటే గీరుకుంటూ గుసగుస మాట్లాడు కొంటారు. అడపాదడపా కాస్త సంగీతం కూడా వినిపిస్తారు., కానీ అదీ అన్నింటిలాగే నిస్సారంగా వుంటుంది. అతిథుల్లో ఆడవాళ్లందరూ వయస్సులో ఉన్నవారే. మగవాళ్ళు మాత్రం ముసలి వగ్గులు. ఫాన్స్ వివాహితుడు, ఇంగ్లండు పెళ్లికాని అమ్మాయిలకు స్వర్గధామం అని ఎవరో అన్నారు. ఇండియా మధ్య వయస్సులోని పురుషులకు అని నాకనిపిస్తుంది. వాళ్లు యవ్వనంలో వుండగా దేన్ని గురించీ ఆలోచించరు. నలభై ఏళ్ల వయస్సులో వాళ్లను 'యువకులు'గా పేర్కొంటూ వాళ్లను గురించి పట్టించుకోడం మొదలు పెడతారు. అప్పుడీ మర్యాదస్థులు అందరితో పరాచికాలాడుతూంటే యువకులు చూస్తూ కూచుంటారు."

ఇక్కడ ప్రతి జీవీ సోమరే నంటుందామె.

కొంతమంది ఆంగ్లో ఇండియన్ వృద్ధులు తోటలో షికారు తిరుగుతున్నపుడు కూడా తమ వెంట నౌకర్లు వుండడం ఘనంగా భావిస్తారు. చూసి తీరాల్సిన దృశ్యం అది. చక్కని తలపాగాలతో పోతపోసిన విగ్రహాల్లాంటి ఇద్దరు నౌకర్లు వెనక నడుస్తూంటే, ముందు బక్క చిక్కిన ముసలాయన మెల్లగా అడుగులో అడుగేస్తుంటాడు.

నేటివులు, చిన్న ఉద్యోగులు రాసే జాబులు తనకు ఆసక్తి కలిగిస్తుంటాయని ఆమె అంటుంది. "తనవంటి అనామకుడి దస్తూరీ చదివే ఇబ్బంది కలిగించినందుకు మన్నించమని ఒకరు రాస్తే ఇంకొకరు "దయాపూర్వకమైన తమ పాదముల చెంత చేరే గౌరవం "త్వరలో తనకు కలగాలని ఆశిస్తున్నా"నంటాడు. ఇంతకన్నా బూటకం వుంటుందా? అని వ్యాఖ్యానించి, ఇంగ్లీషు పద్య పాదాలను ఉటంకిస్తూ, జాబు ముగిస్తుంది.

ఏడవ లేఖ

సంపన్నుల గృహాల్లో విందు వినోదాల ఆర్భాటాలను గురించి ఆమె 1837 జనవరి 31వ తేదీ మద్రాసు నుంచి రాసిన జాబులో వివరిస్తుంది. ఒకరోజు ఒక ధనికుడు, అతని కుమారుడు మమ్మల్ని వాళ్లింటికి ఆహ్వానించారు. అతను మా ఆయనవల్ల సాయం పొందినవాడు. పైగా స్థానికుల ఇళ్లు చూడాలని నీకు కోరిక. అందువల్ల నేను సంతోషంగా అంగీకరించాను. నిన్నరాత్రి స్టాటన్ దంపతులు, మేము వాళ్లింటికి వెళ్లాం.

ఆ ధనికుడి ఇంట్లో విందూ వినోదాలు తనకు ఎంతో ఆసక్తి కలిగించాయని అంటూ, స్టాన్‌టన్ దంపతులు చాలా కాలంగా ఈ దేశంలో వుంటున్నా వాళ్లు ఎన్నడూ అట్లాంటి కార్యక్రమాన్ని చూడకపోవడం ఆశ్చర్యంగా వుందని, నేటివుల ఆచార వ్యవహారాలపై ఇంగ్లీషు వనితలకు ఏ మాత్రం ఆసక్తి లేకపోవడం తనకు ఆశ్చర్యం కలిగించిందని ఆమె వ్యాఖ్యానించింది. అందుకు కారణం వాటికి వాళ్లు అలవాటు పడిపోవడమేకాక, తమ చుట్టూ ఏం జరుగుతున్నదో ఎప్పుడూ పట్టించుకోలేదని వాళ్లే ఆమెకు చెప్పారు. "వాళ్లు తమ తొలినాళ్ల అనుభవాలను కూడా మరచిపోయి వుంటారు. నాలోనూ అటువంటి నిరాసక్తత, నిరుత్సాహం ఏర్పడక తప్పదేమో కానీ, అంతకు ముందే ఇక్కడి విషయాలన్నీ తెలుసుకోవాలని నేననుకొంటున్నా" అని ఆమె రాస్తుంది.

"నీవు ఇండియాలో ఏమేం చూశావ"ని ఆమె మరో ఇంగ్లీషు మహిళను అడిగింది. ఇక్కడ తానేమీ చూడలేదని, ఈ ప్రజల్ని గురించి తనకేమీ తెలియకపోవడం అటుంచి, తెలుసుకోవాలనే ఆసక్తి కూడా లేదని అంటూ, "వీళ్లని గురించి ఎంత తక్కువ తెలుసుకుంటే అంత మంచి"దన్న అభిప్రాయం వెల్లడిస్తుంది.

'మమ్మల్ని విందుకు ఆహ్వానించిన ఆర్ముగం, సుబ్బు లాంతర్లతో తోట గేటువద్ద మాకు ఎదురొచ్చారు. వారి వెంట స్నేహితులు, నౌకర్లు మొదలైన నేటివులు తోటగేటువద్ద మా కోసం వేచి వున్నారు. ఇల్లంతా రకరకాల దీపాలు వెలిగించారు; కప్పు నుంచి కొన్ని దీపాలు వేలాడదీశారు, గోడలకు దీపాలను తోరణాల్లాగా అలంకరించారు. దీపాలంకరణ చాలా బాగుంది". అంటూ ఆమె ఆ విందు వైభవాన్ని వర్ణిస్తుంది. ఇల్లు చాలా పెద్దది. ముందున్న పెద్ద వరండాలో నేటివులు నిలుచున్నారు. అది దాటుతూనే పెద్ద డ్రాయింగ్ రూము; దానికి అటూ యిటూ రెండు చిన్న గదులు, అవతల పడక గదులు. డ్రాయింగ్ రూముకు మరోవైపు ఇంకో వరండా; అందులోంచి తోటలోకి దారి. ఇంట్లో ఫ్రెంచి లాడ్జింగ్ హౌస్‌లో వుండే అంతకన్న మంచి ఫర్నిచర్, గోడలకు చక్కని అద్దాలను అమర్చారు.

మమ్మల్ని డ్రాయింగు రూంలోకి తీసుకెళ్లి సోఫాల్లో కూచోబెట్టారు. మా పక్కన నౌకర్లు పంఖాలు విసురుతూ నిలబడ్డారు. ఆర్ముగం, సుబ్బుమాకు రోజా పూల గుత్తులు తెచ్చి యిచ్చి, వాటిమీద, మామీద పన్నీరు చిలకరించారు. తర్వాత నాకు పూసలతో చేసిన ఒక హారం బహూకరించారు. పూల మాలలు కూడా యిచ్చారు.

తర్వాత వినోదకార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. హిందువుల సంగీత నృత్యాలతోపాటు ముస్లిముల వినోద కార్యక్రమాలను కూడా ప్రదర్శించడం కోసం ప్రత్యేకంగా నవాబుగారికి చెందిన నర్తకుల్ని, సంగీతకారుల్ని పిలిపించారు. నవాబుగారి వంటవాళ్లను కూడా రప్పించారు. మొదట వీణ వాయించేందుకు పొడవాటి తెల్లని గడ్డంతో ఒక ముసలాయన వచ్చాడు. వీణ పెద్దమాండలిన్‌లా చూడ్డానికైతే బాగుంటుంది, పురాతనమైనదే, కాని అంత వినసొంపైనదేమీ కాదని ఆమె అభిప్రాయపడింది. "ఆ ముసలాయన సంగీతం ఘోరం. అది వినివిని విసుగెత్తడంతో ఆపమన్నాం. తర్వాత

నవాబుగారు పంపిన నాట్యగత్తెలు పై నుంచి కిందిదాకా సిల్కు దుస్తులు ధరించి, రోజాల్లాగా అందంగా అలవోకగా నడుస్తూ వచ్చారు. వాళ్ల ఒంటినిండా నగలే – చెవులకు, ముక్కుకి రింగులు, చేతులకు గాజులు, అన్ని వేళ్లకీ కాలి బొటన వేళ్లక్కూడా రింగులు. వాళ్ల నృత్యం అలా తేలిపోతూ, చేతులూపుతూ, గుండ్రంగా తిరుగుతూ ముందుకీ వెనక్కీ వొంగడమే. పద విన్యాసమే లేదు. హంసల్లా నడవడమే వాళ్ల నృత్యం అంతటికీ బాగుంది. పాట మొదలుపెట్టారు – రాగంలేదు, గానం లేదు; వీధి గాయకుల్లా భయంకరంగా అరవడం తప్ప!"

ఆ నాట్యం ముగిశాక, వాళ్ల వాద్యగోష్ఠి – రకరకాల వాయిద్యాలు – సంగీతం పేరుతో అవి చేసిన ఘోరమైన శబ్దాన్ని నీవు ఊహించుకో మరి. లాంతర్లు తుడిచేవాళ్లు మేడే రోజు చేసే రణగొణధ్వని ఇంతకన్నా సొంపుగా వుంటుంది.

తర్వాత పక్షుల శబ్దాలను అనుకరించే మరొకాయన వచ్చాడు. ఫర్వాలేదు. బాగానే వుంటుందనుకున్నాను. కానీ మద్రాసు పక్షున్నాయే, అవి పాడేవికావు. అరిచేవి. కాకులు, గుడ్లగూబలు, చిలుకలు, నెమళ్లు, పిచ్చుకలు వగైరా పక్షుల అరపుల్ని ఎంత అద్భుతంగా అనుకరించాడంటే, ఆ చిత్రహింస నుండి తప్పించవలసినదిగా మళ్లీ కోరక తప్పలేదు" తర్వాత ఒక హిందూ నర్తకి వచ్చింది. నేనింత వరకు ఎక్కడా చూడనంతటి అత్యద్భుత ఆభరణాలు ధరించింది. ఈమె నృత్యం కూడా ముస్లిం స్త్రీల నృత్యం లాగే వుంది కాకపోతే అంతకన్నా కాస్త మెరుగు. చేతులూపుతూ కళ్లు తిప్పుతూ, గాజులు గలగలలాడిస్తూ ముందుకూ వెనక్కూ పరుగులెత్తటమే ఆమె నృత్యం. నా వైపు చిత్రంగా చూస్తూ నాట్యం చేసింది. బహుశా ఆ చూపులు, ఆ నటన అంతా ఏ భారతీయ నర్తకినో అనుసరించటం కావచ్చు. నిద్రాభంగం చేసుకొని ఈ నృత్యం చూసే వాళ్లు కూడా వుంటారని నేననుకోను. నేటివులు గంటలసేపు చూస్తూ కూచొంటారని విన్నాను; కానీ వాళ్లు కూడా జోగుతూనే చూస్తుంటారు.

తర్వాత మాంత్రికుడు వచ్చి చక్కని ఇంద్రజాలం ప్రదర్శించాడు. అతని ఒంటిమీద చొక్కాలేదు. తలపాగా, దుప్పటి మాత్రమే వున్నాయి; అందువల్ల వస్తువుల్ని దాచాడనడానికి వీల్లేదు. అతడొక చిన్న మొక్కను తీసి, దాన్ని, తన వేళ్ళతో అలా తాకేసరికి దాని ఆకులన్నీ జలజలా రాలిపోయాయి. వాటితోపాటు తన వేలి సైజు వున్న అయిదారు పెద్ద తేళ్లు కూడా రాలిపడ్డాయి. అవి గదిలో పాకుతుంటే తనకు చాలా భయం వేసిందని, దాంతో ఆ మాంత్రికుడు వాటిని చేతితోతాకి ఇట్టే మాయం చేసినాడని ఆమె అంటుంది. తర్వాత, అతను ఉత్త చేయిని గాలిలో వూపి ఒక నాగుపామును తీసి మా ముందుకి విసిరేశాడు. ఆ తర్వాత అతను కప్పలతో జంతువులతో చేసిన మ్యాజిక్కులన్నీ మన ఇంగ్లీషు మాంత్రికుడు కూడా చేసేవే, కానీ తేళ్లు, పాములతో మ్యాజిక్కు నా ఊహకు అందకుండా వుంది. ఆ మాంత్రికుడి మెడలో జంధ్యం వుండడం ఆమెను ఆశ్చర్యపరచింది. ఇరవయ్యేళ్ల క్రితమైతే ఇలా ఒక బ్రాహ్మణుడు తమ ముందు నిలబడి మంత్ర తంత్రాలు ప్రదర్శించేంతగా దిగజారి వుండేవాడు కాదని అక్కడ చేరి వారన్నారట. మాయాజాలం తర్వాత మళ్లీ ఒక అమ్మాయి పదునైన కత్తుల మీద లయబద్ధంగా నృత్యం చేసింది. తర్వాత ఒకడు నిప్పులు తినడం ప్రదర్శించాడు. ఇదంతా ముగిసిన తర్వాత వెనకవైపు వరండాలో బ్రహ్మాండమైన విందు. ఒకవైపు పింగాణి ప్లేట్లలో నవాబుకు ఇష్టమైన మాంసం, పలావు, కూరలు వడ్డించారు. మరోవైపు హిందువులు వంటకాల కప్పులు సాసర్లలో పెట్టారు. "అమ్మగార్ని తృప్తి పరచడం కోసం బాగా తినమని మా ఆయన నా చెవిలో వూదారు. నేను పీకలదాకా తిన్నాను. ముస్లింల పలావు చాలా బాగుంది. కానీ హిందువుల వంటకాల్లో నూనె ఎక్కువ; తినలేక పోయాను.

విందు తర్వాత 'ఆర్మగం' 'ఆమె' నుద్దేశించి ఒక లఘు ప్రసంగం చేశాడు. తప్పులేవైనా జరిగితే అవి తెలియక చేసినవే కానీ అభిమానం లేక చేసినవి కాదని, అందుకు తల్లిలా పెద్ద మనసుతో మన్నించవలసినదిగా ఆమెను కోరుతూ వారిపై పన్నీరు చిలుకరించాడు.

"ఇంతమంచి విందు, వినోదాలతో ఆతిథ్యమిచ్చినందుకు అతనికి ధన్యవాదాలు చెప్పి వచ్చేశాం" అంటూ ఆయింటి స్త్రీలను గురించి యిలా వ్యాఖ్యానిస్తుంది –

"ఆ ఇంట్లో ఆడవాళ్లని చూడాలని నాకోరిక, కానీ ఇంగ్లీషు పురుషులముందుకు వాళ్లు రారు. లోపల ఎక్కడైనా కనపడ్తారేమో అని తొంగి చూశాను. సగం తెరచిన తలుపుల్లోంచి నల్లని కళ్లు, తెల్లని చీరలు కనిపించడం తప్ప వాళ్లను స్పష్టంగా చూడలేక పోయాను"

(తరువాయి వచ్చే సంచికలో...)



"బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనేది
నా ఖచ్చితమైన అభిప్రాయం.
విద్యావ్యాప్తికి పరిశ్రమించడమే విద్యాలయాల కర్తవ్యం
విద్యాలయాల్లో బోధనా మాధ్యమంగా
మాతృభాషను స్వీకరిస్తే తప్ప ఈ లక్ష్యం నెరవేరదు"


డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్

రైటింగ్స్ & స్పీచెస్ వాల్యూమ్ 6, పేజి 312

పిట్టచూపు

చలసాని నరేంద్ర
9849569050

ఈశాన్యంలో శాంతికోసం కీలక ఒప్పందాలు



దేశంలో ప్రచార సాధనాలు పౌరసత్వ సవరణ చట్టంపై జరుగుతున్న వివాదాల పట్లనే దృష్టి సారిస్తూ ఈశాన్య ప్రాంతంలో చోటుచేసుకున్న చారిత్రాత్మక పరిణామాలను పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. ఈ మధ్య కుదిరిన కీలకమైన రెండు ఒప్పందాలు కూడా దశాబ్దాల తరబడి జరిగిన సంప్రదింపుల ఫలితంగా కుదిరాయి. ఇటువంటి చర్యలు అడవులలో గల ఇతర సాయుధ బృందాలు కూడా బయటకు వచ్చి, ప్రధాన స్రవంతిలో కలవడానికి ప్రోత్సాహం కలిగిస్తుంది.

ఈశాన్య ప్రాంతంలోని తీవ్రవాదులు ప్రధానస్రవంతిలోకి రావడం మొదలవడం ఈ సందర్భంగా జరిగిన కీలకమైన పరిణామం. వారు ఆయుధాలను వదిలివేసి, మన వ్యవస్థలో భాగం అవుతూ ఉండడంతో దీర్ఘకాలిక శాంతికి మార్గం ఏర్పడుతున్నది. మొదటగా త్రిపురలో బ్రూరేయాంగ్ గిరిజనులతో, రెండోవది అస్సాంలో బోడోలతో చారిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి.

త్రిపురలో గత 23 సంవత్సరాలుగా బ్రూరేయాంగ్ ప్రజలు సహాయ శిబిరాలలో శరణార్థులుగా దుర్భర జీవనం గడుపుతున్నారు. మిజోరాం లో జాతిపర ఘర్షణల కారణంగా వారు పారిపోయి వచ్చారు. మిజో ప్రజలతో హింసాయుత ఘర్షణలు జరగడంతో ఈ వర్గానికి చెందిన ప్రజలలో సగంమందికి పైగా ప్రాణం అరచేతిలో పెట్టుకొని ఇక్కడకు వచ్చారు.

బ్రూ వర్గం ప్రజలు త్రిపుర, మిజోరాం, దక్షిణ అస్సాంలోని కొన్ని ప్రాంతాలలో విస్తరించి ఉన్నారు. జాతిపరంగా మిజో ప్రజలకు భిన్నమైన వారు. వారికీ ప్రత్యేకంగా సొంత భాష ఉంది. త్రిపురలో

ఈశాన్య ప్రాంతంలోని తీవ్రవాదులు ప్రధానస్రవంతిలోకి రావడం మొదలవడం ఈ సందర్భంగా జరిగిన కీలకమైన పరిణామం. వారు ఆయుధాలను వదిలివేసి, మన వ్యవస్థలో భాగం అవుతూ ఉండడంతో దీర్ఘకాలిక శాంతికి మార్గం ఏర్పడుతున్నది. మొదటగా త్రిపురలో బ్రూరేయాంగ్ గిరిజనులతో, రెండోవది అస్సాంలో బోడోలతో చారిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి.

ఉన్న 20కి పైగా జాతులలో బ్రూ ఒకటి. హింసాయుత సంఘటనల కారణంగా వారు నిరాశ్రయులు కావడంతో రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ క్రింద తమకు స్వతంత్ర ప్రతిపత్తి గల జిల్లా మండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ సంక్షోభం పరిష్కారం కోసం పలు ప్రయత్నాలు జరిగాయి. 2010 నుండి ఒక పరిష్కారం కనుగొనడం కోసం త్రిపుర, మిజోరాం ప్రభుత్వాలు కలసి ప్రయత్నించాయి. వీరిని శాంతియుతంగా మిజోరాంకు తిరిగి రావడానికి 2018లో ఒక అవకాశం ఇచ్చినా అక్కడ పరిస్థితులు ఇంకా అస్థిరంగా ఉండడంతో కేవలం 300 కన్నా తక్కువ కుటుంబాలే అందుకు సుముఖత వ్యక్తం చేశాయి. మిజో తీవ్రవాదులతో నిర్దిష్టమైన ఒప్పందం లేకుండా ఆ విధంగా వెళ్లడం ప్రాణాంతకమని భయపడ్డారు.

ఇప్పుడు కొత్తగా కుదిరిన ఒప్పందం ప్రకారం త్రిపురలోనే ఉండాలి అనుకున్న శరణార్థులకు రక్షితంగా పునరావాసం కల్పించడానికి మిజోరాం, త్రిపుర, రాష్ట్రప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం, ఈ వర్గం ప్రతినిధులు ఒప్పందానికి వచ్చారు. అట్లాగే మిజోరాం కు తిరిగి రావాలి అనుకున్న వారికి కూడా వాతావరణం ఇప్పుడు అనుకూలంగా ఉంది.

స్థిరపడిన వారి భౌతిక ధ్రువీకరణ, గౌరవనీయమైన జీవనం జరపడానికి వారి అవసరాలను నిర్ణయించడం కోసం సర్వే జరపడం వంటి పరిపాలనపర చర్యలు తీసుకోవడానికి హామీ ఇచ్చారు. వీటితో పాటు వారి స్థిరనివాసం కోసం భూమిని గుర్తిస్తారు.

వారి అవసరాలకోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూ 600 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మొత్తంతో పాటు వారి అవసరాల మేరకు మరో ప్యాకేజిని రూపొందిస్తున్నట్లు వెల్లడించింది. పునరావాసం ఏర్పాటు చేయనున్న ప్రతి కుటుంబానికి నిర్ణీత మొత్తంలో ఇళ్ళు నిర్మించుకోవడానికి స్థలం ఇస్తారు.

వారికి గృహ నిర్మాణం కోసం కూడా సహాయం కేంద్రం అందించగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్మించి లబ్దిదారులకు అందిస్తారు. ఒకేసారి సహాయంగా, వారు స్థిరపడటం కోసం రూ 4 లక్షల నగదు సహాయం అందిస్తారు. భూమిని ప్రభుత్వ ఆస్తుల నుండి

కేటాయించనున్నా, అది సరిపోయే అవకాశం లేకపోవడంతో ప్రైవేట్ భూములను కూడా సమీకరిస్తారు.

బ్రూరేయాంగ్ ప్రజలను త్రిపురలో 'ముఖ్యంగా హాని కలిగించే గిరిజన సమూహం' (పివిటిజి)గా పరిగణిస్తారు. యంగ్ మిజో అసోసియేషన్, మరికొన్ని మిజో జాతీయ సంస్థల దాడి ఫలితంగా వారిలో చాలా మంది మిజోరాం నుండి పారిపోయి వచ్చినవారే.

ఈ చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేసేముందు తెరవెనుక పెద్దఎత్తున సమాలోచనలు జరిగాయి. వారి పునరావాసానికి సానుకూలత వ్యక్తం చేస్తూ నవంబర్, 2019లో పూర్వపు త్రిపుర రాజా కుటుంబం సభ్యుడు ఒకరు కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాకు లేఖ వ్రాసారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి బిప్లాబ్ దేబ్ సహితం వారి పునరావాసం కోరుతూ అందులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకొంటామని హామీ ఇచ్చారు.

పైగా, బ్రూరేయాంగ్ ప్రజలు వాస్తవానికి త్రిపురకు చెందిన వారేనని, 1976లో ఇక్కడ జల విద్యుత్ పథకం ఏర్పాటు చేయడంతో తమ భూములు, ఇళ్లను వరదలు ముంచెత్తడంతో మిజోరాం కు తరలివెళ్లారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

అంతే ప్రాధాన్యత కలిగిన మరో చారిత్రాత్మక ఒప్పందం జనవరి 27న కుదిరింది. అస్సాంలోని బోడులు, బోడోయేతరుల మధ్య దశాబ్దాలుగా జరుగుతున్న సంఘర్షణలకు తెరపడేందుకు దోహదపడనున్నది. చరిత్రలో ఎప్పుడు కూడా ఒక తీవ్రవాద బృందం దేశ సరిహద్దు అవతలి నుండి వచ్చి, ఆయుధాలను అప్పగించి, అంత స్వల్ప వ్యవధిలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని, శాంతియుత జీవనానికి ఆమోదం తెలపడం, రాజ్యాంగ పద్ధతిలో తమ డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేస్తామనడం జరగలేదు. అందుకనే ఈ ఒప్పందాన్ని తీవ్రవాద ఉద్యమాల చరిత్రలోనే చారిత్రక ఘటనగా పలువురు భావిస్తున్నారు.

చివరి బోడో తీవ్రవాద బృందం మయాన్మార్ నుండి సరిహద్దు దాటి వచ్చి పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసి లొంగిపోవడం, రాజ్యాంగ ప్రక్రియలో పరిష్కారం కోసం ముందుకు రావడం మహత్తర పరిణామం. బోడోలాండ్ జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్ డి ఎఫ్ బి)కి చెందిన మొత్తం నాలుగు వర్గాలు, అఖిల బోడో విద్యార్థి సంఘం (ఏ బి ఎస్ యు), ఐక్య బోడో ప్రజల సంస్థ (యుబిపిఒ)లు కలసి ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, అస్సాం ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్, మరో కొందరు ప్రముఖ నాయకుల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.

'ఈ ఒప్పందం అస్సాంలో నివసిస్తున్న బోడో గిరిజనులకు కొన్ని రాజకీయ హక్కులను, ఆర్థిక ప్యాకేజీని ప్రసాదిస్తుంది' అని ఈ పరిణామాలతో సంబంధం ఉన్న ఒక సీనియర్ అధికారి తెలిపారు. అస్సాం ప్రాదేశిక సమగ్రత కొనసాగుతుందని, బోడోల్యాండ్‌ను ప్రత్యేక రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేయాలన్న ఎన్‌డీఎఫ్‌బీ కీలక డిమాండ్‌కు ఈ ఒప్పందంలో చోటు దక్కబోవడం లేదని ఆ అధికారి వివరించారు.

'రాష్ట్రాన్ని విభజించకుండా రాజ్యాంగం పరిధిలో ఈ ఒప్పందం ఉంటుంది' అని మరో అధికారి వెల్లడించారు. అస్సాంలో బోడోల తిరుగుబాటుకు స్వస్తి పలికేందుకు వీలయినంత త్వరగా ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టిగా చేసిన కృషి ఫలితంగానే ఇది కార్యరూపం దాల్చింది.

బోడోలకు సంబంధించిన అన్ని వర్గాల వారు ఒకే వేదిక మీదకు రావడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. దీనితో ప్రత్యేక బోడో రాష్ట్రం కావాలని కోరుతూ జరుగుతున్న సాయుధ ఘర్షణలకు స్వస్తి పలికినట్లు అయింది. అందుకు ప్రతిఫలంగా, ఈ ఒప్పందం ప్రకారం బోడో ప్రజల ప్రత్యేక గుర్తింపును కాపాడి, ప్రోత్సహిస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

వారి బహుముఖ అభివృద్ధి కోసం, విస్తృత సమాజంలో వారు కలిసిపోయే విధంగా చేయడం కోసం కలసి పనిచేస్తామని హామీ ఇచ్చింది. బోడోలు, బోడోయేతరుల మధ్య గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్న ఘర్షణల కారణంగా 4,000 మందికి పైగా మృతి చెందారు. ఈ సందర్భంగా చెలరేగిన హింస, అశాంతి కారణంగా అస్సాంతో పాటు, ఈశాన్య ప్రాంతంలోని పొరుగు ప్రాంతాలలోని అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడింది.

ఈ ఒప్పందంలో భాగంగా సాయుధ బృందాలు తమ ఆయుధాలను విడిచి, ప్రధాన జీవన స్రవంతిలో కలవడానికి ముందుకు వచ్చాయి. ఈ సందర్భంగా బోడో ప్రజల కోసం ప్రభుత్వం రూ 1,500 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమంగా భరిస్తాయి. పైగా, అస్సాంలోని నాలుగు జిల్లాలతో కలిసిఉన్న బోడోలాండ్ ప్రాదేశిక మండలి (బిటిసి)కి అదనపు అధికారాలను కల్పిస్తారు.

ఈ సందర్భంగా ఆయుధాలు అప్పగించి, లొంగిపోయిన తీవ్రవాదులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున పునరావాసం, సహాయ కార్యక్రమాలకు ఒప్పందంలో హామీ ఇచ్చింది. బోడో భాషకు అస్సాంలో అనుబంధ అధికార భాషగా అస్సాం ప్రభుత్వం హోదా కల్పించడంతోపాటు ప్రత్యేక హైకోర్ట్ బెంచ్ ను కూడా ఏర్పాటు చేస్తారు.

ఇండో–టిబెట్– బర్మా ప్రజల వంశ వృక్షానికి చెందిన కాచారి సమూహాపు గిరిజనుల అతిపెద్ద సమూహం బోడోలు. సుమారు 35 లక్షల మంది జనాభాతో అస్సాం అంతా వ్యాపించి ఉన్నారు. ఎక్కువగా బోడోలాండ్ మండలి ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నారు. బోడోలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ 1967లో మొదలైంది.

ఈ ఒప్పందం ప్రభావం కేవలం ఈశాన్య ప్రాంతంలో, దేశంలోని ఇతర ప్రాంతాలపైన మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా విశేషంగా ఉంటుంది. వారు చెప్పే కారణాలు ఎంత గొప్పవైనా సాయుధ పోరాటాలకు కాలం చెల్లినట్లు తీవ్రవాదులే సుదీర్ఘ ఉద్యమాల అనంతరం గ్రహించడంపై ఇదొక చక్కటి తాజా ఉదాహరణగా నిలుస్తుంది.

తెలుగు భాషా వైతాళికులు గురజాడ, గిడుగు



సంపాదకులు : డా॥ పేరిశెట్టి శ్రీనివాసరావు
వెల : రు. 350/-
ప్రతులకు :శ్రీమతి పేరిశెట్టి వెంకటసీతాదేవి
డోర్ నెం : 31-4-23, 3వ అంతస్తు,
ఫ్లాట్ నెం 202; గద్దె పూర్ణచంద్రరావు వీధి,
సాయిరామ్ రెసిడెన్సీ, మారుతీనగర్,
విజయవాడ - 4, సెల్ : 9989242343

'తెలుగు జాతికి పరువు/ప్రజలభాషకి ఎరువు'-గురజాడ,
'సవర'ణానికి తొలి అడుగు/వాడుకభాషోద్యమ పిడుగు'- గిడుగు - 'అసి'

"ఆధునిక యుగంలో తెలుగు - హిందీ సాహిత్యాల ఆగమనం - గురజాడ - గిడుగుల భాగస్వామ్యం" పేరిట 2016లో 'అక్షర' (సాహితీ సాంస్కృతిక సేవాపీఠం) రాజమహేంద్రవరం నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించబడిన పత్రాలకు గ్రంథరూపం యిచ్చి పాఠకలోకానికి అందుబాటు చేసిన సంకలనం యిది. ఈ సంకలనంలో 45 వ్యాసాలున్నాయి. గురజాడ రాసిన 'విశ్వవిద్యాలయాలు : సంస్కృత మాతృభాషలు' మొదటివ్యాసం. ఇక, గురజాడపై 28, గిడుగుపై 13 ; వారిద్దరిపై సంయుక్తంగా 03 వ్యాసాలున్నాయి. వ్యాసకర్తలలో లబ్ధ ప్రతిష్ఠులు, దీర్ఘకాలంగా గిడుగు - గురజాడలపై పరిశోధనలు జరిపిన వారితో పాటుగ, సుమారుగా 22 మంది వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధక విద్యార్థులు ఉన్నారు. 'మనకి తెలియని లేదా మనం దృష్టి సారించని కొత్త విషయాలు, ప్రతిపాదనలు, కొత్త కోణాలు, కొత్త సమాచారం' అందించిన వ్యాసాలు కొన్ని ఈ సంకలనాన్ని శోభాయమానం చేసాయి. గిడుగు, గురజాడలు భాషా పరంగా చేసిన కృషి కేవలం, వాడుక భాషకు మాత్రమే పరిమితమైన ఆలోచనకాదు. అది విస్తృత స్థాయిలో విద్యకీ, పాలనకీ, సంస్కృతికీ సంబంధించిన సమస్య కూడా, గిడుగు ముందుగా గిరిజన విద్యావేత్త 'యేట్స్' ప్రోత్సాహంతో వ్యావహారిక తెలుగు భాషను గ్రంథ రచనకు సులభతరం చేసి అందుబాటులోకి తీసుకురావటానికి అత్యంత కృషి చేసి సఫలీకృతుడయాడు. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెరగటానికి, వారికి మాతృభాషలో బోధన వలన వారి సంస్కృతీ సంప్రదాయాల విలువ తెలియటానికి గిడుగు చేసిన కృషి తిరుగులేనిది. 'తెలుగు సాహిత్య భాషను నాగరికతా వ్యాప్తికి ఒక గొప్ప సాధనంగా చేయాలంటే, దాన్ని వ్యావహారిక భాషకు దగ్గరగా తీసుకు రావాలని, దానిని పూర్తిగా వినూత్నం చేయాలి' (తొలి కన్యాశుల్కం పీఠిక - 01 - 01-1897) అని పేర్కొన్న గురజాడ, కన్యాశుల్కం రెండవ సూర్యుడు పీఠిక (01-05-1909) లో 'నాకు మాతృభాషే, సజీవమైన తెలుగుభాషే, ప్రాచ్య ఇటాలియన్ అనే భాషే కావాలి...!' అని పేర్కొన్న గురజాడ, జనం భాషకు ఎంతటి ఘనమైన స్థానమిచ్చాడో ఆచార్య రాచపాళెం వారి వ్యాసంలో చూస్తాం. వేదగిరి రాంబాబు రాసిన 'గురజాడ, గిడుగూ' ; ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన 'సవర భాషాభానుడు గిడుగు' ; కీ.శే. రామతీర్థ రాసిన 'వాడుక భాషా వికాస పురుషులు గురజాడ - గిడుగు' వ్యాసం ; డా॥ గుమ్మాసాంబశివరావు రాసిన 'అజరామరుడు గురజాడ'; ఆచార్య బూధాటి వెంకటేశ్వర్లు రాసిన 'ఆధునిక కవితా ప్రేరకుడు గిడుగు'; వంటి వ్యాసాలు ఎంతో విషయ సంపదతోను, పరిశోధనా పాటవంతో రాయబడ్డాయి. 1914లో 'డిస్సెంటు పత్రం' ఆంగ్లంలో వెలువరించిన గురజాడ 'తెలుగు వాడుక భాషగా అన్ని రంగాలలో వినియోగ యోగ్యమని చెప్పే ఒక గొప్ప విశ్లేషణ' అని చెప్తూ దీనిపై తగు అధ్యయనాలు యింకా జరగాల్సి ఉందని రామతీర్థ చెప్పిన సూచన వాస్తవం. ఆధునిక తెలుగు సాహిత్య పితామహుడు గురజాడ, వ్యావహారిక భాషోద్యమ సారథి గిడుగు - వీరిద్దరిని, నిజమైన వైతాళికులని, గౌరవించే పద్ధతులని మన సమాజం పాటించాల్సి వుందని వారి అభిప్రాయం వ్యక్త పరిచారు. ఆచార్య బూ దాటి - కందుకూరి, గురజాడల గురించి ఒక శతాబ్దంపైగా విమర్శిస్తున్నారు, గిడుగుకి సంబంధించి, ఆ స్థాయిలో పట్టించుకోలేదన్నది కాదనలేని సత్యం - అని ఆవేదనను వెలిబుచ్చుతూ, తెలుగుభాషా సాహిత్యాలకు ఆధునికతా ప్రేరకుడు - గిడుగుగా భావించాలి అని చెప్పటంలో నిజాయితీ ఉంది. గిడుగూ, గురజాడా ఏ విధంగా శాసన పరిశోధనలు చేసిందీ వేదగిరి రాంబాబు వ్యాసంలో ఉంది. ఇక, యువతీ యువకులైన పరిశోధక విద్యార్థులు వారి వ్యాసాల్లో గురజాడ, గిడుగుల పట్ల, వారి రచనలు, భాషాసేవ పట్ల గౌరవం వారి భావజాలం పట్ల ఆదరణ కలిగి ఉన్నట్లుగా వారి వ్యాసాల్లో ప్రతిబింబించేలా రచనలు చేశారు. అయితే, గురజాడ రచనలలోని, 'సామాజిక దృక్పథం' 'దృక్కోణాలు', 'స్పృహ' అన్న ఒకే అంశంపై ఆరు వ్యాసాలు పునరుక్తి భావాన్ని కలిగిస్తాయి. మొత్తం మీద ప్రస్తుత పరిస్థితుల్లో, మన భాషను కాపాడుకోటానికి నిలబెట్టుకోటానికి గిడుగు, గురజాడలను ఆదర్శంగా ఈ తరం వారు తీసుకోవాలనే సదుద్దేశ్యంతో సెమినార్ నిర్వహించి, సంకలనాన్ని వెలువరించిన సంపాదకుల కృషి చాలవరకు సఫలీకృతం అవుతుందని ఆశిస్తూ, అభినందనలు తెలియచేద్దాం.

– ఎం.వి.శాస్త్రి
9441342999



విజ్ఞానశాస్త్రాన్ని అమ్మభాషలో బోధించాలని ఉపాధ్యాయులను కోరుతున్నా. దానివల్ల చిన్నారుల్లో 'సైన్స్ సృజనాత్మకత' పెరుగుతుంది. పాఠ్యాంశాన్ని త్వరగా అర్థం చేసుకునే శక్తీ సమకూరుతుంది. నేను పదో తరగతి వరకూ మాతృభాషా మాధ్యమంలోనే చదువుకున్నా. తర్వాత ఆంగ్లం నేర్చుకున్నా. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలు చూపించే సృజనాత్మకతే వారి భవిష్యత్తుకు పునాది. ఆ సృజనాత్మకత అమ్మభాషలో చదువువల్లే సాధ్యం.

డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలామ్





భారతీయ భౌతికవాద తత్వవేత్త, మార్క్సిస్టు చింతనాపరుడు దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ (1918–1993)
రచన : టి.రవిచంద్
పుటలు: 32, వెల :25/–
ప్రతులకు :టి.రవిచంద్, హెచ్ నెం. 11–5–4, నాళం వారి వీధి, బాపట్ల – 522 101
ఫోన్ : 9966134406

తెలుగు శిల్పుల చరిత్ర, సంస్కృతి (శాసనాల ఆధారంగా)
రచన :ఈమని శివనాగిరెడ్డి
పుటలు :18, వెల :20/–
ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత& సంస్కృతి సమితి, 2వ అంతస్తు, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, దుర్గాపురం, విజయవాడ – 3




పాండిచ్చేరిలో శ్రీ అరబిందో ఆశ్రమం
(యాత్రలో జీవన యాత్ర)
వర్ణన : హర్షవర్ధన్, పుటలు:48, వెల :60/–
ప్రతులకు :సిహెచ్.హర్షవర్ధన్ రాజు దుర్గానంద్‌గారి కుమారుడు, ఫ్లాట్ నెం. 406, ఎస్.వి.ఎస్.హోమ్స్, సాయినగర్
గన్నవరం, కృష్ణా (జి) –521 101
సెల్ : 9441519210





మనదేశపు తొలి శివాలయం గుడిమల్లం పరశురామేశ్వరాలయం
రచన :ఈమని శివనాగిరెడ్డి
పుటలు:86,వెల:100/–
ప్రతులకు : అల్లూరు బత్తినాయుడు
ఇం.నం. 11–53, ఎస్వీనగర్, పోస్టాఫీసువీధి
తిరుపతి – 517501, సెల్ : 7337038575




అక్షర కింకిణులు (సాహిత్య వ్యాసాలు)
రచన :ఎస్.ఆర్.పృథ్వి
పుటలు:76, వెల:80/–
ప్రతులకు: శ్రీమతి ఉషారాణి, 3–866, ఎం.జి.వీధి రామకృష్ణా నగర్, రాజమహేంద్రవరం – 533101
మరియు అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు
ఫోన్: 9989223245

ఊయల : బాల గేయాలు
రచన : గుళ్ళపల్లి తిరుమలకాంతికృష్ణ
పుటలు: 70, వెల :80/–
ప్రతులకు :గుళ్లపల్లి కవిత కాంతికృష్ణ
ఇం.నెం. 16–16, చేర్యాల, సిద్దిపేట (జి)
సెల్ : 9490003295



అమ్మంటే జీవననాదం (కవితా సంపుటి)
రచన :కాళంరాజు వేణుగోపాల్
పుటలు:160, వెల: రు.150/
ప్రతులకు : కాళంరాజు వేణుగోపాల్
ఇం.నెం. 1–203–ఎ–33, రామకృష్ణా కాలని, మార్కాపురం – 523 316, ప్రకాశం (జి)
సెల్ : 8106204412





కాలమిచ్చిన తీర్పు (రెండు నవలికలు)
రచన : తురగా జయశ్యామల
పుటలు:185, వెల: రు.150/
ప్రతులకు : తురగా జయశ్యామల, ఫ్లాట్‌నెం. 706, ఆరాధనా 'బి' వింగ్, జి.డి. అంబేద్కర్ రోడ్, దాదర్, ముంబై 400 014,
మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు
సెల్: 09820003133



తెలుగు విలాపం (వ్యాసాలు)
సంకలనం : అడపా రామకృష్ణ
పుటలు:44, వెల: రు.50/–
ప్రతులకు : అడపా రామకృష్ణ, డోర్ నెం. 43–21–21, వి.ఆర్.నగర్, దొండపర్తి, విశాఖపట్నం–530016
ఫోన్: 95052 69091

భక్త మందారము (కల్లూరువారి సాహిత్యమాల 2)
రచన : కల్లూరు అహోబలరావు
పుటలు: 136, వెల: రు.120/–
ప్రతులకు :నా పుస్తకం
శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల
హిందుపూర్ – 515 201
ఫోన్ –9493271620



విరాళి (కవితలు)
రచయిత:జన్ను లక్ష్మి
పుటలు:200,వెల:150/–
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్, నవోదయ బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు
సెల్ : 9494480753





మూడో కన్నీటి చుక్క (కవిత్వం)
రచన : బొల్లోజు బాబా
పుటలు: 120, వెల :100/–
ప్రతులకు :బొల్లోజు బాబా 30–7–31 సూర్యనారాయణ పురం, కాకినాడ, తూ.గో.జి
సెల్ : 9849320443

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

గుంటూరులో ఆదిధ్వని మహాప్రదర్శన












ఫిబ్రవరి 25 నుండి 28 వరకు నాలుగు రోజులపాటు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఒక అపురూప కార్యక్రమంతో కళకళలాడింది. సామాజిక, సాంస్కృతిక చైతన్యం కలిగిన గుంటూరు పురవాసులకు 'ఆదిధ్వని' గిరిజన జానపద సంగీత వాద్య ప్రదర్శన, సంగీత ఉత్సవాలు ఒక మరపురాని అరుదైన అనుభవాన్ని కలిగించాయి. కొద్ది నెలల క్రితం హైదరాబాదులో జరిగిన ఈ ప్రదర్శన వివరాలను 'అమ్మనుడి' పత్రికలో ఇచ్చిన సంగతి పత్రిక చదువరులకు గుర్తుండినసంగతే. అదే కార్యక్రమం ఇప్పుడు గుంటూరులో మరింత కనుల విందుగా, శ్రవణానందకరంగా జరిగింది. బహుశా ముమ్ముందు మరికొన్ని చోట్ల ఇది జరుగవచ్చు కూడా.

ఇంతటి మహత్తర అనుభవాన్ని అందరికీ కలిగిస్తున్నవారు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ఆచార్య గూడూరు మనోజ వారి సహచరులు. కాగా, గుంటూరులో ఇంతటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినవారు శ్రీ నన్నపనేని అయ్యన్‌రావు, శ్రీ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, శ్రీ తాండవకృష్ణ. వీరందరి ఆసక్తికి, కృషికి జేజేలు.

ఈ నాలుగురోజుల కార్యక్రమాల్లో – ముఖ్య అతిధులుగా డా॥ సామ్యూల్ బెర్త్ (అలయన్స్ ఫ్రాంఛైస్ డైరెక్టర్), అనూరాధ గునుపాటి ('సప్తగిరి' డైరెక్టర్), డా॥ ఎస్.మునిరత్నం నాయుడు, డా॥ ఎస్. పృధ్వీరాజ్, కె.ఎస్.లక్ష్మణరావు ఎం.ఎల్.సి, విశిష్ట అతిధులుగా శ్రీ గోరటి వెంకన్న, డా॥ సామల రమేష్‌బాబు, శ్రీ రావెల సాంబశివరావు, డా. కందిమళ్ల సాంబశివరావు, డా॥ బూసురపల్లి వెంకటేశ్వర్లు, శ్రీ నల్లూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గౌరవ అతిధులుగా శ్రీయుతులు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, ఆచార్య గూడూరు మనోజ, సిహెచ్. మస్తానయ్య, డా॥పాపినేని శివశంకర్, మోదుగుల రవికృష్ణ, నాగళ్ల వెంకటదుర్గా ప్రసాద్, పొట్లపల్లి వరప్రసాదరావు, డా. ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారు. సభాధ్యక్షులుగా శ్రీయుతులు నన్నపనేని అయ్యన్‌రావు, నాయుడుగోపి, పి.వి.మల్లికార్జునరావు, బి.పూర్ణ – వ్యవహరించారు. పద్మావతి కళావేదిక నిండుగా సంగీత వాద్యాల ప్రదర్శన, అన్నమయ్య కళావేదిక ప్రాంగణమమంతా నిండిన ప్రేక్షకులతో వాద్యగోష్ఠి, సభాకార్యక్రమాలు చరిత్రాత్మకంగా నిలిచాయి.

---

25 ఫిబ్రవరి 2020 నాడు గుంటూరులో పద్మావతీ కళ్యాణ మండపంలోని 'ఆదిధ్వని' సంగీత వాద్యాల ప్రదర్శనని అనురాధ గుణపాటి గారు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 'వైవిధ్యభరితమైన సంగీతానికి భారతదేశం పెట్టింది పేరు. ఇంకా మన సంగీత ప్రపం చానికి విదేశాలలో ప్రచారం కావాలి. ఈ వాద్యాలను మనం కాపాడుకోవాలి. అందుకే ఈ ప్రదర్శన ఆ మార్గంలో ఒక మైలురాయి. అంతరించి పోతున్నవాద్యాలను, అణగారి పోయిన సంగీత కళాకారులను బతికించుకోవాలి. ఇది మన విధి బాధ్యత కూడా. ఇలాంటి అవకాశం రావడం గొప్ప సుకృతం. ఊరూరా ఇలాంటి ప్రదర్వన ఏర్పాటు చేయాలని కోరుతున్నాను' అని అన్నారు.



అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
March 2020 Vol :6, Issue 1

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20



If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244